
# ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక



4 అణాలు
19-3-52

# ఈ నెలలో విడుదల!



భరణీ వారి

# ప్రేమ

"Love"

భానుమతి...నాగేశ్వరరావు

శ్రీరంజని..ముక్కామల..రేలంగి..శివరావు

సి.యస్.ఆర్..సురభికమలాబాయి..సీతారాం

నటించినది..

సంగీతం.. సుబ్బరామన్

కెమెరా.. కమాల్ ఘోష్

మాటలు, పాటలు.. కె.జి.శర్మ

ఆర్టు.. కె.నాగేశ్వరరావు

స్టూడియో

వాహిని

పూర్ణారిలీజ్..



డైరెక్టర్...

రామకృష్ణ

MATA

డిస్ట్రిబ్యూటర్లు :

ఆంధ్ర, సీడెడ్, నైజాం :

పూర్ణాపిక్చర్స్, విజయవాడ

★

మైసూర్ & కూర్గ్

డ్రీమ్ లాండ్ పిక్చర్స్,

కార్పొరేషన్, బెంగుళూరు 2

★

ఇతర వివరములకు :

భరణీపిక్చర్స్, మద్రాసు 17.

# ఆంధ్రపత్రిక

| సంవత్సరచందా<br>రు. 12-0-0<br>విడిప్రతిక<br>4 అణాలు | ప్రతి బుధవారము<br>ప్రకటింపబడును<br>**Founder : K. NAGESWARA RAO** | సంపుటము **44**<br>సంచిక **28**<br>**19.3-52** |
|---|---|---|

ఖర సంవత్సర ఫాల్గున బహుళ అష్టమి బుధవారము


## విషయానుక్రమణిక

**1952 మార్చి 19**



24, 25 పేజీలలో ప్రచురించబడిన 'స్వప్న లోకంలో ఆలిస్' కార్టూన్ చిత్రాలు వాల్ట్ డిస్నీ తీసిన త్రివర్ణ చలనచిత్రం లోనివి. వీనిని ప్రచురించుటకు అనుమతించిన ఆర్. కె. ఓ. రేడియో పిక్చర్స్ వారికి మా కృతజ్ఞత.

# రాయలసీమలో కరువు

రాయలసీమలో కరువుపరిస్థితి గమనించడానికి కేంద్రఆహారశాఖామంత్రి మున్షీగారు మద్రాసు - బొంబాయి రైలు మార్గానికి సమీపంలో ఉన్న గ్రామాలను రెండురోజులు పర్యటించారు. పర్యటించి పరిస్థితి దుర్భరంగానే ఉన్నట్లు ఒప్పుకుని, ఈ ప్రాంతాలలో మైనర్ ఇరిగేషన్ కార్యక్రమాలపట్ల శ్రద్ధ వహించబడిందని వారే అన్నారు. ఇప్పటి పరిస్థితిలో రెండు ముఖ్యమైన ప్రమాదాంశాలు ఉన్నట్టు మున్షీగారు కనిపెట్టారు. అవి నీటికరువు, ప్రజలకి పనిలేకపోడం. కాని ఈపరిస్థితి ఇప్పటికిప్పుడొచ్చిపడుచున్న ప్రమాదం కాదు, రాయలసీమలో నిత్యం ఉండేదే. అయితే రాజకీయాల చెడుగుళ్లలోనూ, పెద్ద ప్రాజెక్టుల తలపట్లలోనూ రాయలసీమ అవసరాలు మరుగున పడిపోయాయి.

రాయలసీమలో ఈనాడు అన్ని ప్రాజెక్టులకంటేనూ, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు ముఖ్యావసరం. వందలాది చెరువులు సీమ అంతటా మేటవేసుకుపోయి నీటి సదుపాయం కరువైపోతే గమనించినవారు లేకపోయారు. ప్రతి చిన్నపనికీ ప్రభుత్వం కంట్రాక్టర్లపైన ఆధారపడ్డంలో మంజూరైన కొద్ది మరమ్మతు స్కీములూ కూడా కొనసాగకుండా అట్టే ఉండిపోయాయి. ప్రభుత్వం శ్రద్ధ తలపెట్టితే చాలు సహకరించడానికి ప్రజలు సంసిద్ధులైవున్నారు. తమకు కావలసిన త్రాగేనీరూ, భూమి సాగుకి అవసరమైన నీరూ సమకూర్చే కార్యక్రమాలలో ప్రజల సహకారం లేదని భావించడం అన్యాయం. మాటిమాటికీ ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజలసహకారం ఇంకా అవసరమనే పంతపాట మామూలైపోయింది కాని ప్రభుత్వం సవ్యంగా తలపెట్టడమే కనపడదు. గత రెండు సంవత్సరాలుగా కర్నూలుజిల్లాలో కొన్నిప్రాంతాల ప్రజలు తమ చెరువుల మరమ్మతుకి ప్రభుత్వం కార్యక్రమం మంజూరుచేసి పని ప్రారంభిస్తే చాలు చవగ్గా కూలీలను స్వయంగా ఏర్పాటు చేసుకోగలమని చెప్తున్నప్పటికీ ప్రభుత్వం చెడచెవినిపెట్టిన సంగతి అంతగా ప్రచారంకాలేకపోయింది. నిజానికి రాయలసీమలో వివిధ కార్యక్రమాలను (తలపెట్టినవీ, మంజూరైనవీ) కొనసాగించలేకపోయినారంటే నిందను పూర్తిగా ప్రభుత్వాధికారులే భరించాలి. అక్కడ ఆ కార్యక్రమాలలో ప్రజలు సహకారాని కెన్నడూ వెనుదియ్యలేదు. రాజకీయకక్షులవల్లనూ అధికారుల అశ్రద్ధవల్లనూ రాయలసీమ ఈనాడు దుర్భిక్షంలో అల్లాడిపోతోందని చెప్పాలి.

మున్షీగారు భూసేన అంటూ మొదలుపెట్టాలనుకుంటే కేవలం మాటలతో పొసగదు. భూసేనలో చేరడానికి ప్రజలను ఆకర్షించగల కార్యక్రమాలను సమగ్రంగా తయారుచేసి చూపాలి. రాయలసీమలో ఇప్పుడు ఆఖరుక్షణంలో ఏ కార్యక్రమాన్ని తలపెట్టినా ఫరవాలేదు కాని ముందుగా బాధానివారణ అవసరమని గ్రహించాలి. జనం తిండికీ నీటికీ మొహంవాచి ఇతర ప్రాంతాలకు వలసపోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇదివరలో బావుల సబ్సిడీల మాదిరిగా కాకుండా ప్రభుత్వం స్వయంగా పూనుకుని వెంటనే నూతులు త్రవ్వించి, చెరువుల మరమ్మతు ప్రారంభించడం అవసరం.

గంజిపాకల్ని స్థాపించడంతో బాధానివారణ కాదు. కంట్రాక్టర్లచేత రోడ్డు పనులు, క్వారీపనులు, ప్రారంభింపచేస్తే కూడా చాలదు. కూలికి కనీసప్రమాణాలు నిర్ణయించి ప్రభుత్వం నష్టం భరిస్తూ చౌకడిపోలలో ఆహారవస్తువులను అమ్మే ఏర్పాట్లు చెయ్యాలి. పనిచెయ్యడానికి ప్రజలు తండోపతండాలుగా వస్తున్నారు కదా అని కంట్రాక్టర్లు లాభాలు లావు చేసుకోడానికి ప్రయత్నిస్తున్నట్లు అనేకచోట్ల ఫిర్యాదులు వస్తున్నాయి. ఇది అతి నీచమైనది. ప్రభుత్వం కంట్రాక్టర్లను నియమించడంలో జాగ్రత్తవహించి ప్రజలను వంచించే అవకాశం లేకుండా చూడ్డం అవసరం. క్షామబాధానివారణనిమిత్తం వివిధరాజకీయ పక్షాలు నిధులు చందాలు చేరుస్తున్నాయి. వీని నన్నిటినీ ప్రజలకు సక్రమంగా వినియోగపడే విధంగా ప్రభుత్వం ఆ సంఘాల సహకారాన్ని సాధించడం అవసరం.

ప్రస్తుత బాధానివారణ ఒకఎత్తు; రాయలసీమలో నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించడం ఒకఎత్తు. నాలుగైదేళ్లుగా వానదేవుడు భీష్మించినందువల్ల రాయలసీమ అంతటా నీ రెండిపోయింది. వర్షాలు ఉన్న కాలంలో కూడా రాయలసీమలో నీటి బాధ ఏనాడూ తప్పలేదు. ఈ బాధను నివారించడానికిగాను మద్రాసు రాష్ట్రానికి నిర్ణయించబడిన పంచవర్ష ప్రణాళిక కార్యక్రమాలలో రాయలసీమకోసం నిర్ణయమైన కార్యక్రమాలను ప్రధానమైనవిగా ఎంచి వెంటనే పని ప్రారంభించడం అవసరం.

## ఢిల్లీలో నిజాం నవాబు

పదహారేళ్లకి మళ్లీ ఈనాటికి నిజాం నవాబు సర్ ఉస్మాన్ అలీఖాన్‌గారు హైదరాబాద్‌నించి కదిలివెళ్లారు. హైదరాబాద్ రాజప్రముఖులుగా గవర్నర్ల రాజప్రముఖుల సమావేశంలో పాల్గొనడానికి నిజాంగారు ఇద్దరు భార్యలతోనూ, ఇతర బంధుజనం, పరిచారకులు మొత్తం 74 మందితో మూడు ప్రత్యేక విమానాల్లో ఢిల్లీ వెళ్లారు. మొదట ఢిల్లీనుంచి మక్కాకు పెట్టుకున్న ప్రయాణాన్ని తరవాత రద్దు చేసుకున్నారు.

భారతస్వాతంత్ర్యలబ్ధి అనంతరం హైదరాబాద్ ప్రభుత్వంతో భారత ప్రభుత్వం సంస్థానశాఖవారు సాగించిన రాయబారాలలో ఒకసారి ఢిల్లీకి రమ్మని పటేల్

(47-వ పేజీ చూడండి)

# ★ మద్రాస్ డైరీ ★



"మిస్ మద్రాస్" బిరుదుపొందిన ఆంధ్రుల అందాలరాణి సూర్యకుమారి.

శ్రీ పాలకుమ్మి పద్మరాజు వారి "గాలివాన" కథకు ప్రపంచ కథానికల పోటీలో బహుమానం రావటం ఆంధ్రులందరూ గర్వించదగిన విషయం. పోటీ నిమిత్తం వచ్చిన తెలుగు కథల్లో ఉత్తమమైన నాలుగింటిని ఏరి "ఆంధ్రపత్రిక" వారు ఢిల్లీ "హిందూస్థాన్ టైమ్స్"కు పంపించారు. "హిందూస్థాన్ టైమ్స్" వారు వివిధ భారతీయ భాషల కథలలో ఉత్తమమని తోచిన రెండు కథలనేరి ప్రపంచ కథానికల పోటీ ప్రారంభకులైన న్యూయార్క్ "హెరాల్డ్ ట్రిబ్యూన్" వారికి పంపించారు.


ఈ రెండుపోటీలను విజయవంతంగా దాటుకొని వెళ్ళిన పద్మరాజుగారి కథ ప్రపంచ ఉత్తమ కథానికలలో స్థానం పొందింది. రెండు ఫ్రెంచి కథలు, ఒక ఫిన్నిష్ కథ, ఒక నార్వేజియన్ కథ, ఒక తెలుగు కథ ఈ గౌరవం పొందినవి. ఒకే ఉత్తమ కథను (5000 డాలర్ల బహుమానం) నిర్ణయించవలసిఉన్నప్పటికీ, ఏ కథకూ మెజారిటీవోట్లు రానందున బహుమతి నిర్ణేతలు బహుమానధనం అయిదు కథలకు పంచవలసి వచ్చింది. యూరపియన్ భాషలలో నాలుగు కథలకు ప్రపంచ గౌరవం రాగా, ఆసియా భాషలలో ఒక్క తెలుగు భాషాకథకు మాత్రం ఆ గౌరవం దక్కటం మనం నిజంగా గర్వించదగిన సంగతి. వివిధ సాహిత్య శాఖలలో, ముఖ్యంగా నవ్య కవిత్వంలోను, కథానికలలోను అనతికాలంలోనే తెలుగుభాష ఇతర భారతీయ భాషలన్నిటికంటే ముందంజ వేసింది. ప్రపంచ వాఙ్మయంలో ఎక్కడో దూరదూర దేశాలలో ప్రవర్తిల్లే కొత్త కొత్త పరిణామాలన్నీ ఎప్పటికప్పుడు మన సాహిత్యంమీద ప్రభావం ప్రసరిస్తూనే ఉన్నాయి. అయినా ఈనాటి వరకూ తెలుగు భాషకు బెంగాలీ, ఉర్దూ, హిందీ భాషలకు మల్లే ప్రపంచ పరిగణన లభించలేదంటే అవకాశాలు తగినన్ని లేకపోవటం, ఉన్నవాటిని మనం బద్ధకం వల్ల ఉపయోగించుకోలేకపోవటం తప్ప మరే కారణమూ లేదేమో. ప్రస్తుతం తెలుగు కథకు లభించిన ప్రపంచ గౌరవం మన సాహిత్యకారులకు అంతర్జాతీయరంగంలోకి దూకాలనే ఆసక్తి కలిగిస్తుందని ఆశించవచ్చును.

* * * *


పద్మరాజుగారి కథ నిస్సంశయంగా ప్రపంచ బహుమానానికి తగిన కథ. పద్మరాజుగారు సైన్సు విద్యార్థి; సైన్సు పోకడలను, సైన్సు అభివృద్ధి వాఙ్మయంమీద ప్రసరిస్తున్న ప్రభావాన్ని జాగ్రత్తగా గమనిస్తున్న రచయిత. వీరు అనేక కథలు, నాటికలు వ్రాశారు. కథలకంటే మిన్నగా కవిత్వం వ్రాశారు. వీరి 'పురిటిపాట,' 'చీకటి' అనే గేయాలు వీరి భావవైచిత్రి, చమత్కృతికి ఉదాహరణలు.

"గాలివాన" కథలో బిహేవియరిజం (ప్రవర్తనవాదం) ప్రభావం ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. మనిషి ప్రవర్తన బాహిరమూ అంతరమూ అయిన భౌతిక వాతావరణంమీద ఆధారపడివుంటుందనీ, కనుక మనిషి మనస్తత్వాన్ని నిర్ణయించాలంటే అతని ప్రవర్తనను, దానికి కారణమైన భౌతిక పరిస్థితులను ఆధారంగా తీసుకోవాలనేది బిహేవియరిజం. ఈ కథలో రావుగారు పై మధ్యతరగతికి చెందిన మనిషి. సుఖానికి అలవాటుపడ్డ ప్రాణి. ప్రతి విషయంమీద నిశ్చితమైన, తీవ్రమైన అభిప్రాయాలున్నవాడు. జీవితాన్నంతనీ ఆ అభిప్రాయాల్లో ఇరికించి, ఆ అభిప్రాయాలకు అనుగుణంగానే జీవితం గడుపుతున్నానని తన్ను తను మోసపుచ్చుకొంటున్న వ్యక్తి. ఆ వ్యక్తిని ఒడుదుడుకులు లేని పరిస్థితుల నుండి అసాధారణమూ, భయానకమూ

(46-వ పేజీ చూడండి)




విమాన మెక్కుతున్న భావనగర మహా రాజా, వారికి వీడ్కోలిస్తున్న మద్రాసు ప్రముఖులు.




# ★ వార్తా చిత్రాలు ★


మద్రాసు గవర్నరుగా ప్రమాణం స్వీకరిస్తున్న శ్రీ శ్రీప్రకాశ, ఛీఫ్ జస్టిస్ శ్రీ రాజమన్నార్.

ఢిల్లీలోని స్విస్ రాయబారి ఇచ్చిన విందులో రాయబారి, శ్రీ శ్రీప్రకాశ, శ్రీ మున్షీ మొదలైన వారు.






గవర్నర్లు, రాజప్రముఖుల సమావేశంలో నెహ్రూ, రాజేంద్ర ప్రసాద్, నిజాం నవాబు మొదలైనవారు.



రాజమండ్రి షెపర్డ్ సోషల్ రిక్రియేషన్ క్లబ్ ఎమెచూర్ డ్రమెటిక్ ఎసోసియేషన్.



మద్రాసు ఒలింపిక్స్ బసలో ఓవల్టిన్ కాంటీన్‌లో భావనగర మహారాజా, మద్రాసు కార్పొరేషన్ కమీషనరు సి. డి. నరసింహం మొదలైనవారు.



గుంటూరు సాహితి ఆర్ట్ థియేటర్స్ సభ్యులు.

# గాలివాన

శ్రీ పాలగుమ్మి పద్మరాజు



శ్రీ పద్మరాజు

ప్రపంచ కథానికల పోటీలో ఉత్తమోత్తమమైన అయిదు కథలలో ఒకటిగా వీరికథ ఎంచబడింది. దీనితో తెలుగు కథా సాహిత్యానికి ప్రపంచ సాహిత్యంలో ఒక స్థానం ఏర్పడుతున్నది. కథకులను అభినందిస్తూ, ఈసందర్భాన్ని పురస్కరించుకుని బహుమతి పొందిన కథను 1951 మే 12 వ తేదీ ఆంధ్రపత్రిక నుండి పునరుద్ధరిస్తున్నాం.

---

మబ్బు మసగ్గా అలుముకుపోయింది. రైలు చాలా ఆలస్యంగా వచ్చింది. రావుగారు రెండో తరగతి పెట్టె ఎక్కుతుంటే, ఆయనకు తన యిల్లు, ఆ యింట్లో అలవాటుపడ్డ సుఖాలు అన్నీ జ్ఞాపకం వచ్చాయి. ఆయన చదువుకునే గది అతి శుభ్రంగా తుడిచివుంది. అందులో నల్ల విరుగుడు చేవతో చేసిన రాతబల్ల, దాని మీద ఒక మూలగా ఆకుపచ్చ గొట్టంలో దీపం వెలుగుతూ వుంటుంది. ఆయన కుర్చీ మెత్తలో కూర్చునేచోట అనుకూలమయిన పల్లాలు ఏర్పడ్డాయి. సోఫాలో వున్నట్టు కూడా తెలియకుండా ఆయన భార్య కూర్చునిఉంటుంది. ఆయనకు నలుగురు పిల్లలు. ఇద్దరు ఆడ, యిద్దరు మగ. వాళ్ళని చూస్తే ఆయనకు ఎంతో గర్వం.

రైలుపెట్టెలో మూడు మెత్తలూ ఎవరో ఆక్రమించుకుని పరుపులు పరుచుకున్నారు. తను ఎక్కినందుకు అందులో వున్న నలుగురు ప్రయాణీకులు చిరాకు పడుతున్నట్టు, రావుగారు వాళ్ళ ముఖాలు చూడకుండానే గ్రహించారు. ఇంకో పెట్టెలోకి వెడితే బాగుంటుందని ఆయనకు అనిపించింది. కాని కూలివాడు ఆయన బెడ్డింగూ, పెట్టె, గొడుగు పైబల్లమీద పెట్టి వెళ్ళిపోయాడు. ఇంతలో రైలు కదిలిపోయింది. ఒక పెద్ద మనిషి పరుపు కొంచెం మడిచి రావుగారికి చోటుచేశాడు. రావుగారు కూర్చుని పరిసరాలు వీక్షించడం ప్రారంభించారు.

నలుగురూ దూరప్రయాణీకులని ఆయన గ్రహించాడు. బూట్లు, మేజోళ్ళతో సహా బల్లల క్రిందకు తోసివేయబడి వున్నాయి. కోట్లు, పాంట్లు, చొక్కాలు పైకొంకెలకు తగిలించివున్నాయి. వదులయిన పైజామాలను ముగ్గురు మగప్రయాణీకులు తొడుక్కున్నారు. వస్తువులన్నీ యిటూ అటూ తొందరలేనట్టు పరిచి ఉన్నాయి. కిటికీల పక్కనివున్న రెండు మెత్తలమీదా ఇద్దరు పెద్ద వయసువాళ్లు కూచున్నారు. లోపలగా వుండే నిడుపైన బల్ల మీద ఒక యువకుడు, ఒక యువతీ కూర్చునిఉన్నారు. యువతి ఆ యువకుని భార్య అయివుంటుంది. సిగరెట్టు పొగ మెల్లని ఘాటు రావుగారి నాసికారంధ్రాలలోకి తెలియకుండా ప్రవేశించి ఒక క్షణంపాటు ఆయన్ని ఉక్కిరి బిక్కిరి చేసింది.

రైలు పెట్టెలో సిగరెట్టు పొగనుగురించి రావుగారికి తీవ్రమయిన అభిప్రాయాలున్నాయి. అనేక విషయాలనుగురించి ఆయనకు తీవ్రమయిన అభిప్రాయాలున్నాయి. అసలు ఆయన వేదాంతి. ఆయనకొక అభిమాన సిద్ధాంతముంది — వేదాంతం జీవితంతోటీ, జీవన విధానంతోటీ, వ్యక్తికీ సంఘానికీ మధ్య ఏర్పడే రకరకాల సమస్యలతోటీ అనుబంధించి వుంటుందని ఆయన వాదము. ఆయన ప్రకారం, వేదాంతానికి మరణానికి నిశితమైన మానవానుభవాలకికూడా అతీతమయిన విషయాలతో గాని ఏమీ సంబంధంలేదు. ఆయన జీవితం సుఖంగా మిట్టపల్లాలు లేకుండా గడిచిపోయింది. అసంతృప్తివల్ల ఆయన జీవితాన్నిగురించి అమితమయిన ఉత్సాహంతోటీ పవిత్రమైన ఉద్రేకంతోటీ మాట్లాడగలరు. ఒక్క వేదాంతిగానే గాకుండా, మంచి వక్తగా కూడా ఆయన ప్రఖ్యాతి పొందాడు. ఆయన తన వేదాంతాన్ని అనుపమానంగా ఉద్విగ్నుడై ఆయన వివరిస్తూవుంటాడు. అసలు ఈ ప్రయాణంచేస్తున్నది ఒక ఉపన్యాసం యివ్వడంకోసం. 'ఆస్తిక మహాసమాజము' అని పేరుపెట్టుకున్న ఒక సంస్థ ఆహ్వానం మీద కూడా ఆయన వెడుతున్నారు. ఉపన్యాసం: సామ్యవాదమూ రమ్యరసామోదము అనే విషయాన్నిగురించి. ఆయన అభిప్రాయం సామ్యవాదంలో ఈశ్వరసాత్మ్యత ఉందనో లేక ఆ రెండూ పరస్పరవిరుద్ధమయినవి కావడంచేత వాటికి ఒక సమన్వయం కల్పించాలనో తెలుసుకోవాలంటే ఆయన ఉపన్యాసం వినవలసిందే.

రావుగారు యువదంపతుల వేపు చూచారు. యువతిముఖం చాలా బరువుగా వుంది. ఆమెకు కొత్త వుత్సాహం కలగడానికి కాబోలు యువకుడు నవ్వుతూ ఆమె చెవిలో ఏదో అన్నాడు. బహుశా తన భర్తతో కూడా ఏదో అతను ఉద్యోగంలో వున్న దూరదేశానికి మొదటిసారి ఆమె వెడుతున్నట్లున్నది. రావుగారికి ఈ మధ్యనే తాను యిచ్చిన ఉపన్యాసం జ్ఞాపకం వచ్చింది. "సత్యము—తత్వము. ఆయన ఉపన్యాసాల శీర్షికలు శబ్దాలంకారాలనుబట్టి నిర్ణయమవుతాయిగాని, అర్థస్ఫురణనుబట్టి కాదనిఆయన స్నేహితులుకొందరు ఆయన్ని వేళాకోళం చేస్తుంటారు. అది నిజంకాదని

ఆయన ననలేదు. కాని ధ్వనినిబట్టి అర్థం అనుసరిస్తోందని మాత్రం సమాధానం చెబుతుంటారు. ఆయన ఇచ్చిన ఉపన్యాసాలలో చాలా అందమయినది "ప్రకృతి పరిష్కృతి."

గాలి పెరిగింది. బలంగా కిటికీతలుపుల మీద ఒత్తుతోంది. ఉన్నట్టుండి పెట్టెలో చీకటిగా అయిపోయింది, ఎందుచేతో. ఇంకా సాయంత్రం అయివుండదు. రావుగారి ప్రక్కన కూర్చున్న పెద్దమనిషి కనిపించి కనుపించని దీపపు వెలుగులో ఒక అపరాధపరిశోధకనవలను తదైక్యంతో చదువుతున్నారు చటుక్కుని అతను ముఖం ఎత్తి 'టైము ఎంతఅయివుంటుంది' అని రావుగారి నడిగాడు రావుగారు ఒక క్షణం ఆలోచించారు, ఆయన చేతికి గడియారం ఉన్నా కూడా. "మూడుగంటలు అయివుండవచ్చు" అన్నారు.

"ఎంత చీకటిగా అయిపోయింది!" అన్నాడు పెద్దమనిషి. రావుగారు సమాధానం చెప్పకుండా ఆ పెద్దమనిషి వేపు చూచారు. ఆయనకు రావుగారి వయస్సే వుంటుంది ఏభైఏళ్లమనిషి. ఒక అపరాధ పరిశోధక నవల చదువుతూ ఆనందించటం రావుగారికి వింతగా కన్పించింది. ఎదురుగా కూచున్న ముసలాయన గంభీరంగా చుట్టకాలుస్తూ దాని రుచిని ఆస్వాదిస్తున్నాడు కొందరు మనుష్యుల స్వభావాలే అంతే అనుకున్నాడు రావుగారు. ఎదురుగా కూర్చున్న ముసలాయన రావుగారికంటె పెద్దవాడయియుంటాడు. కాని ఆయన ముఖంలో కుర్రవాళ్ళకి సహజమైన చురుకు ఉంది అయినా ఆ ముఖం ఆయన వయస్సును మాటుపరచడంలేదు. జారిపోయిన దవడలు, ముడతలుపడ్డ నుదురు, వయస్సును చాటుతూనే ఉన్నాయి రావుగారికి ఉపన్యాసానికి ఇంకొకవిషయం స్ఫురించింది. 'వయోవిపాకము. మనోవివేకము'

తాను చాలా అదృష్టవంతుడని రావుగారికి గర్వం. ఆయన జుట్టు ఒత్తుగా నల్లగా ఉంటుంది. ఆయన భార్య ఆయనకంటె పెద్దదిలా కన్పిస్తుంది తెలియని వారు ఆమె ఆయన అప్పగారో, తల్లో అని భ్రమపడుతూ ఉంటారని ఆయన తరుచుగా వేళాకోళం ఆడుతుంటారు ఆయనకొక ఇరవయ్యయిదేళ్ల కొడుకున్నాడనీ, ఆకొడుక్కి అప్పుడే యిద్దరుచక్కని పిల్లలున్నారనీ, అతను యీ మధ్యనే తండ్రిగారి న్యాయవాదవృత్తి నంతనీ తనే చూసుకోడం ప్రారంభించాడనీ, రావుగారిని చూసిన వాళ్లెవరూ అనుకోరు. ఆయనంత అర్జనవున్న వాళ్లెవరూ న్యాయవాదవృత్తినుండి విరమించలేదు. ఆయన తన జీవితంలో కొన్ని నియమాలను పాటించాలని నిశ్చయించుకున్నాడు. వాటిని అతిక్రమించకుండా వుండగల సాహసం ఆయనకు వుంది. నీతి, నియమాలనుగురించి ఆయనకు పిచ్చ పట్టుదలలేదు. కాని మనిషి నడవడిని దిద్దడానికి కొన్ని నియమాలు ఉండి తీరాలని ఆయన అభిప్రాయం ఆయన పిల్లలను నెలకో సారి సినిమాలకు వెళ్లనిచ్చేవాడు అంతకంటె తరుచుగా మాత్రం ఎన్నడూ వెళ్లనివ్వలేదు కుర్రవాళ్లి హృదయాల్లో వుండేకోరికలఎడల ఆయనకు సానుభూతివుండి ఆ కోరికలు తీరడంకూడా, వాళ్ళహృదయ పరిపక్వానికి అవసరమని ఆయన అభిప్రాయము. అయినా కోరికలు వాళ్ళ ఆత్మను బంధించేటంతబలంగా వుండకూడదని ఆయన అభిప్రాయం. ఆయన యింట్లో తుచ తప్పని క్రమపద్ధతి చాలా శ్రమపడి అమలులో పెట్టాడు ఆ క్రమపద్ధతి ఆయన మనస్సుకీ శరీరానికీకూడా ఎంతో శాంతీ, సుఖం సమకూరుస్తోంది.

అన్ని కిటికీల తలుపులూ మూసివేసివున్నాయి గాలి అవతల అరుస్తోంది జల్లుకూడా ప్రారంభించింది. వాన చినుకులు గాలిబలంవల్ల కిటికీ తలుపులసందుల్లోనుంచి చొచ్చుకువస్తున్నాయి. స్పర్శకు అన్నీ చల్లగా వున్నాయి. యువకుడు యువతికి కొంచెం దగ్గరగా జరగబోయాడు. యువతి ఇటూ అటూ చూచి దూరంగా జరిగింది.

'దారుణంగా వుందే ఈ గాలివాన!' అన్నాడు యువకుడు. రావుగారి పక్కనున్న పెద్దమనిషి ముఖం పైకెత్తి, ఏదో చెప్పబోయి, మానివేసి మళ్లీ చదువు ప్రారంభించాడు.

యువకుడు సిగరెట్టు ముట్టించాడు. యువతి ముఖం చిట్లించి దూరంగా జరిగింది. యువకుడు ఒక చిరునవ్వు నవ్వి సిగరెట్లు కాలుస్తూనే కూర్చున్నాడు. చక్కగా దువ్విన యువతి తలకట్టులోనించి ముంగురులు విడిపోయి ఆమె నుదురుమీద, చెక్కుల మీద కదులుతున్నాయి. తన కుమార్తెలు తల దువ్వుకునే పద్ధతి రావుగారు నిర్ణయించారు ఆ సంగతి ఆయనకు జ్ఞాపకం వచ్చింది వాళ్ల అలవాట్లు, నోములు, వ్రతాలు, స్నేహాలు, దుస్తులు వేసుకునే పద్ధతి అన్నీ కూడా అందాన్ని గురించీ మర్యాదను గురించీ రావుగారి కున్న అభిప్రాయాలకు అనుగుణంగా నిర్ణయమైపోయాయి

ఎదురుగా కూర్చున్న ముసలాయన తన పరుపుచుట్టలోనుంచి బూడిదరంగు ఫ్లానలు చొక్కా తీసి తొడుక్కున్నాడు. ఆయన ఆ చొక్కాలోను ఆ చారల పైజమాలోనూ నిజంగా చిత్రంగా కనబడుతున్నాడు. ఆయన ఫ్లాస్కులోనించి వేడి కాఫీ ఒక కప్పు పోసుకుని తాగడం ప్రారంభించాడు. రావుగారికి తన పెట్టెలో ఒవల్టిన్‌తో వున్న ఫ్లాస్కు జ్ఞాపకం వచ్చింది. అది తీసి ఒవల్టిన్ ఆయన ఆప్యాయంగా చప్పరించడం ప్రారంభించాడు. రావుగారికి ఒవల్టిన్ అంటే చాలా యిష్టం. కాని ఆ యిష్టానికి హద్దుమించి ఆయన ఎన్నడూ వశుడైపోలేదు. ఆ మధురమైన పానీయాన్ని ఆయన రోజుకి రెండుసార్లు,

(18-వ పేజీచూడండి)

# మండుపెద్దాలితో

దిక్కులేని అభాగ్యుని బంధు కోటిలో ఆదరించేవారే ఉండరు. ఎడారివంటి సమాజంలో తళుక్కున మెరిసే స్వప్నాలకే తృప్తిపడ్డం మానవస్వభావం. ఆ క్లుప్త స్వప్నానుభవాన్ని కాపాడుకోడమే జీవితంలో మిగిలే ఆనందమౌతుంది.

## శ్రీ వఝల రామనరసింహం

"ఏం, మామయ్యా! కులాసాగా వున్నావా?"

పడక కుర్చీలో మేనువాల్చి, వార్తా పత్రిక చదువుకుంటూవున్న, శేషగిరి ఈ పలకరింపు విని, కళ్లద్దాల్లోంచి పక్కకి చూశాడు. ఎదురుగా జోగయ్య, చింపిరి గుడ్డలతో, చేతిలో ఓ సంచీ పట్టుకుని, వికిలినవ్వు నవ్వుతూ, నించున్నాడు. శేషగిరి ముఖంలో ఒనిముషంపాటు ఆశ్చర్యం, తరువాత చిన్న చిరాకు, కనిపించి మాయమైనాయి. మళ్లా న్యూసు పేపరులో నిమగ్నుడయ్యే, అన్నాడు శేషగిరి:

"ఏంరా; జోగీ! ఏ బండిలో వస్తున్నావు? లోపలికి వెళ్ళి, అత్తయ్యతో చెప్పు."

జోగయ్య లోనికి వెళ్లేడు. మధ్యగదిలో శేషగిరి పెద్దకూతురు అనూరాధ కన్పించింది. ఆమె జోగయ్యవేపు ఓ నిముషం వింతగా చూసి, "ఏం జోగయ్యా! ఎప్పుడు రావటం" అంది. ఆ తర్వాత, ఆమె, "అమ్మా! జోగయ్యవచ్చాడే!" అని కేక వేస్తూ వంటింటివేపు వెళ్లింది.

జోగయ్య తన సంచిని ఓమూల పెట్టి, అట్లానే నించుండిపోయాడు, ఏమి చేయడానికీ తోచనివాడిలా. వంటింట్లోంచి, "ఆ, వచ్చేడూ? ఔను మరి! మన యిల్లొక్కటే మిగిలిపోయింది కదూ, మీదపడి తినడానికి!" అనే తన అత్తయ్య మాటలు జోగయ్యకి స్పష్టంగా వినపడ్డవి.

జోగయ్యకేమీ ఆశ్చర్యం కలగలేదు. ఎందుకంటే, ఇటువంటి "స్వాగతా"నికి సిద్ధపడే తనిక్కడికి వచ్చాడు! తలిదండ్రులు ఏనాడో పోయిన తను, కేవలం బంధువుల యిళ్ళలో తిని బతకడమే జీవనోపాధిగా పెట్టుకున్నప్పుడు, ఇంతకంటె ఎక్కువ మర్యాద నాశించడం వుత్త తెలివితక్కువ! తన తలిదండ్రులు పోతూపోతూ, తనకి ఆస్తికంటె అప్పులే ఎక్కువ వదిలిపోయారు తను 4 వ ఫారం 4 ఏళ్లు ఫెయిలయి చదువు మానుకోవడంచాత, తనకి ఉద్యోగం దొరకడం వుత్తి అపోహ! అటువంటప్పుడు, తనకి బంధువుల పంచను చేరడంతప్ప మరొక గత్యంతరం లేకపోయింది ఈ పరిస్థితులలో తను మర్యాదను ఏ ముఖంతో ఆశిస్తాడు! తన పొట్టగడవడంకంటే ఏ మర్యాదలు ముఖ్యం కావని తను తెలుసుకొన్నాడు. "కడుపు టంచులదాటి దహించు" క్షుద్బాధముందు ఈ లౌకిక గౌరవాలు, మర్యాదలు ఏపాటి? ఈ రకం వేదాంతంతోనే తను యిన్నాళ్ళూ జీవితాన్ని గడుపుతూవచ్చాడు. తన అత్తయ్య ఇప్పుడు అన్న మాటలకంటె ఎక్కువ కఠినమైన పలుకులు తను ఇతర బంధువుల ఇళ్ళలో విన్నాడు... ఇలాటివి తనకొక వింతకాదు...

ఇటువంటి ఆలోచనలతో జోగయ్య ఆ గదిలో ఒక్కడూ అట్లానే నించుని వున్నాడు. ఇంతలో తన అత్తయ్య గది ద్వారం వద్దకి వచ్చి పల్కరించింది.

"ఏం జోగయ్యా! కులాసాగా వున్నావా?"

"ఊఁ!" అన్నాడు జోగయ్య.

"కోచీలోనా వచ్చావు?"

"ఊఁ! చిన్నాన్నగారి వూరినించి"

"చిన్నాన్నగారింటినించి ఎందుకు వచ్చేశావూ?"

జోగయ్య సందిగ్ధావస్థలో పడ్డాడు. ఈ ప్రశ్నకి జవాబు ఆమెకి తెలిసి కూడా అడుగుతున్నది!... చిన్నాన్నగారింట్లో వారు వుండనిచ్చినంత కాలం తను వున్నాడు. ఆ తర్వాత వారు పొమ్మంటే ఈ పంచను చేరేడు. ఏ బంధువింట్లోనైనా తను యింతే. వారు గెంటివేసేవరకూ తను వుంటాడు. తనకి మరో జీవనోపాధి లేనప్పుడు ఏం చేయడం... ఇక్కడైనా అంతే.

"సరే! మడికట్టుకుని నువ్వూ మామయ్యా భోజనానికి రండి!" అని ఆమె వెళ్ళిపోయింది.

శేషగిరి యింటికి జోగయ్య వచ్చిన రెండు, మూడు రోజులవరకూ, అంతా సవ్యంగానే కన్పించింది.. కాని, ఆ తర్వాత పరిస్థితులు తారుమారవసాగినై. శేషగిరి చీటికీ మాటికీ, కోపంగా ఎగిరిపడుతున్నాడు. ఇంట్లో ఎవరూ కూడా జోగయ్యతో సరిగ్గా మాట్లాడడం మానేశారు. ఒకవేళ ఏదో మాట్లాడినా, ముభావంగా, అయిష్టంగా, నీచంగా మాటాడేవారు. పిల్లిమీద కుక్కమీద పెట్టి జోగయ్యను నిందించేవారు. "ఇంట్లో శని తిని వేస్తున్నది" అని అనడం ప్రారంభించేరు..

–జోగయ్య చెక్కు చెదరలేదు! కనీసం మనసులోనైనా బాధపడలేదు. ఆకలి నిస్సహాయత అనేవి మానవుడిని ఎటువంటి నీచానికైనా పాల్పడ చేస్తాయనే వేదాంతాన్ని అతడేనాడో నేర్చుకున్నాడు అదీ కాక, "మనస్సు" అనే దానిలో జోగయ్యకు నమ్మకం లేదు. మానవులందరికీ కేవలం ఒక పొట్ట ఆకలి మాత్రమే దేవుడిచ్చాడని అతనికొక నమ్మకం ఏర్పడింది.

రోజులు గిరగిరా దొర్లిపోతున్నవి... ఓనాడు సాయంత్రం జోగయ్య వీధివరండాలో కూచుని కాగితం మీద పెన్సిలుతో ఏదో గొలుకుతూవుండగా శేషగిరి ఆఫీసునుంచి వచ్చాడు.

"ఇవాళ రేషన్లు తెచ్చావురా జోగీ?"

"తెచ్చాను మామయ్యా"

"ఆ రాస్తున్నది ఏమిటి?"

"అబ్బే... ఏమీ లేదు... మామయ్యా..."

"ఏమీ లేకపోవడమేమిట్రా? వుత్తరమా?

# మధురస్వప్నం

"కాదు.. కథ రాస్తు...న్నా...ను.."

"కథా! ఓ! అదొక్కటే తక్కువైందిలే" అంటూ, శేషగిరి ఇంట్లోకి నడిచాడు.

మూడురోజుల తర్వాత, జోగయ్య తన కథ పూర్తిచేసి ఓ పత్రికకి పంపించాడు. మర్నాటినుంచీ, పోస్టుమేనుకోసం ఎదురు చూడనారంభించాడు!

నెల్లాళ్ళు గడిచాక, ఓ తెలుగుపత్రిక జోగయ్య పేరున వచ్చి పడింది...అందులో జోగయ్యకథ ప్రకటింపబడింది...ఒక్క నిముషంపాటు జోగయ్య మూర్ఛపోదామనుకున్నాడు! కాని, అతనికి మూర్ఛ రాలేదు—ఆనందంలో ఉక్కిరి బిక్కిరి అయిపోయాడు.

ఆనాడు రాత్రి జోగయ్యకు నిద్రపట్టలేదు. తన కథ గురించి ఏమేమో ఆలోచించుకుంటున్నాడు...ఈ పత్రికలు, కథకులు, కవులు, సంపాదకులు, ముద్రణాలయాలు, అన్నీ, అతని కళ్ళఎదుట కన్పిస్తున్నవి...ప్రఖ్యాతాంధ్రకవులు అతని పూహానేత్రం ఎదుట గోచరిస్తున్నట్లయింది...కవిసామ్రాట్టు విశ్వనాథవారి రచనలు, అడవిబాపిరాజుగారి కళానైపుణి, ఓమారు స్మరించుకున్నాడు...ఈ తన ఒక్క కథతో తనకి ఆంధ్ర కవితాలోకంతో ఎడతెగని పరిచయం ఏర్పడిపోయినట్లు భావించుకున్నాడు!

తన కథ ప్రకటింపబడ్డది! ఆ కథ ఎలా వున్నదో తనకు సరిగ్గా తెలియదు. అదీ కాక, ఈనాడు చాలా తెలుగుపత్రికలలో కథలు ప్రకటింపబడాలంటే, అవి బాగా వుండవలసిన అవసరం లేదని తనకు తెలుసు! కొద్ది పెద్దతరగతిపత్రికలు తప్ప మిగతా వాటిలోని కథలను తను అభినందించలేక పోతున్నాడు. కాని, అటువంటివాటికే నేడు ఎక్కువ ప్రచారం వుంది! దానికి కారణం, బహుశః, పాఠకులలో సరియైన సారస్వతాభిరుచి లేక పోవడమేమో! కొందరు చదువుకున్న వారు, పెద్ద గ్రంథాలను పత్రికలను చదువుతామనేవారు సహితం, ఈ తుక్కు సారస్వతాన్నికొని, చదివి, అభినందించడం, తనకు తెలుసు... ఇంతకీ, తన కథ కూడా, చెత్తకథలలో చేరుతుందో, లేదో, తనకి తెలియదు... ఏమైనా, తన మనస్సులో బ్రహ్మాండమైన, విచిత్రమైన భావాలు చెలరేగుతున్నవి. ఆ భావాలన్నిటినీ తను కాగితం మీద పెట్టడం నేర్చుకోవాలి...ఇకమీదట తను కథారచనలో విపరీతమైన కృషి చేయాలి... తను ప్రపంచంలో ఎందుకూ పనికిరాని వాడనిపించుకోకూడదు. తనకి మరి ఏ వుద్యోగమూ అవదని తెలుసు......ఇటువంటి ఆలోచనలతో, జోగయ్యకి తెల్లవారుతూ వుండగా, నిద్ర వచ్చింది.

...జోగయ్య యిప్పుడు పట్టుపట్టి కథారచన సాగిస్తున్నాడు. నెల్లాళ్ళు కష్టపడి రాసి, ఓ అరడజను కథలు వివిధమైన పత్రికలకి పంపించాడు......

ఇప్పుడు జోగయ్య కథకుడైనాడు. అతని రచనలు రమారమి ప్రతి పత్రికలోను కన్పిస్తున్నవి. అతని కథా రచనలో ఇప్పుడు అతనికి దృఢ నమ్మకం కుదిరింది. ప్రతి నెలా చాలా పత్రికలు—కాంప్లిమెంటరీ కాపీలు—అతనికి వస్తున్నవి. కొన్ని పత్రికలు, తన కథ ప్రచురించినప్పటికీ, తనకి ఉచిత కాపీలను పంపకపోవడం అరుదుకాదు! ఇంట్లోనివారందరూ, తీరుబడి సమయాల్లో పత్రికలని చదువుతూ కాలం గడపడం నేర్చుకున్నారు.

ఓనాడు జోగయ్య రాసుకుంటూ ఉండగా, అనూరాధ అతనివద్దకు వచ్చింది.

అనూరాధ 15 ఏళ్ళ పిల్ల. చామనఛాయగా, కోలటి ముఖంతో, పొడుగ్గా ఉంటుంది. జోగయ్యకి పత్రిక ఏదైనా వచ్చిన వెంటనే ప్రప్రథమంగా చదివే వ్యక్తి అనూరాధ. ఆమెతర్వాత శేషగిరి చదువుతాడు. ఆఖరున, పత్రిక యింకా

నిద్రపోతున్న అనూరాధని కిటికీలోనుంచే చూసి సెలవుతీసుకున్నాడు జోగయ్య.



ముక్క ముక్కలవకుండా వుంటే, జోగయ్య చదువుతాడు...

అనూరాధ జడకి రిబ్బను చుట్టుకుంటూ అంది. "జోగులూ! కథలు రాయటం ఎప్పటినుంచి మొదలుపెట్టేవు నువ్వు?"

ఇంతవరకూ తనతో ఎప్పుడూ కూడా చనువుగా మాట్లాడని అనూరాధ, ఈనాడు తనతో, నవ్వుతూ, మాట్లాడ్డం జోగయ్యకు ఆశ్చర్యం కలిగించింది. ఇంతవరకూ తనని ఎవడో పైవాడిలా, బంట్రోతులా, ఆమె చూస్తున్నది.

"అబ్బే! ఏదో రాస్తున్నానులే...... యింతకీ నా కథ లెట్లావున్నాయి? బావున్నాయా?"

అనూరాధ పకప్కన నవ్వి అంది.

"మా బాగా అడిగావులే! నువ్వు రాసిన కథలు ఎట్లా వున్నవో నీకే తెలియదా!"

ఎవరు రాసిన కథలయొక్క బాగోగులు వారికి తెలియడం కష్టమనీ, యితరులు చెప్పవలెననీ జోగయ్య ఆమెకి బోధించ ప్రయత్నించాడు; కాని, అనూరాధ మాత్రం అతని మాటలు నమ్మలేదు. ఏమైనా, పత్రికాపఠన అంటే ఆమెకి చాలా ప్రీతి. ఈ విషయంలో ఆమెది జోగయ్యకంటె పై చేయి అనిపించుకుంది.

జోగయ్య కథారచనని వదిలిపెట్టలేదు. అతనికి మరొక పనిలేదుకూడాను. కాని ఈ సందర్భంలో జోగయ్యకి ఒక గొప్ప సత్యం గోచరించింది. ఏమిటంటే-నిజంగా మరొక వుద్యోగం చేస్తూ, కథారచన పట్టున సాగించడం అసాధ్యమని! అయితే-కేవలం కథారచనమీదే "బ్రతుకు"తూ వున్న ఆంధ్రుడెవడైనా వున్నాడో లేదో అతనికి తెలియదు. కవిత్వం కేవలం, ఓ పక్క వుద్యోగం చేసుకుంటూ మరో పక్క ఖుషీకి చేసేపనేమో? మస్తుగా డబ్బువుండి కాలుమీద కాలు వేసుకొని బ్రతకగల అదృష్టంవుంటే కవిత్వానికి ఎంత అవకాశం! కాని, డబ్బున్నంతమాత్రాన కవిత్వం వుద్భవించదన్నమాట నిజమే కాని కవిత్వం చేయాలంటే డబ్బుంటేనే గాని పని జరగదని తను గ్రహించాడు.

ప్రతీరోజూ అనూరాధ జోగయ్యతో పత్రికల గురించి కథల గురించి ఏదేదో మాట్లాడుతుంది. ఒకొక్కమారు ఆమె అతనితో వాదిస్తుంది. ఒకొక్కమారు అతన్ని పొగుడుతుంది. ఆ యింట్లో అతనితో ఇప్పుడు చనువుగా మాట్లాడే స్నేహితురాలు ఆమె ఒక్కర్తే అనుకున్నాడు జోగయ్య.

ఓనాడు అనూరాధ అంది.

"జోగాయ్! ఈ నెల ప్రత్యేక సంచిక లేవో పెద్దవి వస్తాయన్నావు- ఇంకా రాలేదూ?"

ఏదో రాసుకుంటూవున్న జోగయ్య తృళ్ళిపడి అన్నాడు: అన్నట్లు మూడు పత్రికలేవో నిన్న వచ్చాయి. నా పంచిలో దాచేను. నీతో చెప్పడమే మరచాను సుమా!"

"నాతో చెప్పకుండా, పత్రికలు దాచుకుంటున్నావుకదూ?" అంది అనూరాధ 'వుండు, నీ పని చెప్తాను' అన్నట్లు చూస్తూ.

ఆమె గబగబా వెళ్ళి జోగయ్య పంచిలోని బట్టలన్నీ పైని పారవేసి పత్రికలను తీసి మంచంమీద కూలబడి చదువ ప్రారంభించింది.

ఆనాడు సాయంత్రం చీకటి పడుతూ వుండగా జోగయ్య వాకిట్లో కూచుని ఏదో పద్యం చదువుతున్నాడు.

"...సంస్కృతంబుపచరించిన
పట్టున భారతీ వధూ
టీ తపనీయ గర్భనికటీ భవ
దానన పర్వసాహితీ
ధాతిక నాటకప్రకర భారత
భారతి సమ్మతి ప్రభా
పాత సుధాప్రపూర బహుభంగ
ఘుమంఘుమ ఘుంఘుమార్భటీ
జాతక తాళయుగ్మలయసంగతి
చుంచువిపంచికామృదం
గాతత తేహితత్తహితహోధిత
దంధణిధాణు దింధిమి..."

ఇంతలో అనూరాధవచ్చి "ఏమిటి జోగయ్యా! అట్లా చదువుతున్నావు?" అంది.

"అల్లసాని పెద్దన అనే ఒక గొప్ప కవి రాసిన పద్యం అది. కృష్ణదేవరాయల ఆస్థానంలో ఆ మహాకవి 30 పంక్తుల పద్యాన్ని ఆశువుగా చదివాడట. అప్పుడు కృష్ణదేవరాయలు ఆ కవిపాదానికి గండపెండేరము తొడిగి గౌరవించాడట" అని జోగయ్య ఆ వృత్తాంతం ఆమెకి బోధించాడు.

"అబ్బ! అంత గొప్పకవా?" అంది అనూరాధ, ఆశ్చర్యంతో పెదిమెలు బిగించి. ఆ తర్వాత, ఏదో జ్ఞాపకం వచ్చినదానిలా అంది: "జోగాయ్! పద్యాలు రాయడం సులభమా, కథలు రాయడం సులభమా?"

"కవిత్వమన్నది ఏదీ కూడా సులభంగానూ, చవకగానూ తయారయే వస్తువ కాదు. రెండూ కష్టమే. కొన్ని విషయాలలో, పద్యరచనకంటె, కథారచనే ఎక్కువ కష్టమని నా వుద్దేశం. అలా అని పద్యరచన సులభమని కాదు."

అరచేతుల్లో చెక్కిళ్లు వుంచుకుని, కొంచంసేపు ఆలోచించి అనూరాధ అంది:

"మా పిన్నికూతురుకి పద్యాలురాయడం వచ్చునని వూరంత గర్వం!—జోగులూ, నాకు కూడా పద్యాలు రాయడం నేర్చుకోవా లనుంది. నేర్పవూ?"

"నరేలే"

మర్నాడు వుదయం జోగయ్యవద్దకి



వచ్చి కూచుంది అనూరాధ. అతడామెకు "గురువు"లు "లఘువు"లు, "గణములు" మొదలైనవన్నీ చెప్పేడు. వివిధగణాలని సులభంగా తెలుసుకోనేటందుకు "యమాతా రాజభానస" అనే సూత్రాన్ని జ్ఞాపకం వుంచుకోమన్నాడు. "అంటే అర్థం ఏమిటి?" అంది అనూరాధ. "దాని కర్థం లేద"న్నాడు జోగయ్య.

వారం రోజు లయాక అనూరాధ ఓనాడు జోగయ్యతో అంది: "జోగులూ! వుత్పలమాల రెండుపంక్తులు రాశాను. ఎలావుందో చూస్తావూ?"

"చంపేవు! నిన్న ఛందస్సు నేర్చుకోవడం, ఇవాళ పద్యాలు రాయడమూనా" అన్నాడు జోగయ్య నవ్వుతూ—

"అబ్బ! మొదట చూసి మాట్లాడు"

"వూఁ! చదువయితే!"

"జాగ్రత్తగా విను"

ఉ॥ రాజునుబోలు నీముఖము
రంజిలచేయును నామనోహరీ!
పూజలుచేతు నెల్లపుడు
నాదగుమాటను సుంత విందువే!."

"నువ్వింత వేగిరం పద్యాలు రాయడం ప్రారంభించకూడదు. ఇంకా చాలా గ్రంథాలు చదవాలి మొదట."

"నువ్వేమిటి చదివేవు."

"మనుచరిత్ర, వసుచరిత్ర, ఉత్తర హరివంశం, వగైరా"

"ఇంతకీ, నా పద్యం రైటా తప్పా? చెప్పవేం?"

"ఛంధస్సుకి కట్టుబడి వున్నంతమాత్రాన పద్యం మనోరంజకంగా వుండదు. మంచి భాష వాడాలి అదీకాక, నీ రెండో పంక్తిలో, యతి వెయ్యడం లేదు"

"ఓస్! ఓ పంక్తిలో యతి వెయ్యకపోయినంతమాత్రాన కొంప మునుగుతుందా ఏమిటి?"

జోగయ్యకి నవ్వు వచ్చింది.

ఇంతలో "ఒసేవ్! అనూ! ఎక్కడకి పోయావే" అని కేక వినబడ్డది. "అమ్మ పిలుస్తున్నాది" అంటూ, అనూరాధ తుర్రున పరిగెత్తి పారిపోయింది. ఆనాటి నుంచి అనూరాధ మరెప్పుడూ కవిత్వం నేర్చుకోలేదు.

రోజులు గడిచిపోతున్నవి.

ఓనాటి మధ్యాహ్నం, శేషగిరి, భార్యతో కలిసి ఎవరో బంధువులను చూడ్డానికి వెళ్ళేడు. జోగయ్య రేవను షాపుకి వెళ్ళేడు. అనూరాధ వక్కత్తే గదిలో పడుకుని పత్రిక చదువుతున్నాది

8-30 అవుతూండగా, భుజంమీదబియ్యం మూట, చేతుల్లో సంచులతో సామాను, మోసుకొని అలసిపోతూ జోగయ్య వచ్చాడు. సామానంతా కొట్లో సర్దివేసి, అనూరాధ వున్న గదిలోకి వచ్చి, చాప మీద కూలబడుతూ, "అనూరాధా! ఒక గ్లాసుడు మంచినీరు ఇద్దూ! గొంతుక ఎండిపోతున్నది" అన్నాడు జోగయ్య, నుదుటి చెమట తుడుచుకుంటూ....

జోగయ్య మంచినీరు తాగుతూవుండగా, అనూరాధ అతని మొహంవైపు పరిశీలనగా చూసింది. జోగయ్య ఎంత అలిసిపోయాడు! అతని ముఖంవైపు ఇంత పరిశీలనగా త నెప్పుడూ చూడలేదు. అతని బీదతనం, ఆకలి మంట, వేదన, అంతా, అతని ముఖంలో స్ఫుటంగా కనిపిస్తున్నవి. బండెడు సామాను మోసుకొని వచ్చాడు. ఎంత అలసిపోయాడో పాపం! అనూరాధలో ఇన్నాళ్ళయీ నిద్రపోతున్న జాలి, దయ, కరుణ అనే మానవస్వభావాలు ఒక్కమారు మేల్కొన్నవి.

"జోగయ్యా! ఎంతలా అలిసిపోయావ్!"

"వూ! రేవనుషాపు 8 మైళ్ళదూరం వుంది"

"జోగయ్యా! ఒక్క నిముషం అట్లానే కూచో. ఇప్పుడే వస్తాను" అని అనూరాధ వంటింటి వేపు వెళ్ళింది. "ఇస్" అని జోగయ్య నిట్టూర్పు విడిచాడు. అయిదు నిముషాల తర్వాత, గాజుప్లేటులో నాలుగు గులాబీ జాములు తెచ్చి జోగయ్య ముందు వుంచి, అనూరాధ అంది. "గులాబీ జాములు తిను. అమ్మ ఇవాళ తయారు చేసింది. మేమందరం తిన్నాము"

జోగయ్య ముఖంలో ఆనందరేఖ కన్పించింది. అనూరాధముఖంవైపు ఓమారు చూశాడు. ఆ తర్వాత—భగ్గున కడుపు మండిపోతూన్న అన్నార్తుడిలా—గులాబీ జాములను అమృతప్రాయంగా, గబగబా, ఒక్క తృటిలో తినివేశాడు. అటువంటివి తినడం తన జీవితంలో ఇదే మొదటి మారు. అనూరాధ కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగినవి. ఆమె గొంతు సవరించుకొని అంది:

"అమ్మ, నాన్న, బాబయ్యగారింటికి వెళ్ళేరు.—గులాబీజాములు నీకిచ్చానని ఎవరికీ చెప్పకేం?"

"అంత దొంగతనం ఎందుకు అనూరాధా? చెప్తేనేం?"

"అమ్మ కోపగించుకుంటుంది"

"అటువంటప్పుడు నాకెందుకిచ్చావు?"

"అబ్బ! ఎందుకోనకందుకు మళ్ళీ నువ్వు యిలాటి వస్తువులు ఎప్పుడు తినగలవు?"

జోగయ్య జవాబు చెప్పలేకపోయాడు; ఆమె ముఖంవైపు ఓనిముషంపాటు తీక్ష్ణంగా చూశాడు—ఆమె మోము అతి కోమలమైన పుష్పమువలె వుంది; ఆ నిము

(37-వ పేజీ చూడండి)

# కాయవ్రజీవాలు

శ్రీ బి. నాదమునిరాజు

కదలబోయే రైలును గప్పున అందుకున్నాను. తిండికి లేక కరువు పిశాచి భయంకరమైన రాక్షసిలాగా వెంటాడుతుంటే బ్రతికేందుకోసం తుంగభద్ర ప్రాజెక్టు వద్దకు వలసపోయే కష్టజీవులతో రైలు నిండివుంది. పీక్కుపోయిన ముఖాలతో, నిరాశ పూరితమైన నయనాలతో, సంస్కారంలేని జుత్తులతో దరిద్రదేవత ప్రియసంతానంలా గున్నారువారు. కూర్చునేందుకు తావులేకపోవడంతో వాకిటి వద్దనే నిలుచుని పెట్టె నంతటిని పరిశీలించాను. ఒక సీటు నంతటిని ఆక్రమించుకొని బిర్రబిగుసుక పడుకున్నాడు ఒక కాంక్రీటు దుస్తుల స్థూలకాయుడు. మరో సీటులో భార్యా బర్తలు గావాల్ను కూర్చుని యిద్దరిమధ్య వుంచే తమ శిశువుతో కేరింతలాడుతూ గ్లూకోస్ బిస్కట్లు తింటున్నారు. మిగిలిన సీట్లు నిండుకు వివిధ రీతుల ప్రయాణికులు యిరుక్కొని కూర్చున్నారు. క్రింద చీమ దూరేందుకు కూడ జాగా లేకుండా తుంగభద్రశరణార్థులు చితికిల బడివున్నారు.

దేశంలోని ఆహారసమస్య, వెలువడిన ఎన్నికల ఫలితాలను, మిశ్రమ మంత్రివర్గ స్థాపనావకాశాలను నెమరు వేసుకుంటూ నిలుచున్న నా ప్రక్కనే కూర్చున్న యిద్దరు కరువు బాధిత స్త్రీలు మాట్లాడుకోవటం మొదలుబెట్టారు. నేను శ్రద్ధగా వినటంలో నిమగ్నుడనయాను.

"యాడమ్మా గతిలేక యెల్తున్నాం. ఆ పాడునీల్లు సరిపడవంట. మొన్న మావూరినుంచి యెల్లొచ్చిబుల్లోడు అదేదో టైంఫాయడ్ జరమంట తిరిగొచ్చి ఆపసోపాలు పడ్తున్నాడు. మారాత ఎట్లుందో."

"పాడు కాలమొచ్చింది సుబ్బమ్మత్తా. బమ్మయ్యా చెప్పినంత జరుగుతూండాది. ఏడూళ్ళ కోవూరు, ఏడుమంది కొకమనిషి అయితారని సెప్పిండంటమ్మా మహానుభావులోరు."

"అట్ల కాదు, లచ్చింపిల్లా యాభయ్యేపడి నడుస్తుండది గాని, నేనెప్పుడు సూళ్ళేదమ్మా యీ పాడుకరువు. తిన్న తిండిలేకపోతే మానె తాగేటానికి నీల్లుకూడ కరువయిందేం కాలం. ఓరా!" అంటూ ఆ ముసిలామె దవడ నొక్కుకుంది.

ఇంతలోకే నేను జోక్యం కలిగించుకొని వారితో సంభాషణలోకి దిగాను.

"ఏవూరమ్మా మీది?" అన్నాను.

"మాది కడప యిలాకా సోమీ" అంది ముసిలామె.

"మీ ప్రాంతం ఏట్లా వుందమ్మా? పంటలు పండనే లేదా? గింజలధర లెట్లున్నాయ్?" అని అడిగా కుతూహలంగా అక్కడి పరిస్థితి తెలుసుకోవాలని.

"ఏముంది మా రాజా! వానసినుకు యీ ఏటిపాడుగునా రాలింతే వొట్టండి. ఇంక పంటలేం పండుతాయ్. యిత్తనానికేసిన గింజలు కూడ ఎనిక్కి రాలేదండి. ఎల్లేసిన గింజలు అట్లనే పోయినాయ్. మరీ మా పులివెందుల యిలాకాలో అయిదారు ఎకరాల ఆసాములే గాకుండా యిరవైముప్పయి ఎకరాల ఆసాములకు కూడ నాల్గురోజుల బత్తెం లేదంటే నమ్మండి. యింక మా కూలోళ్ళసంగతా? రైతులే వూర్లిడిచి పొయ్యేటప్పుడు యింక మా గతి ఎట్లుంటుందో మీరె సెప్పండి. జీవాలకు మేత కూడా లేదయ్యా. అయినకాడికి అగ్గువ అమ్మకు పొతేత్తుండారు పశువుల్ను. తాగేదానికి నీళ్ళకు కూడ కరువు వచ్చిందిసామే ఏం ముదనష్టపుకాలమో. బావుల్లో కడవ మునిగేది మహా గగనమయితే యాడన్నా వుందాండి యీ ఇసిత్రం. మందలు మందలు వూర్లిడిసిపోతుండరయ్యా మనుషులు జీవాల్లా. పులిమీద పుట్రలాగు దానమ్మకడుపు కాలి రోగాలు కూడ యిప్పుడే రావాలి. ఏందిసామీ సదువుకున్నోళ్ళని మిమ్మల్ని అడిగేత్తుండా. కలియుగం అయిపోయివచ్చిందంటనే నిజమేనా? మా వూరి బాపనోయిన మొన్న దేవళంకాడ సెప్పి 'అల్లరి-చిల్లరి మనుషులంతా ఎదురు మాట్లాడటం నేర్చుకుంటే ఏమవుతుంది పాడుగాక' అన్నారయ్యా నిజమేనా?" అంది ఆ ముసలామె కంట తడిబెట్టూ. వాళ్లవూరి బ్రాహ్మడి మాటల్లోని యధార్థమును తెలుసుకోవాలనే ఆతురతతో గోటితో నీళ్ళు తుడుచుకుంటూ నావంక చూచింది. నాకు నవ్వాలో ఏడవాలో అర్థంకాక—

"అదంతా వుత్తదిలే అమ్మా. కరువుకూ దానికీ సంబంధం ఏముందీ?" అంటూ, ఆమెకుటుంబ వివరాల్ను అడిగా.

ఆ ముసిలామెకు యిద్దరు కొడుకులు వున్నారనీ పెద్ద అబ్బాయ్ రెడ్డోరింట్లో సేద్యానికి అయిదేండ్లనుంచి నాలుగు తూముల గింజలకు (ఏడాదికి) పనిచేస్తూ వున్నాడని, పదహాయిదేండ్ల చిన్నోడు తను దిన కూలికి దొరికినప్పుడల్లా పోతూ వుండేవాడనీ చెప్పింది. కరువుపాదం మోపగానే రెడ్డోరు ఆ ఏట గింజలు వచ్చే ఏడు పంటలు పండుతే యిస్తానని పెద్దోడ్ని పని లోంచి తీశేశారుట. తరువాత కూళ్లు దొరికేదే మహాగగనమయిపోయి రోజుల తరబడి పస్తుపడుకోవటం మామూలయిందంట. ప్రభుత్వం గంజికేంద్రాన్ని ఆ వూరికి మూడు మైళ్ల దూరంలో తెరిస్తే మూడు మూడు ఆరుమైళ్లు ఆ గ్లాసెడు గంజికి అలాగే నడచి వచ్చేవారట. వున్నట్టుండి పెద్దోడికి జరం రావటం. మంచి మందిప్పించేందుకు కూడ వీలుకాక పోవటం, "అమ్మా గంజి లేదూ!" అంటూ నే

ప్రాణం విడవటం జరిగిందట. అంతా తుంగభద్రా ప్రాజెక్టు కట్టేచోటుకు వలసబోతూవుంటే తనూ పోతూవుందని తన గాథను ఆ ముసలామె స్పష్టంగా తన మామూలు భాషలో గద్గదకంఠంతో చెప్పింది.

"అయితే అవ్వా మీకు ప్రభుత్వం ఏమీ సహాయం చేయలా?"

ముసలామె 'అవ్వ' అని నోరు మూసుకుంది, "ఏం సహాయం నాయనా. టోపీలు పెట్టుకొని కార్లలో బుర్రని రావటం మా కరువువైనం తెల్పమని చాల సార్లు రాసుకొని పోవటం. అంతే. యింకేం చేసిండ్రు. ముందు అప్పులు యిస్తామని చెప్పిండ్రు. తీరా పోతే కూలోళ్లకీమన్నారు పోనీ సన్నకారు రైతులకయినా యిస్తారా అంటే నారాత సిఫార్సులు వుండాలంట. మోతుబరులకే దొరికినయి అప్పులు. మా శేండ్లు తినేన్ని గింజలుంటే రెడ్డోరికి మూన్నాళ్లకే అయిదునూర్లు అప్పు యిచ్చిండ్రు. కలిగినోళ్లదే కాలం అయ్యా. "ఓహో. అల్లాగా" అన్నా గాలికి బొగ్గు వచ్చి కంట్లోపడితే కన్ను నులుముకుంటూ.

అవ్వ యింకా చెపుతోంది. "బీదోళ్లకు గింజలిత్తామంటారు. కంట్రోల్లేకి ఎప్పుడు పోయినా లేవంటారు. మోతుబర్లకాలం సామీ. తిర్గి ఆకంట్రోలాయనే రూపాయకు పడికెక్కువ యిస్తాడు జొన్న గింజలు. ఇంక బియ్యం మాటే మరచినాము అంటే నమ్మండి. రెండు సెల్లయింది. మా వరి బువ్వ కండ్లజూసి ఏమో సామీ మీ కోటి మారాజులు ఆదేశం ఎల్తే కాక బతకొచ్చు అంటే పోతూండాం. యిండ్లు వాకిలి యిడిసి ఆ దేశంలో రోగాలు జాస్తి అని బుల్లోడు చెప్పిండు. ఏమో పరమాత్ముడు ఎట్లరాసుండాడో" అంటూ అవ్వ యింక ఏమో చెప్తూండగానే టికెటు కలెక్టర్ లోపలి కొచ్చాడు. మాట్లాడే ముసిలామె కొంగుకుతూ ఒక మూలకు కొదిగింది. వలస పోయే జీవాలన్నీ బెదురుతున్నాయ్.

రావడం రావడంతోనే "ఏయ్ మీ టిక్కెట్లేవీ?" అని సింహ గర్జన చేశాడు.

"లేవు బాబు. బతకలేక వలస పోతూన్నాం" అన్నాడొకడు వలస పోయే శరణార్థుల్లోంచి.

"మీ బాబుముల్లె వుందనుకున్నారా. రైలంతా మీ అబ్బగారి సొమ్ములాగా ఎంతమంది కూర్చున్నారు? దిగండి. దరిద్రగొట్టు ముండా కొడుకుల్లారా. అంటూ ఒకరొకరి రెక్కలుపట్టి స్టేషన్ లోకి దించేస్తున్నాడు. "ముసలి ముండను బాబు" అంది అవ్వ రెక్క పట్టుకోబోతూంటే. హటాత్తుగా నా జేబులోకి చెయిపోయింది ఆమెకేదైనా సహాయం చేస్తామని. రెండణాలన్నర చేతిలో కొచ్చింది అంతే. కనీసం ఆమెకు టిక్కెట్టుకు సహాయం చేస్తామన్నా లేదే అని సిగ్గు నన్ను ముంచేసింది. ఆ రెండణాలన్నర ఆమెకిస్తే ఆ టికెటుకలెక్టరు గుంజుకుంటాడని నాకు తెలుసు కాబట్టి జేబులో వేసుకున్నా కాఫీకయినా వుంటుందని "ఎలాబాబు" అంటూ ఆమె దిగిపోయింది. నాకు కండ్లకు నీరు కమ్మింది. ★

# ఆంధ్రరాష్ట్రం

## శ్రీ కాకరపర్తి రంగారావు

(తెర లేవగానే నారాయణ విచారంతో కూర్చునివుంటాడు. పంతులు ప్రవేశిస్తాడు.)

నా : (విచారంతో) పంతులూ!

పం : ఏమిటి? అలా విచారంగా వున్నారే? ఎవరైనా పోయారా ఏమిటి?

నా : మీరు ఎప్పుడూ చావులే కోరతారేం?

పం : మొన్న మీ భార్యకు జ.. ...

నా : మావాడు ఆస్తి పంచివెయ్యమని ఖచ్చితంగా అడుగుతున్నాడు. ఎలాగండి పంచడం? చూస్తూ చూస్తూ చేతులారా ఎవరైనా నోటిదగ్గర కూడు పోగొట్టుకుంటారా?

పం : నీకు పోతే వాడి కేమయ్యా! వాడి ఆస్తి వాడు అడుగుతున్నాడు. అందులో తప్పేముంది?

నా : తప్పూ లేదు గిప్పూ లేదూ వాడికి ఆస్తి పంచి నేనేం తినాలి?

పం : అందుకని ఎన్నాళ్లు అట్టే పెట్టుకుంటావు? ఎప్పటికైనా యిచ్చేసేదేగదా? యివ్వకపోతే వ్యాజ్యం వేసి అణా పైసలతో వసూలు చేస్తాడు.

నా : వాడు కోర్టుకి పోతే మనకి మిగిలేది చిప్పకర్రా! అందుకని వాణ్ణి అటు కోర్టుకి పోకుండా యిటు ఆస్తి పంచకుండా వుండే వుపాయం ఆలోచించాలి. ఏమంటావు?

పం : బాగానే వుంది. కాని అదెలా సాధ్యమవుతుంది?

నా : కొద్దిగా ఆలోచించు.

పం : ఆలోచించి రేపు చెప్తానులే.

నా : రేపటిదాకా ఎక్కడ టైముంది. యిప్పుడు వచ్చి పీకలమీద కూర్చుంటాడు. అంతా అయిన తర్వాత నిన్ను సంతోషపెడ్తాలే!

పం : నీ విషయంలో నా కటువంటి భయం లేదు.

నా : ఏం చేద్దామంటావు?

పం. మీవాడు వచ్చేటప్పటికి నేను వస్తాను. నేను చేస్తాగా.

నా : మన యిద్దరం ఒకటని వాడికి తెలియకూడదు.

పం : అది నువ్వు చెప్పాలా! అది మనకి ఉగ్గుపాలతో పోసిన విద్య. వస్తా.

నా : తప్పకుండా వస్తావు గదూ!

పం : ఇందులో సందేహమా. సెలవు.

(వెళ్లిపోతాడు. సత్యం, రాము వస్తారు)

స : ఏం అన్నయ్యా? ఏం ఆలోచించావు?

నా : ఏం ఆలోచించమంటావు?

స : ఆలోచించే దేమిలేకపోతే వంటనే పంచేయి.

నా : యిన్నాళ్లనుంచి ఒకటిగా వుండి యిప్పుడు రెండు కుటుంబాల్ని విడతీయలేను.

స : యీ వేదాంతాల్తోటే యింత కాలం ఆపావు. యింకా ఆగుతే ఇంకా మూట కట్టుకుందామనుకున్నావ్ కాబోలు!

నా : రామ! రామ! నువ్వేనా మాట్లాడుతున్నది?

స : మా రామూ ఏం కాదు. నేనే! అన్ని సిద్ధం చేశావా?

నా : సర్వం సిద్ధం చేశాను. కాని పెద్దవాణ్ణి కాబట్టి చెబుతున్నాను. యిన్నాళ్లుగా మనం కష్టసుఖాలను పంచుకున్నాం ఇకమీద కూడా.. ...

స : ఇంకా అవుసరం లేదు. నీ నక్కజిత్తులలో పడటానికి నేనేం కుక్కను గాను. యిన్నాళ్లూ అన్నవని నమ్మినందుకు ఇంత ద్రోహం చేస్తావని కలలో కూడా అనుకోలేదు.

నా : నేనా ద్రోహం చేసింది! చూశారా రామారావు గారూ?

రా : నేనేం చేస్తానండి. మీలో మీకు ఏముందో నాకేం తెలుస్తుంది?

నా : తెలియటానికేముంది? తమ్ముణ్ణి ఎవరైనా అన్యాయం చేస్తారా!

స : మీ యిద్దరమ్మాయిల పెళ్లికి యిద్దరి డబ్బులోదేగా ఖర్చు పెట్టింది?

నా : నిన్ను అడిగే చేశానుగా.

స : మిగతావో! వాళ్లకి పెట్టిన సారెలు నన్ను అడిగే పెట్టావా? మీ అత్తవారిచ్చిన యిల్లు నన్ను అడిగే బాగుచేయించావా? గట్టిగా అడిగితే సంపాదనంటావు? గట్టిగా తింటే ఒక్కడికి సరిపోదే!

నా : సత్యం! జాగ్రత్తగా మాట్లాడు.

స : ఎందుకూ అంతకోపం. చేసినతప్పు గుర్తుకో లేకపోయాననా?

రా : అబ్బ ఎందుకురా యిప్పుడు పోట్లాట. అయిందేదో అయిపోయింది. ఇప్పుడు పోట్లాడుకుంటేమట్టుకి వస్తుందా? ముందు వచ్చిన పని కాని.

స : ఏం కానియ్యను. కడుపు రగిలిపోతుంటె. మావాడి పెళ్లికి డబ్బు కావాలంటె లేదంటె ఎలా వుంటుంది చెప్పు. వున్న డబ్బంతా ఖర్చయిందా? బ్యాంకు మింగేసిందా?

నా : యింటి ఖర్చుకు వాడాను.

స : ఎందుకు అవదు? కుచేల సంతానం లాగా మీ రందరూ సత్రవభోజనం చెయ్యడానికి మీ అల్లుళ్లు వుంటే ఖర్చు కాక ఏమవుతుంది?

రా : అసలు విషయం వదలిపెట్టి అయినదానికి కానిదానికి పోట్లాడటం మనలో పెద్ద జబ్బు అయిపోయిందిరా.

(పంతులు వస్తాడు.)

పం : ఏమిటోయ్ అన్నదమ్ములు పోట్లాడుకుంటున్నారు?

రా : అన్నదమ్ముల పోట్లాటకి ఆస్తిపాస్తులేగా కారణం.

పం: అదేమిటి తెల్లవారి లేస్తే యిద్దరూ ఒకటిగా వుండాలిగదా మీరే పోట్లాడు కుంటే చూసిన వాళ్ళకి ఎలా వుంటుంది?

స: ఎలా వుంటే నాకేం? నాకు కావలసింది నా ఆస్తి. అదే యిచ్చేస్తే పోట్లాడుకోవలసిన అవసరం లేదుగా.

పం: పెద్దవాడు ఏదో మాస్తున్నాడుగా.

పం: చూసింది చాలు. అన్నయ్యా పుస్తకాలు పట్రా. అయినా పైసా యివ్వాళ తేలిపోవాలి.

పం: అంత సులువుగా తేలిపోయేందుకు యిది కూరలబేరమా?

పం: ఇంకా ఎన్నాళ్ళని పాతిపెట్టడం?

(నారాయణ పుస్తకాలు తేవటానికి వెళ్తాడు)

పం: అబ్బ ఎంత మాటన్నావు! లక్షరూపాయల ఆస్తిని కూరలబేరంతో జమ కట్టావు! మీ పెద్దవాళ్ళు డబ్బంటే అంత నిర్లక్ష్యంగా వుండేవారా? వాళ్ల మర్యాద వాళ్ల మంచి వేరు.

స: వాళ్ల మంచిచెడ్డలు చెప్పుకుని మనం బ్రతుకవలసి వచ్చింది. అయినా ఆనాడు మా తాతయ్య యింతవాడు అంటె ఇప్పుడు మనకేం వచ్చింది? ఇప్పుడు మన బ్రతుక్కి వాళ్ళని తలుచుకోవటం వాళ్ళ మర్యాదకి భంగం తెచ్చినవాళ్ళ మవుతామేమో?

(నారాయణ పుస్తకాలు తెస్తాడు. అందరూ పుస్తకాలు చూస్తూవుంటారు.)

పం: ఇది ఇంటి ప్లానేనా?

నా: అవును.

పం: గమత్తుగా వుందే. నుయ్యి అటు కాకుండా ఇటు కాకుండా మధ్యగా వుందే?

స: మధ్యగా వుంటే మట్టు తప్పించి గోడ కట్టుకుంటాం. అది నా భాగంలోకే వస్తుంది.

నా: ఎలా వస్తుంది?

రా: వదిలేస్తే సరి.

నా: అది నాకు రావలసిందే!

స: నీకెలా వస్తుంది అది మా నాన్న కట్టించాడు. నాకు రావాలి. నుయ్యి లేకుండా నాకు యిల్లే వద్దు.

నా: ఏమైనా సరే నాకు రావాలి.

పం: వదులుకోనంటే ఎలా. మధ్యలో వుంది కాబట్టి ఎవరో ఒకరైనా వదులుకోవాలి.

రా: సత్యం నువ్వేనా వదులుకోరా. విధవ నుయ్యికోసం యిల్లుని బలిచెయ్యటం అంత మంచివిషయం కాదు.

స: వంపూ లేకుండా, నుయ్యి లేకుండా యింట్లో ఎలా వుండమంటావు?

పం: నువ్వేనా వదులుకోవయ్యా నారాయణ.

నా: నేనా! నేను నుయ్యి వదులుకుంటె మళ్ళా నుయ్యి త్రవ్వించగలనూ! పోనీ అప్పో సొప్పో చేసి కట్టించానే అనుకో యిటువంటి తియ్యటినీరు వస్తుందో రాదో. నేను ఆరు నూరైనా, నూరు ఆరైనా వదులుకోను.

రా: ఇద్దరూ వదులుకోనంటె ఎలా తెగేది వ్యవహారం? పోని పంతులుగారూ దీని కేదైనా వుపాయం చెప్పండి!

పం: మధ్యవర్తిగా నేను చెప్పేది వింటారా?

రా: చెప్పండి! అనుకూలంగా వుంటే నచ్చచెప్పదాం!

పం: ఏదో నారాయణ పెద్దవాడు. బీదవాడు కూడాను. వాడికే వదిలెయ్య కూడదా?

స: ప్రాణం పోతే వదలను.

పం: అదిగాకపోతే లాటరీ వేద్దాం. ఎవరికి వస్తే వారు తీసుకోండి.

నా: వద్దు వద్దూ! ఒకవేళ వాడికి వస్తే నేను వదులుకోవలసి వస్తుంది. నేను వదులుకోను.

పం: మరి ఎలాగయ్యా తేలేది?

రా: ఒరేయి సత్యం! విధవ భావి కోసం ఆస్తినంతా వదలడం నాకేం నచ్చ లేదురా.

స: పీకలో ప్రాణం వుండగా వదలను.

పం: ఎలాగయ్యా తెగేది? పోనీ నువ్వేనా వదులుకోవయ్యా నారాయణం.

నా: నేనా! పూడ్చినా పూరుకుంటా గాని వదులుకోను.

స: చూశావా! రామూ! వాడి కుళ్ళు. పూడ్చినా పూరుకుంటాడట గాని వదులు కోడట. ఎందుకు రాదో నేనూ చూస్తాను. ఇంక సెలవు. (వెళ్లిపోవును)

(సత్యం వెళ్లగానే పంతులూ, నారాయణ వెళ్లిపోతారు. గోపి వస్తాడు.)

రా: ఓరేయ్ గోపీ! ఎక్కడనుంచి? మీ నాన్న ఆస్తి పంచుకుంటున్నాడురా!

గో: ఆ!......

రా: అలా అంటావేం ఏం పట్టనట్టు. మీ నాన్న తర్వాత ఆస్తంతా నీకేగా!

గో: మా నాన్న చచ్చిపోయేదాక నేను బ్రతికి వుండొద్దూ. ఆ ఆస్తంతా నాకు రావటానికి. అది అప్పటికే ఎక్కడ తేలుతుంది?

రా: అంతా అయిపోయినట్టే ఆ నుయ్యి దగ్గరే కొద్దిగా పేచి!

గో: దానిదగ్గరే యిన్నాళ్ల నుంచి! అదే లేకండా వుంటే నేను పుట్టకముందే తేలిపోయేది.

రా: ఏమిటి!

గో: మా ఆస్తిపంపకం, ఆంధ్రరాష్ట్రం ఒక్కసారే! కాలేజి టైమయింది. వస్తా. నమస్తే.

రా: సరే.

— తెర — ★

# సంఘ జీవితం

**శ్రీమతి రుక్మిణీగోపాల్**

"ఏమిటీ నీగోల? ఇప్పుడు నీ వింతకీ చెప్పేది ఇల్లు మార్చమనేనా?"

"మీకు తెలిసుండి కూడా, తిరిగి నన్నెందుకు ప్రశ్నించటం?"

"వెంకి సమాధానాలు చెప్పటం మట్టుకు మా బాగా తెలుసు. నీకిప్పుడు ఇక్కడ వచ్చిన లోటేమిటి?"

"మళ్ళీ రెడ్డొచ్చె మొదలా? నేనీ ఉమ్మడి మట్టుకు భరించలేకుండా ఉన్నాను. తెల్లవారింది మొదలు చీపురు కట్టా, అలుకుగుడ్డదగ్గరనుంచి గొడవే. ఏదో పామెత చెప్పిన మోస్తరుగా అత్తపోరు లేదు, మామపోరు లేదు, మధ్యన వీళ్ళపోరేమిటి? అయినా ఇటువంటి వన్నీ వస్తాయని నేను మొదటనే చెప్పాను మనకీ ఉమ్మడి వద్దని"

"నీవు చెప్పటానికేంలే, అసలు మన వాళ్ళకు సంఘజీవితమనేది తెలియదు. ఎంతసేపూ, కూపస్థమండూకాలలాగ ఒకచోటే ఉండటం మూలాన్ని ఇతరులతో ఎలా గడుపుకోవాలో తెలియదు. మానవుడు ఒంటరిగా ఎప్పుడూ బ్రతకలేడు. మనకు జీవితంలో భిన్నాభిప్రాయాలు, విభిన్న స్వభావాలు గల అనేకమందితో పరిచయమౌతుంది. అందుచేత గడుపుకోటం నేర్చుకోవాలి. అంతేగాని "నాకు ఎవరితోటీ పడదు. ఒంటెత్తు రామలింగంలాగ నేనొక్కర్తెనే ఉంటాను" అంటే ఈ పట్టణాలలో ఎవరికీ కుదరదు."

"మీరు చెప్పిందంతా బాగానే ఉంది. నేను కాదనను. కాని ఈ గడుపుకోవాలన్నది ఇరుపక్షాల ఉంటే బాగానే ఉండును. కాని ఎంతసేపు ఒకళ్ళే గడుపుకోవాలంటే కష్టంకాదూ. మీరు చూస్తూనే ఉన్నారుగా. అనవసరంగా ఎందుకు గొడవ అని ఎన్నివిధాల ప్రయత్నించినా గొడవ తప్పటంలేదు. అయినా ప్రయత్నించిన తరువాత ఒక్కళ్ళు ఉండటం సాధ్యం కాకపోతే జంటగానే ఉండవచ్చు. కాని ప్రయత్నించకుండా మొదటినుంచి కూడా జంటగానే ఉండాలన్న ఈ విపరీత సిద్ధాంతమేమిటి?"

హేమయొక్క ఈ మాటలు వినేటప్పటికి రామానికి విసుగు, కోపము కూడా వచ్చాయి.

"నీ బుర్ర అంతవరకూనే పనిచేసిందన్నమాట. అసలు సంఘజీవితమువలన చాలా లాభాలున్నాయి. విదేశాలలో చిన్నపిల్లల దగ్గరనించి ఏ 'కిండర్ గార్డెన్స్' లోనికో పంపించివేస్తారు కాని ఇంటిలో కూర్చోపెట్టుకోరు. అందుచేత అప్పటినుంచీ కూడ వారికి సంఘజీవితం అలవడుతుంది. ఇంక ఇక్కడ మన దేశంలోనో!— అమ్మమ్మల పెంపకమూనూ, నాయనమ్మల పెంపకమూనూ. గారాం చేసి, పెంకితనం నేరపటం తప్ప ముందు జీవితంలో ఉపయోగపడేవి ఏమీ నేర్పరు. అందుచేతనే మన దేశమిలా తగులడుతోంది."

"నిజమే, మీ ఆశయాలతోటి నేను పూర్తిగా ఏకీభవిస్తాను. కాని ప్రస్తుతం మన దేశ పరిస్థితులను మీరు గమనించటంలేదు. అక్కడ గడిపినట్లు మన మిక్కడ సంఘజీవితమును గడపలేము. అక్కడ ఒక కుటుంబముయొక్క గృహసంబంధమైన విషయాలలో ఇంకొక కుటుంబం అనవసరంగా కలుగచేసుకోదు. ఇక్కడ అలా కాదు. ఎంతమాత్రం తీరుబడి ఉన్నా ఇతరుల గొడవే! ఈ విధమైన వాళ్ళతో మనకు సంఘజీవితమేమిటి?"

రామానికి ఆఫీసుకు టైమ్, అయిపోయింది. అందుచేత ఇక వాదన ఆపుచేసి త్వరగా భోజనం ముగించాడు. హేమ

> ఇరుగూపొరుగూ నలుగురితోనూ సర్దుకుంటూ పోతూ సమాజంలో కలిసి జీవించడం ఎలానూ తప్పదు. కాని సర్దుకుపోవాలనే భావం ఒకరికుండి మరొకరికి లేకపోతే జీవితం కష్టభాజనమై పోతుంది. అలా సంభవించినప్పుడేం చెయ్యాలి?

ఇచ్చిన పాన్‌బీడా తీసుకుని ఆఫీసుకు వెళ్ళిపోయాడు.

* * *

హేమ పెళ్ళయి ఆరు సంవత్సరాలైంది. కాని పెండ్లయిన రెండు సంవత్సరాలకే రామం ఇంగ్లండు చదువుకు వెళ్ళిపోయాడు. మూండేండ్ల తరువాత తిరిగి వచ్చాడు. ఈ మూడేండ్లలోను అతని జీవితంలో గొప్ప మార్పు కలిగింది. పాశ్చాత్య నాగరికతలతని రోమరోమానికి అంటిపోయినవి. నాలుగు నెలలక్రిందటే అతనికి బొంబాయిలో ఉద్యోగం దొరికింది. ఒక స్నేహితునితో కలిసి జాయింటుగా ఒక ఇల్లు తీసుకున్నాడు. ఇద్దరు చెరొక వాటాలో ఉంటున్నారు.

హేమకు ఈ విధంగా జాయింటుగా ఇల్లు తీసుకోవటం మొదట్లో ఇష్టం లేకపోయింది కాని తప్పనిసరి అయింది. ఇంగ్లండు వెళ్ళివచ్చిన తరువాత రామం దృష్టిలో "దేశ దౌర్భాగ్యాలలో" ముఖ్యమైంది ఇక్కడివాళ్లు సంఘజీవితమును గడుపలేక పోవుట అని తోచింది. అందుచేతనే హేమ ఎంత పోరినా వినక జాయింటుగానే ఇల్లు తీసుకున్నారు. అంతే కాక ఈ రెండు కుటుంబములకు ఒకే వంటయిల్లు, ఒకే చదువుకునే గది. ఒకేచోట భోజనములు మొదలగు ఏర్పాట్లను చేద్దామని తలిచాడు. కాని కొన్ని కారణాల చేత అది సాగలేదు. ఒకే నౌకరును, ఒకే దాసీ మనిషిని మాత్రం పెట్టగలిగేడు. వీరిద్దరి మధ్య మధ్య ఆ గృహిణుల చిన్న చిన్న తగవులకు కారణ మవసాగేరు. హేమకు, రామానికి మనసు మనసు అయితే కలిసింది కాని, మాటా మాటా కలవలేదు. ఈ జాయింటుకాపరం హేమకు ఎంతమాత్రం ఇష్టం లేదు. దానివల్ల లాభాలకంటే నష్టాలు ఎక్కువగా ఉంటాయని హేమ అభిప్రాయం. ముఖ్యంగా గృహసంబంధమైన అనేక విషయాలు రహస్యమైనవి, కానివి కూడ ఇతరులకు తెలియకూడదని ఆమె అభిప్రాయం. కాని కలిసి ఉన్నప్పుడు ఇది జరగదని ఆమెకు తెలుసు.

ఆమె ఇదివరకు ఇటువంటి ఘట్టాలు చాలా చూసింది. నలుగురు అమ్మలక్కలు మధ్యాహ్నంపూట పని తీరుబడి చేసుకుని, లేకపోతే కొన్ని పనులైనా వదిలేసి ఒకరింట్లో గుమిగూడతారు. అక్కడనుంచి ఇరుగుపొరుగుల ఇండ్లలోని విషయాలను గురించి చర్చ ప్రారంభిస్తారు. "కావమ్మగారింట్లో ఎన్నడో ఒకనాడు తప్పవిడిచి రోజూ కూర వండుకోరు—ఆయన ఆట్టె సంపాదన పరుడు కాడట" అని అంటుంది ఒక స్థితిమంతురాలు. "వాళ్ల రాజేశ్వరి, తండ్రి చూసిన సంబంధం చేసుకోనని నిక్కచ్చిగా చెప్పేసి, జానకమ్మగారి అబ్బాయి మధుసూధనరావునే చేసుకుంటానందిట, అంత అలా సిగ్గువిడిచి తండ్రితో ఎలా చెప్పిందే అమ్మా! నేనయితే చచ్చినా పోదును గాని అలాంటి సిగ్గుమాలిన మాట నోటి వెంట రానీను" అని అంటుంది ఒక మానవతి. "విన్నావా?—వాళ్ల సుభద్రమ్మగారి అమ్మాయిని పురుడువచ్చిన నెలలోపలనే మొగుడువచ్చి తీసుకుపోయాడుట, మూడో నెల వచ్చేవరకైనా అట్టి పెట్టలేదుట. కాలమహిమ!" అంటుంది ఒక జ్ఞానురాలు. ఈ చర్చలలో అప్పుడప్పుడు చిన్న చిన్న తగవులాటలు సంభవించి మన మాట నెగ్గింది కాదన్న ఉడుకుమోతుతనము, ఏడుపును సూచించు కళ్ల ఎర్రదనము, ముక్కులోని పల్చదనము మొదలగునవి సంభవిస్తాయి. ఆఖరికి "కావయ్యగారి కంతి చిన్నదా పెద్దదా" అను చిన్న వాదనలు పెద్దవాటిలోకి దారితీసి చూపులు, మాటలు లేకపోవడంలోకి పరిణమిస్తాయి.

ఈ ఘట్టములన్నీ చూస్తున్న హేమకు ఒకరితో జంటగా కలసిఉండటం నచ్చలేదు. ఇరుగు పొరుగు ఇండ్లకు పెత్తనాలకు వెళ్లటం కూడా ఆమెకు ఇష్టం లేదు. తీరిక సమయములలో చదువుకుంటూ కాలము గడిపేయటం ఆమె పద్ధతి. ఇంత మాత్రం చేత హేమ సంఘజీవి కాదని, ఆమె ఇతరులతో కలసిమెలసి ఉండదని అనుకోకూడదు. ఆమె తోటివారితో చాలా సరదాగాను, చలాకీగాను ఉంటుంది. అతి పరిచయం చేసుకుని, అనవసరపు గొడవలు తెచ్చుకోటం ఆమెకు నచ్చదు. ఒకప్పుడు ఆమె "చదువు లేని అజ్ఞానులతో కాని ఇటువంటి అనవసరపు గొడవలు రావని" తలచింది. కాని ఈ కొత్త ఇంటిలో కాపరం పెట్టిన తరువాత ఆమెకీ సందేహం తీరింది. ప్రక్కవాటాలో నున్న నారాయణరావుగారి భార్య– రాజేశ్వరి ఇంటర్ మీడియెట్ పాసయింది. అందుకే ఆమె చాల గర్వపడిపోయేది. ఈ గర్వమునకు, ఆమెకున్న "స్వల్ప ఆస్తి" కూడ సాయపడింది. హిందీ విశారద మాత్రమే పాసైన హేమ ఆమె దృష్టిలో విద్యాహీనురాలిలాగ కనపడేది. హేమ తలితండ్రులు సనాతనులగుటచే, ఆమెకు ఆంగ్లవిద్యను నేరిపింపలేదు. ఈ కారణముచేత రాజేశ్వరి హేమకంటె తానధికురాలననుకునేది.

* * *

ఆనాడు రామం ఆఫీసుకు శలవు. అప్పుడే వర్షం కురిసి వెలసింది. మధ్యాహ్నం మూడుగంట లయింది. హేమ కుంపటి అంటించి కాఫీకి నీళ్లు పడేసింది. రామం కూడ హేమతో ఏవో కబుర్లు చెప్పుతూ వంటింట్లోనే కూర్చున్నాడు. నీళ్లు మరిగిన తరువాత డికాక్షన్ వేసింది. కుంపటి ఊరికే ఉండిపోతుందిగదా, కూర పడేసి మరీ కాఫీ కలుపుదామని కూర తరగ నారంభించింది. కాఫీ సామానంతా కుంపటిదగ్గర అదివరకే రెడీగా పెట్టింది. ఇది చూసి రామం కాఫీ కలప నారంభించాడు. ఒక కప్పు తను తీసుకుని ఒకటి భార్యకిచ్చి, "చల్లారిపోతుంది త్వరగా తాగ" మన్నాడు. ఇదంతా తమ వంటింట్లో కూర్చుని కాఫీ కాస్తున్న రాజేశ్వరి చూచింది. రామం భార్యాలోలుడని, ఆమెకు అన్నివిధాలా సాయంచేస్తాడనీ తలచింది. ఆమెకు ఇది చాలా విచిత్రంగా కనపడింది. అమాయకుడైన రామంమీద ఆ విధంగా అధికారం చెలాయిస్తున్న హేమ

(39-వ పేజీ చూడండి)



# గాలివాన

(7-వ పేజీ తరువాయి)

ఒక్కొక్క కప్పు చొప్పున తాగుతాడు.

గాలి అంతకంతకు భయంకరంగా వీస్తోంది. పెద్ద చినుకులు హోరుగా రైలు పెట్టెమీద మొత్తుతున్నాయి. ఆ హోరులో రైలు నడిచే చప్పుడు కూడా మాటుపడిపోయింది. రైలు కదులుతున్నట్టు రావుగారికి ఒక్క కుదుపువల్ల తప్ప తెలియడంలేదు.

'తుపానులా వుంది' అన్నాడు యువకుడు భార్యతో. ఆమె సమాధానం చెప్పకుండా ఒక రగ్గు దగ్గరగా కప్పుకుంది. ఆమె ముఖంలో పెద్ద బెంగ ఏదో ప్రతిఫలిస్తోంది. గాలివానను గురించి రావుగారి మనసులో అదురు ప్రారంభమయింది.

పెట్టె తలుపు తెరుచుకుంది. ఒక్కసారి పెద్దగా గాలీవానా పెట్టెలోకి చొచ్చుకువచ్చాయి. చినిగిపోయి తడిసిపోయిన గుడ్డలతో ఒక ఆమె పెట్టెలో ప్రవేశించింది. లోపల వున్నవారు చెప్పే అభ్యంతరాలు లక్ష్యపెట్టకుండా తలుపుమూసి ఒకమూల నీరు కారుతూ ఆమె నిలబడింది. ముసలాయన తగినంత కోపం తెప్పించుకుని 'ఇది పరువులపెట్టె అని తెలియదూ' అన్నాడు.

'బాబ్బాబు! తాతగారు! ముష్టిముండకి కొంత నిలబట్టానికి చోటివ్వరా బాబుగారూ. దయగల బాబులు! బిడ్డలున్నాతంపులు! ముష్టిముండకి మీకానీ పారెయ్యండి బాబు. ఆకలి కడుపులో సిచ్చెడుతంది బాబులు. గొప్పగొప్ప బాబులు. డబ్బున్నా బాబులు. గొప్ప పెభువులే అంతాను. పేదముండని ఇల్లా ఆకలితో చచ్చిపోనివ్వరు బాబులు...'

రావుగారు ఆమెవేపు చూశారు. ఆమె కళ్లలో తమాషాగా మెరిసే ఒక తళుకుంది. ఆ తళుకు రావుగారి హృదయంలో ప్రయోజనంలేని విరోధభావాన్ని రేకెత్తించింది. ఆమె వయస్సు షుమారు ముప్పయి ఏళ్లుంటాయి. అంత కడుపునిండా తిని ఉండి కొవ్వెక్కినట్టు ఆమె లేకపోయినా, ఆకలితో చచ్చిపోతున్నట్టు మాత్రం ఆమె కన్పించడం లేదు. ఎంత అసహాయత ఆమె నటించినా, ఆమెలో స్థైర్యం ఉంది.

బిచ్చమెత్తుకోడంమీద రావుగారికి అసలు సానుభూతి లేదు. పేదవాళ్ళున్నా, లేమివల్ల బాధపడుతున్నవాళ్ళున్నా, రావుగారికి జాలిలేకపోలేదు. కాని బిచ్చమెత్తడం తప్పని ఆయన నిశ్చితాభిప్రాయం. ఆ అమ్మి ఆయన దగ్గరగా వచ్చి బిచ్చం అడిగితే ఆయన ఇంక అనుమానం లేనంత గట్టిగా 'ఫో' అన్నారు. ఆమె ముఖం అదో మోస్తరుగా పెట్టి రెండో పక్కకు తిరిగింది. ఎదురుగా కూర్చున్న ముసలాయన దగ్గరకు వెళ్ళి వంగి పాదాలు ముట్టుకుంది. ముసలాయన కాళ్లు వెనక్కిలాక్కున్నాడు వెకిలిగా నవ్వుతూ.

'వెళ్లు, వెళ్లు' అన్నాడు ముసలాయన.

'అల్లా అనకండి తాతగారు. ఆ బాబంత రాతిగుండె కాదు బాబు నీది. ఆ బాబుగారికి యింతిమాత్రం జాలిలేదు. ఆకలితో చచ్చిపోతున్న ముండని ముష్టడిగితే 'ఫో' అంటాడు బాబు.'

తను అన్న 'ఫో' ఆమె అనుకరించడం పెద్ద పొగరుబోతుతనమని రావుగారికి అనిపించింది. కాని ఆయనకు ఏమనడానికి తోచలేదు. ఇష్టంలేకపోయినా ఆమెవేపు చూస్తూ ఆయన అలాగే కూర్చున్నాడు. ముసలాయన చిత్రమయిన అవస్థలో పడ్డాడు. దానికి ఓ డబ్బుయిచ్చి పంపేస్తే పెట్టెలో నలుగురూ హైకేమీ అనకపోయినా హర్షించరని ఆయన అనుమానం. ఇవ్వకపోతే ఆ ముష్టిది నోరు ఎలా జారవిడుస్తుందోనని భయం. ఇందులో ఏది ఉత్తమమో ఆయనకు తేలలేదు. చివరకి లేని తీవ్రత తెచ్చిపెట్టుకుని ఆమెను పొమ్మన్నాడు. ముష్టిది గోల ప్రారంభించింది.

'ఇందులో డబ్బున్నా కోరలున్నా తని, నాబోటి ముష్టిముండని ఆకలితో చచ్చిపోనివ్వరని ఎంతో ఆశగా ఈ పెట్టులో కొచ్చాన్రా దేముడ! ఈరోజు తిండికి సరిపడా అడుక్కుందామనుకున్నాను. ఎంత మోసమయిపోయిందిరా దేముడా! మూడోకలాసు పెట్లో పేదోళ్లుంటారు. ఆళ్ళకి ఎక్కువజాలి ఈబాబులకంటె. నా కట్టమంతా ఆళ్ళకి అర్ధమవుద్ది. డబ్బున్నాబాబులంతా రాతిగుండెలని తెలుసుకోలేక పోయాన్రా దేముడా! అవతల గాలివాన. రైలు నడుస్తావుంది. ఇక్కణ్ణించీ ఎల్లా పోను-ఆ దయగలబాబులున్నా సోటికి. ఇక్కణ్ణించి ఎల్లాపోను...'

ముష్టిమనిషి అందరి దృష్టినీ ఆకర్షించింది. రావుగారిపక్కనున్న పెద్దమనిషి అపరాధపరిశోధకనవల చదవడం ఆపేశాడు. విచిత్రంగా ఆమెవేపు చూశాడు.

'ఉనది ఏమి ఊరు,' అని తమిళుల తెలుగులో అడిగాడు. 'ఓ వూరేటి. ఓ పల్లేటి బాబు మాబోటి పేదోళ్ళకి. తమబోటి పెభువులకి సెప్పాలో నాకి వూళ్ళుంటాయి. పెద్ద పెద్ద లోగిల్లుంటాయి మీకు. గేటుముందు బంట్రోతులు కూచోని ముష్టోళ్ళని రానీకుండా తరిమేయిత్తారు. బాబులు. నాబోటి పేదముండకో వూరేటి? ఓ పల్లేటి?'

'నాలుక చాలావాడి' అన్నాడాయన రావుగారిని వుద్దేశించి, ఇంగ్లీషులో.

'ఇంగిలీసులో ఎందుకు బాబు తిటతావు, నాకా బాసొచ్చునా ఏమన్నానాకి ఏమీ తెలియనిముండని, పేదముండని.'

బయట చీకటిగా అయిపోయింది. చీకటి పడుతున్న కొద్దీ గాలిమరీ బలంగా వీస్తోంది. రైలు వానపాములా పాకుతోంది. రావుగారు దిగవలసిన స్టేషను దగ్గర పడుతోంది. ఆస్తికసమాజంసభ్యులు ఎవరన్నా స్టేషనుకి రాకపోతారా అని రావు

ారు ఆశగాఅనుకున్నారు. ఆయనమనస్సు కమకపడుతోంది. తనూ తన సామాలు రైలులోంచి దిగాలి. అదీ ప్రకృత మస్య. సహప్రయాణీకులు సహాయం ేయకపోరు. గాలి అవతల కోపంగావున్న ంహాసముద్రంలాగ హోరుమంటోంది. ిట్లు పడిపోతున్న చప్పుడు లాంటివి న్నోగోలగా కలిసిపోయి అవతల విన డుతున్నాయి. కదులుతున్న రైలు, ాలికి కారణభూతమయిన మానవమేధ ిగాలివానలో నిరుపయోగంగాను, ాత్యల్పంగానూ అనిపించాయి. పెట్టెలో ంత సుఖంగానే వుంది. కాని అందులో ంచి దిగిపోవాలి.

ముష్టిది పెట్టెలో యువదంపతులకు ెదురుగా మధ్యగా కూర్చుంది. కొంచెం ేపు ఆగి, మళ్లీ ప్రారంభించింది.

'అమ్మో నా సిట్టితల్లిగా రున్నారిక్కడ, ిట్టిబాబుగారు కూడా ఉన్నారిక్కడ. ంకేం! నూడేలేదు ఎర్రిముండని. సిట్టి ల్లిగారు! సిట్టిబాబుగారితో సొప్పి ఒక్క ్బు యిప్పించు తల్లి! ఎందుకు తల్లి అల్లా ముగం తిప్పుకుంటావు. ఏం? సిట్టితల్లికి ిట్టిబాబుకీ సిట్టి తగాదా వొచ్చిందా? సిట్టి ాబుగారు అత్తమానూ చిగరట్లు తాగు ారు. సిట్టితల్లి తాగనీకూడదు. అబ్బో! ిట్టితల్లికి నవ్వొత్తా వుంది.'

యువతి చిరునవ్వు ఆపుకోలేకపో యింది. యువకుడు కడుపునిండా నవ్వాడు. అన్నాడు:

'మాతో కూడా వచ్చేయకూడదూ నువ్వు? పనీ పాటా చేస్తూ వుందుగాని తిండీ గుడ్డా యిస్తాము'

'ఏదో యిచ్చి దాన్ని పంపెయ్యకూడదూ?' అంది యువతి భర్తని ఉద్దేశించి.

'నాకు తెలుసు. సిట్టితల్లి గుండె జాలి గుండె. తాతగారు ఇప్పుడు నాకో అణాకి తక్కువ ఇవ్వరు. ఎర్రిముండని ఆ బాబుకంత చిరాకు వచ్చేలాగ చెయ్యకూడదు. తాతగారంత మంచిబాబు ఎక్కడా వుండరు. తాతగారు జాలిగల పెభువు...'

రావుగారు తప్ప తక్కిన అందరూ ఆమెకు ఏదో యిచ్చారు. ఆమె మాటలు వింటుంటే అందరికీ సరదాగా వుంది. కాని రావుగారి మనస్సు ఇతర విషయాలతో నిండిపోయింది. ఆయన గాలివానను గురించీ, తను రైలులోంచి దిగడాన్ని గురించీ ఆలోచిస్తున్నాడు.

రైలు ఆగినట్టు రావుగారికి ఒక ముహూర్తంపాటు తెలియలేదు. సరిగ్గా అప్పుడే గాలివాన మరీ తీవ్రమయింది. ఆయన గొడుగు ఒకచేత్తో పట్టుకు లేచాడు. తలుపు తెరవడంతోటే గాలి ఆయన్ను తీవ్రంగా వెనక్కు నెట్టివేసింది. ఆయన తూలిపోయారు. ముష్టిమనిషి ఆయన సామానులు దింపిపెడతానంది. రావుగారికి ఆ సందర్భంలో మంచిచెడ్డలు ఆలోచించడానికి సావకాశం లేదు. ఆమె సహాయాన్ని అంగీకరించక తప్పలేదు. కాని ఏదో అస్పష్టమయిన నియమాన్ని ఉల్లంఘిస్తున్నట్లు ఆయన మనస్సులో కొంచెం బాధ కలిగింది. కాని రైలు దిగి ఆయన స్టేషనులోకి పరుగెత్తి వెళ్లిపోయారు. ముష్టి ఆమె ఆయనసామానుల బరువుతో తూలుతూ ఆయన వెనకాల వచ్చింది. సామానులు వెయిటింగురూములో పెట్టింది. స్టేషనులో ఎక్కడా ఒక్క దీపం లేదు. రావుగారు కొంత డబ్బుతీసి ఆమెకు యివ్వబోయాడు. ఆమె వద్దనలేదు గాని, ఏదో వినబడకుండా అని చటుక్కున మాయమయిపోయింది.

స్తబ్ధుడై రావుగారు మళ్ళీ తన గదిలోకి వెళ్లి కూర్చున్నాడు. గింగురుమనే ఆ గాలిలో కాళ్లు పట్టు తప్పిపోతున్నాయి.

గుడ్డలన్నీ తడిసిపోయాయి పెట్టితీసి చేత్తో యిటూ అటూ తడిమాడు. బాటరీలైటు చేతికి తగిలింది. పట్టరాని సంతోషం వచ్చింది రావుగారికి. తన పెట్టెలో ఒక లైటున్న దన్న సంగతి ఆయనకు గుర్తులేదు. తడిబట్టలు విప్పిపొడిబట్టలు కట్టుకున్నాడు. నూలుస్వెట్టరు తొడుక్కున్నాడు. మఫ్లరు చెవులకు, తలకు చుట్టుకున్నాడు. పెట్టితాళం వెయ్యడం కూడా మరిచిపోయి కుర్చీలో కూర్చున్నాడు. తన స్థితినిగురించి ఆలోచించడం కూడా ఆయనకు యిష్టం లేదు. ఇంతలో రైలు దీపాలు కదిలాయి. స్టేషనులో ఎవరో ఒకరు వుండి తీరాలని నిశ్చయించుకుని బయటికి వచ్చాడు. ఇద్దరు ఎవరో ప్లాట్ ఫారం దాటివెళ్ళడానికి ప్రయత్నిస్తున్నారు. రావుగారు గొంతెత్తి పిలిచారు. ఇద్దరూ ఆగారు. ఒకరు స్టేషను మాస్టరుగారనీ ఇంకొకరు బంట్రోతనీ రావుగారు గుర్తించారు.

'నేను వూళ్లోకి వెళ్లాలి' అన్నారు రావుగారు ఆదుర్దాగా. 'చాలా కష్టం. రోడ్డుమీద అంగుళం అంగుళానికీ చెట్లు పడివున్నాయి. టెలిఫోనుతీగలు తెగిపోయాయి. ఒకచోటికి, ఇంకోచోటికి కబురు తెలియడం కూడా అసంభవం. వచ్చే స్టేషనులో రాత్రికి రైలు ఆగిపోతుంది. గాలివాన చాలా తీవ్రంగా వుంటుందనీ, 36 గంటలవరకూ తగ్గదనీ మాకు వార్త వచ్చింది.'

'కాని స్టేషన్లో యింకెవరూ లేరు.'

'నేనేం చేస్తాను? ఎల్లాగో స్టేషనులోనే మీరు గడపాలి.'

స్టేషనుమాస్టరు వెళ్ళిపోయాడు. రావుగారు వెయిటింగురూంలోకి వెళ్ళిపోయారు. పడకకుర్చీలో కూలబడిపోయారు. గదితలుపులు మూసేస్తే గాలివాన లోపలికిరాకుండా వుంటుందని ఆయనకు తోచలేదు. రెండు కిటికీ తలుపులు ముక్కలైపోయాయి. కొన్ని పెంకు లెగిరిపోయాయి. ఏవో క్రూరశక్తులు విజృంభించి మానవుడు నిర్మించినవీ, దేవుడు సృష్టించినవీ కూడా భూమి మీదలేకుండా రూపుమాపడానికి పూనుకున్నట్లు అనిపిస్తోంది. ఈ గందరగోళములో మనస్థైర్యాన్ని చేకూర్చే వేదాంతమేదీ రావుగారికి తోచలేదు. క్రమశిక్షణ, నియమాలు, విలువలు అన్నీ కూడా మానవాతీతమయిన కొన్ని శక్తులు విజృంభించినపుడు అర్థరహితాలయిపోతాయని ఆయనకు జీవితంలో మొదటిసారి అనుభవంలోకి వచ్చింది. ప్రకృతి చెలరేగి సర్వనాశనాని కొడిగట్టినట్లయితే మానవుడు తన్ను తానెలా రక్షించుకోగలుగుతాడు? ఎన్నడూ ఎరుగని భీతి రావుగారి మనస్సును ఆవరించింది. ఆ బాధ దుర్భరంగావుంది. చుట్టు పక్కల ఎక్కడా మానవహృదయమన్నది లేదు. స్టేషన్ భీతావహంగా వుంది గాలివాన ఉగ్రరూపందాల్చింది. ఆయన మనస్సు ఒకపీడకలలో చిక్కుకున్నట్టు ఉక్కిరిబిక్కిరైపోయింది. ఆ గదిలో యింకో వస్తువేదో వున్నట్టు రావుగారికి కనిపించింది, తెరచిన తలుపులోనుంచి లోపలికేదో ప్రవేశించినట్టుగా. చేతిలో దీపం వెలిగించి ఆయన ఆవేపు చూశాడు. ముష్టి ఆమె గజగజ వణుకుతూ నీరుకారుతూ ఒకమూల నిలబడివుంది. ఆమె తడివెంట్రుకలు ముఖాన్నీ మెడనీ అంటుకున్నాయి. వాటివెంట నీరుకారుతోంది.

'బాబుగారు! తలుపు ముయ్యలేదే! కొంచెం వెచ్చగా వుంటుంది' అంది ఆమె గొంతుక బాగా పెద్దది చేసి. ఆయన ఒక యంత్రంలాగా లేచి తలుపు ముయ్యడానికి ప్రయత్నించి విఫలుడయ్యాడు. ఆమె సహాయం చేసింది. ఎలాగో తలుపు మూసి లోపల గడియవేశారు. కాని గాలి ఒక్కసారి వూపింది. గడియ వూడిపోయింది. ఇద్దరూ మళ్ళీతలుపులు మూసి గదిలో వున్న కర్రసామాను అంతా కొన్ని కుర్చీలూ, ఒక బీరువ, బరువైన డ్రాయరూ తలుపుకి అడ్డంగా చేర్చారు. తలుపులుముయ్యాలని తనకు తోచకపోవడం రావుగారికి వింతగా తోచింది. ఇపుడు కొంత వెచ్చగా వుంది. భయం తగ్గింది. ఎక్కడో పెద్ద చప్పుడైంది. ఏదో పడిపోయింది. స్టేషన్ లోపలే పడిపోయిందేమో! "ఏం గాలివానండి బాబుగారు నేను పుట్టినప్పటినుండి యింత గాలివాన నేను చూడలేదు" అంది ముష్టి ఆమె. ఆమె గొంతులో ఏమీ బెదురు లేదు. అంత ప్రశాంతంగా ఆమె ఎట్లా మాట్లాడకల్గుతూందో ఆయనకు అర్థం కాలేదు. ఆమెవేపు దీపంవేసి చూశాడు. మూలగా చలిచేత ముడిచిపెట్టుకుని వొణుకుతూ ఆమె కూచున్నది రావుగారు పెట్టి తీసి తన పంచ ఒకటి తీసి ఆమె వేపు విసరి 'తడిబట్ట విడిచి యిది కట్టుకో' అన్నారు. ఆయనన్న దేమీ ఆమెకు వినిపించలేదు గాని పొడిబట్టయిచ్చినందుకు కృతజ్ఞత చూపిస్తూ బట్ట మార్చుకుంది. ఆ మూలే పొడిగా వున్న చోట కూర్చుంది.

రావుగారికి తనకు ఆకలి వేస్తున్నట్లు జ్ఞాపకం వచ్చింది. ఆయన పెట్టె తీసి అందులోవున్న బిస్కట్లపొట్లం తీశాడు. ఒకటొకటి చొప్పున నమలడం ప్రారంభించాడు. ఆ మూల కూర్చున్న ఆమె ముఖంవేపు చూశాడు. ఆమెకుకూడా ఆకలి వేస్తున్న దేమో నని ఆయనకు స్ఫురించింది. 'బిస్కట్లు తింటావా' అని అడిగాడు. 'ఏమన్నారు?' అన్న దామె గట్టిగా. ఆ గాలిహోరులో ఒకరు మాట్లాడితే ఒకరికి వినిపించలేదు. ఆయన దగ్గరగా వచ్చి కొన్ని బిస్కట్లిచ్చాడు. ఇవే వున్నాయి తినడానికి అన్నారు రావుగారు ఏదో పొరబాటు చేసినట్లుగా. కాని అసలు లేని దానికంటె నయం కాదూ? తనచోటికి తిరిగి వెళ్లి పెట్టిమీద కూచున్నారు కుర్చీలు తలుపులకి అడ్డంపెట్టి వున్నాయి. ఆమె గదిలో వుండడంవల్ల కొంచెం ధైర్యం వచ్చింది. ఎవరూ లేకపోవడంకంటె ఆమె వుండడం కొంత నయం. ఆమె దేన్నికూర్చీ బాధపడదు గాలివానను గురించి కూడా. జీవితంలో కష్టనిష్ఠురాలు బాగా ఆమెకు అనుభవమై వుంటాయి. అంచేత ఆమె ఏ పరిస్థితినైనా కంగారు పడకుండా ఎదుర్కోగలదు. రావుగారు గడియారం వంక చూచారు. అపుడే తొమ్మిదిగంటలయింది. అయినా రైలు దిగినతర్వాత కొన్ని యుగాలు గడిచినట్లు ఆయన కనిపించింది. ఆయన వచ్చే స్టేషనువరకు మిగతావారితో కూడా ప్రయాణం సాగించివుంటే బాగుండును. పెద్ద గాలివాన చెలరేగుతుందనీ, తను దిగేది ఒక చిన్న స్టేషన్ అనీ ఆ కంగారులో ఆయనకు స్ఫురించలేదు. స్టేషన్నుంచి వూరు సుమారు రెండు మైళ్ళు ఉంటుంది. వూరికితర్వాత స్టేషన్ నుంచి అయినా చేరుకునివుండవచ్చు. అన్ని విషయాలను కొన్ని సూత్రాలలో బంధించడం అలవాటయిన ఆయన మనస్సు

గాలియొక్క వేగాన్నిగురించి యోచించింది. బహుశా గంటకు 80/- లేక 100/- మైళ్ళు వుండవచ్చు గాలివేగం. పెద్ద భయం ఆయన మనసును ఆవరించింది. ఈ గది కూలిపోవచ్చు. బయటికి పోయే ఒక్కదారీ కుర్చీలతోటీ, బల్లలతోటీ మూసి వుంది. ముష్టిమనిషి కూచున్నచోటికి ఆయన కంగారుగా పరుగెత్తారు. 'ఈ యిల్లు కూలిపోదుగదా?' అని ఆయన అడిగారు.

'ఎవరు చెప్పగలరు? యిల్లు గట్టిగానే వున్నట్టుంది. గాలిబలం ఎక్కువయితే ఏది ఆగుద్ది?'

ఆమె మాటల్లో ధైర్యాన్ని కలిగించేది ఏదీ లేకపోయినా, ఆమె గొంతులో ఏదో ఒక చనువూ స్థైర్యం ధ్వనించింది.

ఆయన పెట్టెదగ్గరకు పోయి కూర్చున్నాడు. ఆయన కూర్చున్న మూలకు నెమ్మదిగా ఆమె కూడా చేరింది. అక్కడ కూచుంటే ఒకరిమాట ఒకరికి వినబడదు అంది.

'గాలివాన యింత ముదిరిపోతుందని నేననుకోలేదు.'

'బాబుగారు ఎందుకలా భయపడతారం'దామె. 'ఒక్కరుంటేకంటె యిద్దరమున్నాంగదా! టిక్కెట్టుకలెక్టరు దొంగముండావాడు. రైలు కదులుతూంటే నన్ను దింపేశాడు, ఏం చేయను! యిక్కడుండిపోయాను. అయినా నాకేటి విసారం? బాబుగారు చుట్టు మెట్టుకోనాకి ఓ పాడి గుడ్డ యిచ్చారు. ఏదో కొంత ఆకలికి మేత పడేశారు. వచ్చే చేసనులో ఈమాత్రం సుకమయినా వుంటాదని ఎలా అనుకోగలను? వున్నంతలో సుకంగా వుండాలి బాబుగారు! అది లేదనీ, యిది లేదనీ సీకాకుపడితే ఏం లాబం?'

ఆమె గొంతు అలా మోగుతుంటే ఆయన మనస్సు కొంత స్థిమితపడింది. ఆమె భౌతిక దేహాన్ని చూస్తే ఆయన కసహ్యం. ఆయన మనస్సుకీ ఆమె మనస్సుకీ ఎంతో అంతరం వుంది. అయినా ఆ భయంకరమయిన రాత్రివేళ తనకు తోడుగా ఆమె వున్నందుకు కృతజ్ఞత ఆయన మనసులో నిండింది.

'నీ కెవరూ చుట్టాలు లేరా?' అన్నారాయన. వెంటనే యింత చనువుగా ప్రశ్న వేసినందుకు నొచ్చుకున్నారు. తను రైలులో ఆమెకు ఒక కానీ కూడా యివ్వనందుకు ఆమెకు తనమీద ఏమన్నా కోపముందేమోనని ఆయన అనుమానం. కాని ఆమె మాటల్లోగానీ చేతల్లోగానీ కోపం కనబడలేదు. గట్టిగా గొంతు ఎత్తి మాట్లాడవలసిన అవసరం లేకుండా ఆమె కొంచెం ఆయనదగ్గరగా జరిగింది.

'సుట్టాలందరికీ వుంటారు. ఏం లాబం బాబుగారు? మా అయ్య తాగుతాడు. ఆడే మా అమ్మని సంపేశాడంటారు. నాకు మనువు అవలేదు. కానీండి బాబుగారు ఓ దొంగముండావాడితో సేవితం కలిగింది. నాకు ఇద్దరు పిల్లలండి బాబుగారు. ఆడికి జూదం, తాగుడు అలవాటయిపోయాయండి. రోజూ ఏలకిఏలు నెగ్గుతుంటాడు. పోతుంటాయి ఏం చేయను బాబుగారు? ఇంట్లో తిండికీ తిప్పలకీ నా సంపాదనే. పిల్లలింకా చిన్నోళ్లు బిచ్చమెత్తుకోనాకి. మావోడికి రోజుకో పావలా ఇత్తానండి తాగుడికి. ఆడికి నన్ను సూత్తే అడలు బాబుగారు. తాగుడు లేకపోతే నా ఎదురుగా నిలబడి తట్టుకోలేడండి. అందుకే తాగుతాడు బాబుగారు! అసలు అందరికీ తాగుడు అలాగ అలవాటవుద్దండి.'

'నువ్వు ఏమాత్రం సంపాదిస్తావు?'

'ఒక్కొక్కరోజు ఐదు రూపాయలు దాకా దొరుకుద్ది. ఒకొకరోజు కానీ కూడా వుండదు. అయినా బాబుగారు! కనపడితే ఎవరూ లేదనరండీ మీరు తప్పితే. కొంతసేపు ఆరితో సరదాగా మాట్లాడితే యిచ్చేత్తారండి.'

రావుగారు అనుకోకుండానే ఆమె ముఖంమీదికి దీపం వేశారు. ఆమె కొంచెంగా నవ్వింది. ఎవరినైనా సరే ఆమె కిందా మీదా పెట్టేయగలదు. అయినా ఆమెకు మనస్సులో అంత లోతుగా యిష్టాలు అయిష్టాలు లేనట్టు ఆయనకు అనిపించింది. జరుగుతున్న ఆక్షణంతోనే ఆమెకు సజీవమయిన అనుబంధం, గడచిన కాలపు స్మృతులబరువుగానీ, రాబోయే రోజుల గూర్చిన ఆశలుగానీ ఆమెకు లేవు. ఆమె నడవడిని నిర్ణయించే సూత్రాలు లేవు. ఆ సూత్రాలలో నిషేధాలసలే లేవు. నిత్యమూ ధర్మాధర్మచింతతో బాధపడే అంతరాత్మగానీ, నాగరికులకు సహజమయిన సంకీర్ణ మనస్తత్వంగానీ ఆమెకు లేవు. తను ఎన్నడూ ఎరగని మగవాడికూడా ఆమె శరీరాన్ని అర్పించి తేలికైన మనస్సుతో ఆమె సుఖించగలదు. ఆయన ఆమె కొంటె చిరునవ్వుని యింకా అలానే చూస్తూ కూచున్నారు. 'ఏటండి బాబుగారు! నాకేసలా చూత్తారు?' అంది ఆమె. 'మునుపున్నంత రంగుగా యిపుడు లేనండి.'

వెంటనే ఆయన తనలోకి ముడుచుకుపోయారు. తన మనస్సులో అశ్లీలమయిన భావాలు వుంటాయన్నట్లు ఆమె సూచించినందుకు ఆమెమీద అసహ్యం కలిగింది.

'నీవేపు చూడ్డం లేదు నేను,' అన్నారాయన, గట్టిగా. 'దీపం ఆర్పడం మరచిపోయాను.'

అకస్మాత్తుగా పెద్ద చప్పుడైంది. గది తలుపులు ఒక్కవూపులో తెరుచుకున్నాయి. అడ్డుగాపెట్టిన సామాను చెల్లాచెదరైపోయింది. ఒక తలుపువూర్తిగా ఊడిపోయి ఒక కుర్చీమీదనుంచి పల్టీకొట్టింది. రావుగారిగుండె గొంతుకలో అడ్డింది. శక్తికొద్దీ ఒక మూలలోకి గెంతి, పిచ్చిగా ఆయన ముష్టిఆమెను కౌగలించుకున్నాడు. వెంటనే తెలివి తెచ్చుకుని చాలా సిగ్గుపడ్డాడు. కాని ఆమె ఆయనచెయ్యిపట్టి నడిపించుకుని వెడితే మాట్లాడకుండా వెళ్లాడు గుమ్మంపక్కనున్న మూలలోకి. ఆమె ఆయనను తీసుకువెళ్లి ఆ మూలలో కూచోబెట్టింది. తనుకూడా దగ్గరగా కూర్చుని చేతులాయన చుట్టూ చుట్టింది. ఆ కౌగిలింతలో సంకోచాలేమీ లేవు. ఆయన మనస్సులో ప్రళయమంతటి మథన జరుగుతోంది. కాని ఆ వెచ్చదనం ఆయనకు ప్రాణావసరం. అంచేత ఆయన కాదనలేదు.

'సరిగ్గా కూకోని నా సుట్టూ సేతులేసుకోండి. కొంత ఎచ్చగుంటది. పాపం! బాబుగారు ఒణికిపోతున్నారు.'

ఆ మాటలు చాలా వెగటుగా ధ్వనించాయి రావుగారికి. ఆమె మరీ దగ్గరగా జరిగి ఆయన వొళ్లోకి వాలింది. ఆమె రొమ్ములబరువు ఆయన మోకాళ్ళమీద ఆనింది. మోకాళ్లు మరికొస్త దగ్గరగా ఆయన ముడుచుకుని దీర్ఘంగా అవమానకరమయిన ఆలోచనాపరంపరలో మునిగిపోయాడు. ఆమె అలా మాట్లాడుతూనే వుంది.

'ఈ కూల భయం లేదండి. బాబుగారికి చక్కని కూతుళ్లుంటారు యింటికాడ. బాబుగారు ఆరిని తలుచుకుంటున్నారు. మా గుడిసి ఎగిరిపోయుంటది. మా పిల్లలేమైయుంటారో! ఇరుగు పొరుగోళ్లు సూత్తుంటారెండి. మావోడు వట్టి ఎదవ. ఎందుకూ పనికిరాడు. చిత్తుగా తాగిపడుంటే గుడిసి ఎగిరిపోతే ఆడికేం తెలుత్తాది? పిల్లలు సుకంగా వున్నారో లేదో!'

ఒక మానవహృదయంలోనించి వెలువడిన యీ వేదన వింటుంటే ఆయన హృదయం చుట్టూ పెట్టుకున్న గోడలన్నీ మాయమైపోయాయి. పెద్ద ఆవేదనతో ఆ ముష్టిఆమెను గట్టిగా దగ్గరగా అదుముకున్నాడు. ఆమె ఆవేదన తనకు అర్థమయినట్టు ఆయన మోకాళ్లమీద మెల్లగా తట్టింది. క్రమంగా ఆయన మనస్సు ఆలోచించడం మానివేసింది. గాలిచేసే అంతులేని గోల మనస్సుపాలిమేరల్లోకి పోయింది. ఆయన కాళ్లమీద గుండెలమీద అనుకున్న మానవశరీరపు వెచ్చదనం వొక్కటే ఆయనకు గుర్తువుంది.

కాలం అతిమెల్లగా జరుగుతోంది. కాని ఆ సంగతి ఆయనకు తెలియదు. గాలివాన బలం హెచ్చింది. అన్నిపక్కలనించీ పెద్ద పెద్ద శబ్దాలు వినబడుతున్నై. తెల్లవారేసరికి ఒక చెట్టయినా నిలబడివుంటుందా అనిపిస్తోంది. కొంచెంయించుమించుగా పైకప్పు రేకులన్నీ గాలికి ఎగిరిపోయాయి. కాని గాలివల్ల వాన వారిద్దరినుంచీ దూరంగా రెండో పక్కకి పడుతోంది.

కొంతసేపటికి రావుగారి కాళ్లు తిమ్మిరి ఎక్కాయి. పడుకునివున్న ఆ మూర్తి కదలకుండా మెల్లగా ఆయన కాళ్లు కదుపుతున్నాడు. మెల్లగా మనస్సు మేలుకుంది. లైటువెలిగించి ఆమె ముఖంవంక చూశాడు. నిద్రలో ఆ ముఖం అమాయికంగా, నిశ్చింతగా వుంది. స్వచ్ఛమైన, నిసర్గమయిన ఒక శోభ ఆ ముఖంలో దివ్యత్వం స్ఫురింపచేసింది.

గాలివానజోరు హెచ్చింది. కాని ఆయన మనస్సులో అమితమయిన ప్రశాంతి నిండింది. శరీరం అలసిపోయి విశ్రాంతి కోరింది. క్రమంగా ఆయన పరిసరాలను మరచిపోయి నిద్రలో మునిగిపోయాడు.

ఆయనకు మళ్ళీ మెలకువవచ్చేసరికి వాన తగ్గింది. గాలిమాత్రం బలంగా వీస్తోంది. ముష్టిఆమె లేచి వెళ్లిపోయింది. గడియారం వేపు చూచుకున్నారు. ఐదుగంటలయింది. లేచి నిలబడ్డారు. మోకాళ్లు పట్టివేశాయి. అనుకోకుండానే జేబులుతడుముకున్నారు. ఆయనకు స్ఫురించిన మొదటిమాట, 'దొంగముండ!' కాని ఆమె అల్లా దొంగతనంచేసివుంటుందనుకోడం ఆయనకు యిష్టంలేదు. గదిలో నాల్గుమూలలా వెతికారు. కనబడలేదు. గడిచినరాత్రి కంగారులో ఎక్కడన్నా పడిపోయిందనుకున్నారు. గదిలోనుంచి బయటికి వచ్చారు. బయట దృశ్యం భీభత్సంగా వుంది. ప్లాట్‌ఫారంతప్ప చుట్టుపక్కలంతా నీటిమయం. కొందరు దూరంగా రైలుగట్టువెంబడి నడిచివస్తున్నారు. బహుశా వూళ్ళోనుంచి అయివుంటుంది. కొందరు దెబ్బలుతిన్నవాళ్లు స్టేషను రెండోపక్కన కింద పడుకునివున్నారు. దూరాన్నుంచి చూసి ఆయన మొగంతిప్పుకున్నారు. ఏదోహాస్పిటల్‌లో తెల్లగా శుభ్రంగా వరుసల్లో పడుకోబెట్టినప్పుడు తప్ప అంత నగ్నంగా మనిషి బాధపడడం ఆయన ఎప్పుడూ చూడలేదు. ఆయనకు వికారం వచ్చింది, వెనక్కి తిరిగాడు.

టిక్కెట్లు అమ్మేగది పూర్తిగా కూలిపోయింది. గదితలుపులు ఎక్కడా కనబడ్డంలేదు. లోపల ఏవో పుర్జీలూ, బల్లలూ చిందరవందరగా పడిపోయివున్నాయి. వెయిటింగురూము కూలిపోతే ఏమైయుండునని ఆయన అనుకున్నాడు. ఆ కల్లోలాన్ని శూన్యంగా చూస్తూ ఆయన నిలబడిపోయాడు.

లోపలి చీకటికి కళ్ళు కాస్త అలవాటుపడ్డాక ఆ సామానుకింద ఏదో శరీరం అస్పష్టంగా అనిపించింది. దీపంవేసి చూశారు. ముష్టియామె.

ఆయన తట్టుకోలేకపోయాడు. వంగి నుదురు తాకి చూచారు. చల్లగా చచ్చిపోయివుంది. చేతులు రెండూ యివతలకు వున్నాయి. క్రింది భాగం పూర్తిగా నలిగిపోయినట్టుంది. ఒక చేతిలో ఆయన పర్సుంది. రెండోచేతిలో కొన్ని నోట్లు, కొంత చిల్లరా వుంది. బహుశా టిక్కెట్లు అమ్మిన డబ్బైవుంటుంది. గుమస్తా ఆ డబ్బు డ్రాయర్లోపెట్టి తొందరగా యింటికి పోయుంటాడు.

రావు అకస్మాత్తుగా చిన్న పిల్లవాడివలె ఏడువు ప్రారంభించాడు. చల్లని ఆ నుదురు ముద్దుపెట్టుకున్నాడు. గడిచిన రాత్రి ప్రతీ చిన్నవిషయం ఆయనకు మళ్ళీ మళ్ళీ జ్ఞాపకము వచ్చింది. తనకు ఆత్మస్థైర్యాన్నీ శాంతినీ, గాలివానకు తట్టుకోగలశక్తినీ చేకూర్చిన ఆ మూర్తి అక్కడ పడిపోయివుంది. ఆ గాలివానకు ఆమె బలిఅయిపోయింది. ఆయన హృదయం తుపానులో సముద్రంలాగా ఆవేదనతో పొంగిపొరలింది. తనకు జీవితంలో మిగిలిన ఒక్క ఆనందమూ శాశ్వతంగా పోయినట్టు ఆయనకు అనిపించింది. తన పర్సు దొంగిలించినందుకు గాని, అంత గాలివానలో డబ్బేమున్నా దొరికితే తీసుకోవచ్చునని టిక్కెట్ల గదిలోకి వెళ్లినందుకు గాని ఆయన ఆమెను మనస్సులో కూడా దూషించలేదు. ఆమె ఆతురత్వం ఆయనకు తెలుసును. ఇప్పుడు ఆమె చిలిపితనాలు, కొంటెతనాలు ఆయనకు ప్రేమపాత్రాలయాయి. ఆయనలో లోతుగా మాటుపడియున్న మానవత్వాన్ని ఈ జీవి వికసింపచేసింది. ఆయనభార్య గాని ఆయన పిల్లలలో ఎవరు గానీ ఈమె వచ్చినంత దగ్గరగా రాలేదు. ఆయన విలువలు, నియమాలూ, ధర్మచింతా, వేదాంతం అన్నీ త్యజిస్తా డాయన ఈ వ్యక్తికి ప్రాణం పొయ్యగలిగితే.

అవతల మనుష్యులు వస్తున్న సవ్వడి వినిపించింది. రావుగారు కళ్లు తుడుచుకుని ఒక క్షణం ఆలోచిస్తూ నిలబడ్డారు. తర్వాత ఒక నిశ్చయంతో ఆమె వేళ్ళ సందులోంచి డబ్బు తీసి తెరచివున్న డ్రాయరులోవేసి డ్రాయరు మూశాడు. కాని తనపర్సు ఆమె చేతిలోంచి విడదీయడానికి ఆయనకు మనస్సు వొప్పలేదు. తనకు సంబంధించినదేదో ఒక చిహ్నంగా ఆమెశరీరంతో ఉండిపోవాలని ఆయనకు అనిపించింది. కాని యితరులు ఆమె దొంగతనం చేసిందని అనుకుంటే ఆయన భరించలేడు. అంచేత జాగ్రత్తగా ఆ పర్సులోనుంచి తన పేరుగల కార్డు తీసివేసి బరువైన హృదయంతో అక్కణ్ణించి వెళ్లిపోయాడు.

★




# ★ పా పా యి!.... ★

శ్రీ మానేపల్లి సంగమేశ్వర కవి

**1**

హాయిగా పవళించ
వోయి పాపాయి!
హాయిలో సౌఖ్యాల
నందుకొనవోయి!

**2**

అమ్మ, కమ్మనిపాల నతిప్రేమతోఁ గ్రోయు
నిమ్మళమ్ముగ త్రావి, నిదురించవోయి.
కొమ్మపై కోయిలా కులికి పాడినదోయి,
నమ్మి—నీపసిమనసు, నాట్యమాడాలోయి.

**3**

అందరికి వొకముద్దు అమ్మకొకముద్దు
అందాల నొలికించు చంద్రునికి ముద్దు
చంద్రలోకము ప్రాకి, స్వప్నాల జేరి,
ఇంద్ర ధనసూ నెక్కి...ఎగిరి రావోయి.

**4**

బుల్లి బుజ్జాయివా కల్లలెరుగని పాప!
తల్లి యొదలో నెట్లు దాగుండినావో?
అల్లారుముద్దులూ ఆనంద తేజమై,
చల్లనీ నీ నవ్వు జాబిల్లి వెన్నెలై—

**5**

భువి నేలు, దివి నేలు—ఓ బుద్ధ తేజ!
కవితాసుధాగాన గంధర్వ రాజ!
రాజ భోజుని మించు రాజ్యాల నేల,
పూజించరా...తల్లి పుణ్యభారతిని.

# స్వప్న లోకంలో ఆలిస్


## బొమ్మల కథ

ఆలిస్ అనే అమ్మాయికి బొమ్మలూ, బొమ్మలు మాటాడుకోడమూ లేని పుస్తకం అక్క చదివి వినిపిస్తుంటే విసుగెత్తి ఆవలింతలు వచ్చాయి మెల్లిగా చెట్టునీడనే మెత్తటి పచ్చికమీద పడుకుని నిద్రపోయింది ఆలిస్ నిద్దలో చిత్రమైన కలవచ్చింది ఆ కలే ఈ బొమ్మల కథ.

ఒక తెల్లకుందేలు సూటూ గీటూ వేసుకుని, గొడుగు ఒక చేత్తో పట్టుకుని, కోటుకి గొలుసులో వేలాడగట్టిన జేబుగడియారం చూసుకుంటూ "హవ్వ! హవ్వ! అయ్యయ్యో! ఆలస్య మైపోయింది" అంటూ పరుగెత్తడం చూసింది ఇది గమ్మత్తుగా ఉందనుకుని ఆలిస్ దాన్ని ఒక బొరియలోకి వెంబడించింది చీకటిగా ఉన్న బొరియలో కొన్ని అడుగులు పాకిన తరవాత ఉన్నట్టుండి మట్టంలేని నూతి వంటి ఒక సొరంగంలో పడిపోయింది ఆలిస్ పడిపోయి ఒక చక్కని చిన్న మందిరం చేరుకుంది ఆ మందిరానికి చుట్టూ తలుపులూ అవీ ఉన్నాయి గాజుతో చేసిన ఒక చిన్న ముక్కాలిపీట కనపడింది పీటమీద బుల్లి బంగారపు తాళంచెవి ఒకటి ఉంది ఆ తాళంచెవితో చుట్టూ తలుపుల తాళాలన్నీ తియ్యడానికి చూసింది తలుపులేవీ రాలేదు కాని నేలబారుగా ఉన్న అరడుగు తలుపొకటి మాత్రం వచ్చింది అది తీసి చూసేసరికి చక్కని పూలతోట, నీటిఊటలూ కనపడ్డాయి అక్కడికెలాగ వెళ్లడం? ఆ అరడుగు రంధ్రంలో దూరలేదుకదా! తను ముడుచుకుపోగలిగితే బలేగా ఉండునుకదా అనుకుంది సరే తలుపుతాళం వేసేసింది మళ్లీ ఇంటికి పోవాలన్నా దారిలేదు కుందేలూ కనపడలేదు ఆలిస్ ఏడవడం మొదలెట్టింది బొటబొటా కన్నీళ్లు కారాయి కొంత సేపటికి తలెత్తి చూసేసరికి గాజు పీటమీద ఒక సీసా కనపడింది సీసాకి ఒక చీటీ కట్టిఉంది చీటీమీద 'నన్ను తాగు' అని వ్రాసిఉంది సరే కదా అని ఆలిస్ అందులో తియ్యగా ఉన్న పళ్లరసం తాగేసింది తాగీ తాగానే ఆలిస్ బుల్లిబొమ్మంత చిన్నదైపోయి ఊరుకుంది చుట్టూ పెద్ద సరస్సులో ఉన్నట్టుగా నీళ్లు తెప తెప లాడుతున్నాయి అరె! ఈ సరస్సెక్కడవించి వచ్చింది, అని ఆశ్చర్యపడింది నీళ్లు ఉప్పగా ఉన్నాయి అబ్బా! తను ఎంత ఏడిస్తే ఇన్ని కన్నీళ్లొచ్చాయో, అనుకుంది ఆ నీళ్లలో కొట్టుకుపోయేలాగుంది కూడా గాజుపీట ఎక్కుదామంటే ఇప్పుడది ఆకాశమెత్తున కనపడింది బుల్లి తలుపు తెరుచుకుందామంటే తాళంచెవి కాస్తా పీటమీద ఉండిపోయింది సీసా నీళ్లలో తేలుతోంది అది చూసి ఆలిస్ అందులో ఎక్కి కూచుంది సీసా మెల్లిగా నీళ్లలో తేలి ఎక్కడికో కొట్టుకుపోడం మొదలెట్టింది. ఆపైన ఏం జరిగిందో మళ్లీవారం చూడండి.

"హవ్వ! హవ్వ! అయ్యయ్యో! ఆలస్యమైపోయింది" అంటూ కుందేలు జేబు గడియారం చూసుకుంటూ పరుగెత్తుతోంది





బుల్లి తలుపుతీసి చూస్తే చక్కని పూలతోట కనబడింది ఆలిస్ కి.

* * *

అబ్బా! ఎంత యేడ్చానో! ఎన్ని కన్నీళ్లు, అనుకుంది ఆలిస్ సీసాలో కూచుని. సీసా మెల్లిగా ఎక్కడికో తేలిపోడం మొదలెట్టింది.



# హకల్ బెరీ ఫిన్

## మార్క్ ట్వేన్

### బొమ్మరిల్లు సీరియల్

కాపలా మనిషి ఉలికిపడి లేచాడు. కాని తన్ను లేపింది ఎవరో చూడగానే స్థిమిత పడ్డాడు.

"ఎవరు నువ్వు? ఎందు కేడుస్తావ్? ఏ మొచ్చింది? చెప్పు—"

నేను—"మా అమ్మ, నాన్న, చెల్లాయి—" అని ఇక మాట్లాడ లేనట్టు వెక్కి వెక్కి ఏడవసాగాను.

"అబ్బబ్బ, ఏడవబోకు. ఏమైంది? చెప్పకుండా ఏడుస్తావేం? కష్టాలు అందరికీ వస్తాయి. మీ అమ్మా వాళ్లకి ఏ మొచ్చిం దిప్పుడు?"

"వాళ్లు—వాళ్లు...నువ్వేనా రేవు కాపలా మనిషివి?"

"అవును నేనే," అన్నాడతడు తృప్తిగా చిరునవ్వు నవ్వుకుంటూ. "నేనే కెప్టెన్ని; యజమాని, డ్రైవరు, కాపలామనిషి, సరంగు, కళాసీ, అన్నీ నేనే. ఒక్కొక్కసారి నేనే పడవని, ప్రయాణీకుణ్ణి, సామానుని కూడా అవుతూంటాను. ఆ ముసలాడు జిమ్ హార్న్‌బాక్ ఉన్నాడే—ఆయన కున్నంత డబ్బు లేదు నాకు. ఉంటేనా...హ్హె...ఇల్లా ఉండే వాణ్ణా? ఆయనకంటే దర్జాగా, జల్సాగా, మంచినీళ్ల మల్లే ఖర్చు పెట్టేవాణ్ణి డబ్బు. అసలు ఏం శాశ్వతం లే డబ్బు. చేతులో ఉన్నంతకాలం ఓ వెలుగు వెలగాలిగాని..."

నేను అడ్డంవచ్చి, "మా అమ్మా నాన్న అపాయంలో చిక్కుకున్నారు," అని మూలిగాను.

"ఎవరూ?"

"మా అమ్మా, నాన్న, చెల్లాయి, మిస్ హూకర్. నువ్వు తెప్ప తీసుకుని దబ్బున వెళ్లకపోతే వాళ్లు మునిగి పోతారు."

"ఎక్కడున్నారు వాళ్లు?"

"నది మధ్యలో పగిలి పోలా పొగ బోటు? దానిమీద."

"ఏ పొగ బోటు? 'వాల్టర్‌స్కాట్', మీ దేనా?"

"అవును."

"అరె. వాళ్లేం చేస్తున్నారు 'వాల్టర్‌స్కాట్' మీద? అసలు దానిమీద కెందుకు వెళ్లారు మీరు?"

"మేము వెళ్లాలని వెళ్ల లేదు. మిస్ హూకర్ అనే ఆవిడ ఒక నీగ్రోదాసిని వెంట బెట్టుకుని పడవలో ఊవూరు వస్తోందిట. దోవలో వర్షం మూలంగా వాళ్ల పడవ తలకిందు లైంది. నీగ్రోదాసి, పడవ నడిపేవాడు మునిగిపోయారు. మిస్ హూకర్ మాత్రం ఒక కొయ్యను పట్టుకుని వాల్టర్ స్కాట్‌లోకి ఎక్కిందిట. ఇంకో గంట తరవాత నేనూ, మానాన్న, అమ్మ, చెల్లాయి మావూరునుంచి పడవలో బయల్దేరి వస్తున్నాము. చీకట్లో కనబడక మాపడవ వాల్టర్ స్కాట్‌కు ఢీకొట్టుకుని మునిగి పోయింది. కాని ఎల్లాగో తంటాలుపడి అందరం వాల్టర్‌స్కాట్ మీదికి చేరుకున్నాం. తీరాచూస్తే ఆ పొగబోటు ఇంకాసేపట్లో మునిగి పోయేట్టుంది. అప్పుడు మాలోకల్లా నాకొక్కడికే ఈత చేతైనందున, తెగించి ఒడ్డుకి యీదుకు వచ్చాను, ఎవరినన్నా సహాయ మడుగుదామని."

"హారి దేవుడోయ్, బలే చిత్రంగా వుందే పాపం ఎన్ని కష్టాలొచ్చాయి మీకు!"

"మిస్ హూకర్ మేనమామ ఈ వూళ్లోనే వున్నాడట. ఎవ్వరూ సహాయానికి రాకపోతే ఆయన దగ్గిరికి వెళ్లమంది. ఇంతకీ చెప్పు నువ్వు వస్తావా పడవ తీసుకుని?"

"వస్తాను గాని, మాపడవ సరంగు ఎక్కడున్నాడో చూడాలి. అయితే మాకు కేవు యిచ్చేదెవరు? మీనాన్న యిస్తాడా?"

"మిస్ హూకర్ చెప్పిందిగా, వాళ్ల మేనమామ జిమ్ హార్న్‌బాక్ బాగా ధనవంతుడట—

"ఓర్ని, జిమ్ హార్న్‌బాక్ గారు ఆమెకి మేన మామా? చెప్పవేం? అయితే డబ్బుకికి పేచీయే లేదు. అదుగో అక్కడ లైటు కనిపిస్తోందే; అక్కడకిపోయి ఎడమవేపు తిరుగు; ఒక చిన్న దుకాణం కనిపిస్తుంది; అక్కడ ఎవర్నడిగినా హార్న్‌బాక్ గారిల్లు చెబుతారు. పరిగెత్తుకుపో. పోయి మీ మేనకోడలు అపాయంలో వుందని చెప్పు. నేనీలోగా మాసరంగును కేకేసుకొచ్చి పడవ తీసుకుపోతా. ఊ. పరిగెత్తు."

నేను లైటు కనిపించేవేపు పరిగెత్తాను. కాపలా మనిషి ఇంకోవేపు పరిగెత్తాడు. అతడటు తిరగటం చూసి నేను మళ్లీ వెనక్కి వచ్చాను. నాడింగీలో ఎక్కి నది దిగువకు అయిదారు వందల గజాలుపోయి ఆగాను. కాపలా మనిషి, సరంగుతో కలిసి తెప్ప తీసుకుపోతాడో లేదో చూస్తేగాని నాకు మనశ్శాంతి ఉండదు. ఏ సహాయమూ రాకపోతే వాల్టర్‌స్కాట్ లోని ముగ్గురు దొంగలు నిష్కారణంగా నీటి పాలౌతారు. వాళ్ల డింగీని దొంగిలించింది నేనే గనక ఆపాపం నాకు చుట్టుకుంటుంది. నాకు చేతనైనంత వరకూ వాళ్లని రక్షించేందుకు ప్రయత్నించాను. ఆతరవాత వాళ్ల అదృష్టం.

కాని నా ప్రయత్నాలన్నీ భగ్నమైనాయి. ఎంత సేపటికీ కాపలా మనిషి తెప్ప బయల్దేర లేదు. ఈలోగా పొగబోటు కొండరాళ్ల పట్టు తప్పించుకుని, సగం మునిగి సగం తేలుతూ నది దిగువకు కొట్టుకు వస్తోంది. అది దగ్గరకు రాగానే దానిచుట్టూ డింగీలో తిరిగాను. మనుషుల అలికిడి ఎక్కడా లేదు. నెమ్మదిగా కేకలువేసి పిలిచాను. ఊహు. ఎవరికూడా లేదు.

దొంగలు ముగ్గురూ నదీ దేవతకు బలిఅయిపోయి ఉంటారు. చాలా విచారించాను వారి దుర్మరణానికి.

ఇంతలో రేవులోనుంచి తెప్ప బయలు దేరింది. నేను ఇక అక్కడ ఆలసించటం అనవసర మనుకుని ఒక నిట్టూర్పు విడిచి ముందుకు సాగిపోయాను. చాల దూరం-అంటే ఏ రెండు మూడు మైళ్లో పోతేగాని జిమ్ వెలిగించిన లైటు కంటికి ఆనలేదు. జిమ్‌నూ, మా పడవను కలుసుకునే టప్పటికి తూర్పున ఆకాశం కొద్దిగా తెల్లబడింది. జిమ్ దిట్టంగా నిద్ర పోతున్నాడు నోరు తెరుచుకుని. వాణ్ణి లేపి జరిగిందంతా క్లుప్తంగా చెప్పేసరికి బాగా తెల్లవారే సూచనలు కనబడ్డాయి. అప్పటికొక చిన్న లంకచేరాము. అక్కడదిగి మా పడవనుదాచి, డింగీని నీళ్లలో ముంచి వేశాము. తరవాత లంకలోపలికిపోయి చెట్లకింద పడుకుని శవాలమల్లే ఒళ్లెరగని నిద్రపోయాము.

## 14

వేము లేచే టప్పటికి బారెడు పొద్దెక్కింది.

పడవ దగ్గిరికిపోయి రాత్రి దొంగలు వాల్టర్ స్కాట్‌లోంచి దొంగిలించి మూటకట్టిపడేసిన సామాన్లు విప్పి చూశాము. ఒక్కసారిగా కళ్లు జిగేల్ మన్నాయి; ఒళ్లు ఝల్లుమంది. మంచి మంచి బూట్లు, కొత్త దుప్పట్లు, బట్టలు, బోలెడు పుస్తకాలు, ఒక టెలిస్కోపు, మూడు పెట్టెలనిండా ఖరీదైన చుట్టలు ఉన్నాయి. సంతోషంతో చంకలు కొట్టుకున్నాము. ఇంత ఆస్తిని న్యాయంగా సంపాదించగలిగి నందుకు చాలా గర్వపడ్డాము. అందులో చుట్టలు మాత్రం మహా మజాగా వున్నాయి. ఆ మధ్యాహ్న మంతా చెట్లకింద చుట్టలు కాలుస్తూ, కబుర్లు చెప్పుకుంటూ ఖులాసాగా గడిపాము. నేను కొంతసేపు పుస్తకాలు చదివాను.

ఆ పుస్తకాల నిండా రాజులు రాణులు, మంత్రులు వాళ్ల కథలున్నాయి. జిమ్‌కు కొన్ని కథలు చెప్పాను. రాజులు వాళ్లు ఎలా జీవిస్తారో, ఏం తిండి తింటారో, ఏం బట్టలు కట్టుకుంటారో చెప్పాను. వాళ్లు ఒకరినొకరు "మహాప్రభూ!" "ఏలినవారు" "దేవర" మొదలైన డాబుసరి మాటలతో పిలుచుకుంటారనీ చెప్పాను. జిమ్‌గాడు నోరావలించుకుని, కళ్లు పెద్దవి చేసి అతి కుతూహలంతో విన్నాడు.

"అంతమంది రాజులుంటా రండీ హక్‌గారూ! నేనెప్పుడూ వినలేదే. సాలమన్ రాజునిగూర్చి తప్ప ఇంకెవర్నీ వినలేదండి. అయితే ఒక్కొక్క రాజుకెంత డబ్బొస్తుందండి?"

"ఎంత రావట మేమిటి జిమ్? వాళ్లకొక రివ్వక్కర్లా. డబ్బంతా వాళ్లదే. కావాలంటే నెలకి వెయ్యిడాలర్లు, రెండువేల డాలర్లు కూడా వాళ్లకొస్తుంది."

"ఆహాహా. బలే బలే. ఎంత దర్జాగా వుంటుందో రాజులికి. అయితే వాళ్లేం పని చేయాలి?"

"ఏమీ చెయ్యక్కర్లా, ఊరికే కూర్చుంటారు"

"అంతే నాండి?"

"అంతే. ఊరికే కూచ్చుంటారు. యుద్ధాలొచ్చినప్పుడు మాత్రం నుంచుంటారనుకుంటా. యుద్ధాలు లేనప్పుడు సోమరిగా, మత్తుగా, రాజ భవనాల వెనక తోటల్లో పచ్చిక మీద పడుకుంటారు—ష్ ష్— ఏమిటా చప్పుడు? నీకేమన్నా వినిపించిందా జిమ్?"

నీటి ఒడ్డుకుపోయి చూశాము. పెద్ద పొగబోటు నది మధ్యగా పోతోంది. అంతకంటే ఏమీ లేదు మళ్లీ వెనక్కొచ్చి నడుం వాల్చాము. నేను మొదలెట్టాను:

"వూరికే పడుకోటం విసుగనిపించినప్పుడు ఈ రాజులు పార్లమెంటు అంటూ వొకటిపెట్టి దాంట్లో కాసేపు కూచ్చుంటారు. పార్లమెంటులో రాజు చెప్పిన మాట ఎవడన్నా వినకపోతే వాడి మెడకాయ మీద తలకాయ తెల్లవారే సరికి మాయ మవుతుంది."

"అయ్యబాబోయ్, నిజంగా?"

"ఏమి టనుకున్నావ్ మరి? కాని నేను చదివిన పుస్తకాల్లో ఏమని వుందంటే రాజులు ఇరవైనాలుగు గంటలూ అంతఃపురాల్లోనే గడుపుతారట."

"ఎక్కడా?"

"అంతః పురాల్లో."

"అంటే?"

"అంతఃపుర మంటే రాజుగారి పెళ్లాలు ఉండే చోటు. ఆమాట ఎప్పుడూ వినలేదూ? సాలమన్ రాజుకుకూడా అంతఃపురం వుండేది. అందులో పది లక్షలమంది పెళ్లాలు ఉండే వాళ్లు."

"అబ్బా, పదిలక్షలమందే? అందరినేం చేసుకునే

వాడో? ఒక్క పెళ్లాం చేసే గోలనే మామూలుగా ఓర్చుకోలేరు గదా, సాలమన్ అన్ని లక్షల మందితో ఎల్లా వేగేవాడు? అస్తమానం కాకుల్లా పోట్లాడు కుంటూ వుంటారు గదా ఆడాళ్లు, ఆగోల ఎల్లా భరించేవాడు? పైగాట, సాలమన్ గొప్ప తెలివైన వాడంటారు. తెలివైన వాడైతే ఏదో కొట్టు పెట్టుకుని వ్యాపారం చేసుకోవాలి; విసుగుపుడితే కొట్టు మూసు కుని పడుకోవాలి. అంతేగాని అంత మంది పెళ్లా ల్నేసుకుని..."

"నీకేం తెలియదు జిమ్! అమ్మగారు నాకు చాలసార్లు చెప్పింది సాలమన్ రాజుకథలు. నిజంగా ఆయన తెలివైనవాడు.

"అమ్మగారు గిమ్మగారు చెబితే నేను నమ్ముతా ననుకున్నా రేమిటి? సాలమన్ ఒట్టి పిచ్చా డని నానమ్మకం. ఆకథ మీకు తెలుసా? ఎవరో పిల్లాణ్ణి రెండు ముక్కలకింద నరుకుతా నన్నాట్ట."

"తెలియ కేం. అమ్మగారు చెప్పింది ఆకథ కూడా."

"మరి తెలుసుండి అట్లా మాట్లాడతా రే మండీ? అంతకంటె పిచ్చిపని ఇంకేమన్నా ఉందీ? అసలు కాసేపు నిదానంగా ఆలోచించండి. అదుగో ఆ చెట్టువుందే, అది ఒక ఆడమనిషి అనుకోండి. ఇక్కడ మీరున్నారు, మీరు రెండో ఆడమనిషి అనుకోండి. నేను సాలమన్ ననుకోండి. ఇదిగో ఈడాలర్ నోటు చంటిబిడ్డ అనుకోండి. మీ ఇద్దరూ ఈడాలర్ నోటు నాదంటే నాదని దెబ్బలాడుతున్నారు. తెలివైన వాడైతే ఏం చేస్తాడు? మీ ఇరుగు పొరుగు వాళ్లందర్నీ జాగ్రత్తగా విచా రించి డాలర్ నోటు నిజంగా ఎవరిదో కనిపెట్టటానికి ఎన్ని రోజులైనా సరే ప్రయత్నిస్తాడు. అంతేగాని, డాలర్ నోటు రెండు ముక్కలుచేసి ఒక ముక్క మీకు, ఒకముక్క ఆవిడకీ ఇచ్చుకుంటారా ఎక్క డన్నా? డాలర్ నోటును రెండు ముక్కలు చేసిం తరవాత అదెందుకన్నా పనికొస్తుందా? ఏమాత్రం తెలివిగల వాడైనా ఆపని చేస్తాడా? ఈ సాలమన్ రాజు ఏం చేశాడు? ఆచంటి బిడ్డని రెండు ముక్కలుచేసి చెరోముక్కా ఇస్తానన్నాడు. పూర్తి బిడ్డఅయితే ఏమన్నా ఉపయోగం గాని సగం బిడ్డని ఏం చేసు కుంటాము?"

"అసలు విషయం నీకర్థం కాలేదు జిమ్! నీది ఒట్టి మట్టిబుర్ర."

"ఎవరిది, నాదా? నాది మట్టిబుర్రా? సాలమన్ గాడిది బంగారపు బుర్రేం? ఇదిగో నాదగ్గిర ఇల్లాం టివి చెప్పకండి. నేను చెట్టునుచూసి చెట్టను కుంటాను గాని, కొండ అనుకోను. చెట్టంటే చెట్టే; కొండంటే కొండే. ఇదేమి టండీ, సాలమన్ తెలివైనవాడంటారు? అసలు తగాదా దేనిమీద వచ్చింది? పూర్తి బిడ్డ కోసం; సగం బిడ్డంకోసం కాదు. అంతవరకూ ఒప్పు కుంటారా? పూర్తి బిడ్డకోసం వచ్చిన తగాదాను పూర్తి బిడ్డతోనే తీర్చాలిగాని, సగం బిడ్డతో తీరుస్తానంటే తీరుతుందా? ఇంకా సగం మిగిలిపోదూ? ఇదిగో హక్ గారూ! మీరు చదువుకున్న వాళ్లయితే కావచ్చుగాని, నాదగ్గిర చెప్పకండి ఆసాలమన్ తెలివి తేటలుగూర్చి."

"అబ్బే. నీకసలేం తెలియదుపో."

"అసలేమి టండీ అసలూ, పిసలూను. నాకు చదువురాదు గదా, బోల్తా కొట్టిద్దామను కున్నా

రేమో. హ్మై. నాకు తెలిసిందేదో నాకు తెలుసు. అంతమాత్రం తెలివి లేదనుకున్నా రేమిటి? నేను చెబుతా వినండి ఆ అసలు విషయం. ఆసాలమన్ ఉన్నాడే—వాడు ఆమాదిరిగా ఎందుకు రెండు ముక్కలుగా నరుకుతా నన్నాడో తెలుసా? ఒక మనిషికి ఇద్దరే పిల్లలున్నా రనుకోండి. ఆమనిషి తన ఇద్దరు పిల్లల్ని ఎంతో జాగ్రత్తగా, ప్రాణంతో సమానంగా చూసుకుంటాడు; వాళ్ళని ఊరికే బజార్లో పారేసుకోడు. ఏం, ఒప్పుకుంటారా? ఇంకో మనిషికి యాభైలక్షల మంది పిల్లలున్నారను కోండి. వాళ్లెప్పుడూ నానాగోలగా ఇల్లంతా పుచ్చలు, చీమిడ్లు ఇంకా సర్వ ఛండాలంగా తయారుచేస్తూ వుంటారు. ఎంత శాంతంగల మనిషికైనా వాళ్ల గోలచూస్తే చిర్రెత్తుకొస్తుంది. ఒకణ్ణో ఇద్దర్నో సర్రుమని నరికేస్తాడు. నరికేసినా తప్పు లేదంటాను. ఎందుకంటే ఇంకా కొన్ని లక్షలమంది పిల్లలుంటారు గనుక. ఒకళ్లిద్దరు తగ్గినంత మాత్రాన లాభమే గాని నష్టంలేదు. అందుకే సాలమన్‌కు పిల్లలంటే లక్ష్యం లేదు. ఆయన పదిలక్షల మంది పెళ్లాలికి కనీసం యాభైలక్షల మందన్నా పిల్లలుంటారు. ఆయనకి పిల్లల విలువేం తెలుస్తుంది ఇంక?"

జిమ్ వాదన విని నోరు మూసుకున్నాను. ఇంత మట్టిబుర్ర నీగ్రో నెక్కడా చూడలేదు. వాడికి సాలమన్ మీద ఎందు కొచ్చిందో కోపంవచ్చింది. ఇక అంతే. ఎన్ని చెప్పినా ఆ అభిప్రాయం మార్చుకోడు. అందుచేత సాలమన్‌ని వదిలిపెట్టి ఇతర రాజుల్ని గూర్చి చెప్పాను. ఫ్రాన్సు దేశానికి పదహారో లూయీ అనే రాజుండే వాడనీ, ఆయనమీద ప్రజలంతా తిరగబడి తల నరికేశారనీ, ఆయనకి డాఫిన్ అనే కొడుకుండే వాడనీ, అతడు రాజవుతాడేమోనని జైల్లో పెట్టారనీ చెప్పాను.

"పాపం," అన్నాడు జిమ్. "ఇంకా బతికున్నాడా ఆ అబ్బాయి?" అని అడిగాడు.

"కొందరు చచ్చి పోయాడనీ, కొందరు జైల్లోంచి పారిపోయి అమెరికా వచ్చాడనీ అంటారు. ఏది నిజమో తెలియదు."

"పోన్లెండి. ఎక్కడో అక్కడ బతికుంటే చాలు. మన అమెరికాలో రాజులెవ్వరూ లేరను కుంటా నండి హక్‌గారూ!"

"లేరు.

"పాపం ఆడాఫిన్‌కి ఉద్యోగ మెవరిస్తారు మరి?"

"ఏమోగాని, ఫ్రాన్సునుంచి చాలా మంది ఫ్రెంచి సామంతులు, గొప్ప గొప్ప ప్రభువులు వాళ్లు పారిపోయి వచ్చారు మనదేశం. వాళ్ళలో కొందరు పోలీసు ఉద్యోగాలు చేస్తారు. కొందరు మనవాళ్లకి ఫ్రెంచిభాష నేర్పి జీతాలు పుచ్చుకొని బతుకుతారు."

"తెలియక అడుగుతాను హక్‌గారూ! ఫ్రెంచి మనుషులు మనలాగా మాట్లాడరా?"

"ఉహు. వాళ్లభాష వేరు. వాళ్లమాట ఒక్కటి అర్థంకాదు మనకి; ఒక్కమాటకూడా తెలియదు."

"ఎందుచేత నంటారు? బలే విచిత్రంగా ఉందే."

"ఎందుచేతో నాకూ తెలియదు కాని అర్థం కాదన్నమాట నిజమే. నేను ఒక ఫ్రెంచి పుస్తకం లోంచి కొన్నిమాటలు నేర్చుకున్నాను. ఎవడన్నా నీ దగ్గిరికివచ్చి "పోలీ—వూ—ఫ్రాంజీ" అంటే నువ్వేమంటావు?"

"ఏమంటానా? కర్ర తీసుకుని బుర్ర బద్దలు కొడతాను—తెల్లవాడు కాకపోతే నేను మండీ. సాటి నిగ్రోవచ్చి అంత మాటంటే ఉరుకుంటా ననుకున్నారా?"

"అదికాదు జిమ్! అది తిట్టుకాదు. ఆమాట కర్థం 'నీకు ఫ్రెంచి భాషవచ్చా' అని."

"అయితే ఆమాట అనక ఇంకోమాట అంటం ఎందుకూ?"

"ఆమాటే అనేది ఫ్రెంచి వాళ్లు తమ భాషలో. 'పోలీ—వూ—ఫ్రాంజీ' అంటే 'నీకు ఫ్రెంచి భాష వచ్చా' అని అర్థం."

"మళ్లీ అదే మాటంటారు? 'నీకు ఫ్రెంచి భాషవచ్చా' అని శుభ్రంగా అడిగితే నేను శుభ్రంగా జవాబు ఇవ్వనూ? ఆమాటడక్కుండా ఇంకేదో అంటా రేమిటి?"

"నిజంగా నీదిమట్టి బుర్రే జిమ్! ఇదిగో చూడు. పిల్లి మనలాగా మాట్లాడు తుందా?"

"ఉహు. మాట్లాడదు"

"ఆవు మాట్లాడు తుందా?"

(48-వ పేజీ చూడండి)

# ★ సైన్సు వింతలు ★

★జెట్ విమానాలను డ్రైవరు అక్కర్లేకుండానే నడిపే ఉపాయాన్ని అమెరికాలో కనిపెట్టారు. విమానం గాలిలోకి లేవటానికీ, నేలకు దిగటానికి తప్ప ఇంక దేనికీ మనిషి అక్కర్లేదట. విమానం దానంతట అదే పెట్రోలు పోసుకోవటం దగ్గిర్నించి దోవ కనుక్కుని ముందుకు పోవటం, వేగం హెచ్చించటం, తగ్గించటం మొదలైన అన్ని పనులూ తనే చేసుకుంటుం దట. విమాన యుద్ధం చేసేటప్పుడు లోపల కూర్చున్న మనిషి విమానాన్ని గూర్చి శ్రద్ధ తీసుకో నక్కర్లేకుండా శత్రువుతో యుద్ధం చెయ్యటానికే దృష్టినంతా కేంద్రీకరిస్తాడు.

★కృత్రిమంగా వానలు కురిపించటానికి కలకత్తా దగ్గిర్లో కొన్ని ప్రయోగాలు చేస్తారట. కొన్ని రకాల మబ్బుల్లోకి బెలూన్లు తీసుకుపోయి ఆ బెలూన్లలో నించి బొగ్గుపులుసు వాయువు లాంటి వేరే పదార్థాలు వదిలిపెడతారట. వాటివల్ల ఆమబ్బులు వానకురిసే మబ్బులుగా మారతాయట. అప్పుడు వాన కురుస్తుందట. ఈమాదిరి ప్రయోగాలు చేసి ఇప్పుడు అమెరికా, ఆస్ట్రేలియా మొదలైన దేశాల్లో పొలాల మీద వానలు కురిపిస్తున్నారు. మన దేశంలోకూడా ఈపద్ధతి మొదలు పెడితే, పాపం ఏళ్లతరబడి వానలు లేక, పంటలులేక, కరువులతో కడుపులుమాడే రాయలసీమ జిల్లాల ప్రజలకెంత హాయి!

★అతి ఉష్ణంగా ఉండే శుక్రగ్రహం, బృహస్పతి గ్రహం, శని గ్రహం, యురేనస్, నెప్ట్యూన్ అనే రెండు చిల్లర గ్రహాలమీద వృక్షజాతులు జీవించటానికి వీలుందని ఒక రష్యన్ శాస్త్రజ్ఞుడు ఈమధ్య ప్రకటించాడు. చల్లగా ఉండే కుజగ్రహం (మార్స్) మీద నీలపు రంగు మొక్కలున్నాయని ఆశాస్త్రజ్ఞుడు ఇదివరకే ఒక సిద్ధాంతం చేశాడు. ఈయన సోవియెట్ దేశంలోని కజక్ రాష్ట్రంలో ఒక పరిశోధనాలయం పెట్టుకుని ఆకాశ వృక్ష శాస్త్రంలో పరిశోధనలు చేస్తూ వుంటాడు. ఈయన రకరకాల శీతోష్ణస్థితులలో మొక్కలు ఎలా బతుకుతాయో, శీతోష్ణస్థితికి అనుకూలంగా ఎల్లా మారుతూ వుంటాయో ప్రయోగాలు చేసి చూసి వేడి గ్రహాల్లో కూడా మొక్కలు బతకగలవని ఒక సిద్ధాంతం లేవదీశాడు.

★యంత్రపు గుండె కాయను అమర్చి అమెరికాలో ఒక మనిషిని గంటా ఇరవై నిమిషాలసేపు బతికించారు. అసలు గుండెకాయ చెడిపోయినందువల్ల గుండె కుడివైపున కోసి యంత్రపు గుండెను పెట్టారట. యంత్రపు గుండె పని ప్రారంభించిన తరవాత అసలు గుండెలో ఎక్కడ లోపం వచ్చిందో డాక్టర్లు వెదకసాగారు. లోపం కనిపించింది గాని దాన్ని సరి చేయటానికి వీల్లేక పోయిందట. అందుచేత యంత్రపు గుండెను లాగివేశారు. తరవాత అసలు గుండె రెండు గంటలసేపు పని చేసిందిట గాని తరవాత ఆగిపోయిందిట. ముందు ముందు ఈ పద్ధతిని ఇంకా అభివృద్ధిచేసి గుండె జబ్బులను నయం చేయటానికి ఉపయోగిస్తారట. ★

# రాధ

మావూళ్లో చిట్టమ్మ గారంటే తెలీని వారుండరు. మా ఊరుకి ఏవ్వారి నింపైనా, ఏదైన విషయం తెలిసిందంటే అది ముందు చిట్టమ్మగారికి తెలియ వలసిందే. తనకు తెలియగానే ఊరంతా డప్పు మోగిస్తుందా చిట్టమ్మగారు. అందుకనే ఆంధ్ర ప్రభ అనీ, ఆంధ్ర పత్రిక అని బిరుదులు వహించింది. చిట్టమ్మగారికి భర్త చిన్ననాడే గతించాడు. ఒక్క కొడుకు. పేరు కోటిలింగం. చచ్చినపామును చావగొట్టే వీరధీరశూర సేనుడు లెండి. చిట్టమ్మగారు పది యకరాల మాగాని, ఒక పెద్ద స్వంతయిల్లు, పాడి పంటలుబాగా కలిగియున్నది ఆమె తిన తిండికీ, ఖర్చులకూ పోగా మిగతా రాబడి ఇనప్పెట్టెలో జేర్చేది. కొడుక్కి యిరవై ఏళ్లు వచ్చినా వ్యవసాయం అంతా తన చేతిమీదుగానే చేయిస్తూంటుంది.

మావూళ్లో పేరు మోగిన దొంగలు చాలమంది ఉన్నారు. అందుకనే ఈ గ్రామంలో ఇంటికి కన్నం పడని ఒక్కయిల్లులేదు చిట్టమ్మగారి యిల్లు తప్ప. ఎందుకంటే ఆవిడ పిల్లి అడుగుల చప్పుడుకే నిద్ర మేలుకొనేది. అంటే అంత ఎక్కువ మెలకువ అన్నమాట. ఇంకా వాళ్లింటిలో దొంగలు పడలేదంటే ఆశ్చర్య పడడం దేనికి?

ఇలా ఉంటూండగా ఓనాడు చిట్టమ్మగారు పదిగంటలప్పుడు తన యింట్లో చిన్న అలికిడి అవటం వింది. వీధి తలుపులు, దొడ్డి తలుపులు వేసినవి వేసినట్టున్నాయి. కొడుకు గురక పెట్టి నిద్రపోతున్నాడు. మరి ఎట్లా అయిందీ శబ్దం. కొంచెమాగి మళ్లా అలికిడి అయింది. చిట్టమ్మగారి గుండెల్లో రైళ్లు పరుగెత్తాయి.

'దొంగల్రోయి...దొంగల్రోయి...అని అరిచేసింది. ఏమిటే అమ్మా అంటూ తల్లిని వాటేసుకున్నాడు కోటిలింగం. ప్రక్కింటి బ్రహ్మయ్యగారు లేచి...... ఏమిటమ్మా! చిట్టమ్మా అన్నారు. చిట్టమ్మగారు వీధితలుపు తెరిచింది. కాని ఆమెకు దొంగల్రోయి అనేమాట తప్పితే యింకో మాట తలకెక్కటం లేదు.

బ్రహ్మయ్య...ఏమిటి; దొంగలే! ఒరే! రంగన్నా! లేవరా! మొద్దు నిద్దా నువ్వూనూ. ఆసైకిలు తీసుకొని పొన్నూరుపోయి పోలీసులని పిల్చుకురారా. (మావూళ్లో పోలీసు స్టేషను లేదు లెండి)

రంగ: పోతున్నానండీ.

బ్రహ్మ: దొంగల్రోయి ... అందరూ లేవండర్రోయి

ఈ అరుపులతో ప్రక్కింటివారు నలుగురైదుగురు చేరారు.

బ్రహ్మ: లక్షినారాయణ గారూ! మీ జీతగాండ్లున్నారాండీ.

లక్ష్మి: లేరండీ బ్రహ్మయ్య గారూ. ఒరేయి రాధాయి పాలెం పోయి జీతకాళ్లని లేపుకు రారా.

రాధా: పోతున్నా.

బ్రహ్మ: ఏమండీ సుబ్రహ్మణ్యం గారూ. మరీ విపరీతం కాకపోతే పది గంటలకే దొంగతనా లేమిటండీ. మన ఊరు వారందరు ఒట్టి దద్దమ్మలండీ. నే నొక్కడ్ని దొంగను పట్టగలనుగాని లోపల చాలమంది ఉన్నారేమో నని భయపడుతున్నా. చాలా మంది

ఉన్నా వెనుదీయననుకోండి.

గదిలో మళ్లా అలికిడి అయింది.

బ్రహ్మ: చచ్చాం రా బాబూ దొంగ తలుపు తెరుచుకుని మన మీద కొచ్చేటట్టున్నాడే!

సుబ్ర ... ఇప్పుడే గదూ నాకు ధైర్యం చెప్పారు బ్రహ్మయ్యగారూ." బ్రహ్మయ్యగారు సుబ్రహ్మణ్యం వెనక జేరి..."ఊరికే నటిస్తున్నాను. అలా అంటేఅన్నా దొంగబయట పడతాడేమోనని." అన్నాడు దొంగ తన మాటలు విన్నాడేమోనని బిక్కు-బిక్కు మంటూనే. పొరుగిళ్ల రాఘవయ్య, వెంకయ్య, చెంచయ్య మొదలగు వారంతా ఈ గుంపుని కలుసుకున్నారు.

రాఘు...చుట్టూ జనం కావలా కాయండి. గడిగొళ్లెం పెట్టండి. ఇంతలోనే పోలీసులు వస్తారు.

బ్రహ్మ: ఒకేరాజాయి. తలుపు గొళ్లెం పెట్టరా.

వాడట్లా చేశాడు భయపడుతూనే. వెంకయ్య-అందరూ అలా భయపడుతూ కూర్చుంటే ఎలా! కర్రలు తెచ్చుకోండి.

మూగిన జనమంతా వెళ్ళిపోబోయారు. బ్రహ్మ: ఇక్కడ కొంత మంది ఉండండి. దొంగ పారిపోతాడేమో! కొందరు పోయి కర్రలు తీసుకురండి తస్సాదియ్య పీడిని నుసిచేద్దాం.



కొందరు పోయి కర్రలు తీసుకొచ్చారు. చెంచయ్య - అందఱూ కర్రలు తెచ్చుకున్నారుగా ఇక తలుపు తియ్యండి! బ్రహ్మ: ఉండవయ్యా! పోలీసులు రానీ!

ఇంతలో నలుగురి జీతగాళ్లను వెంట బెట్టుకొని రాధాయి వస్తాడు.

జీత...ఏందండీ! దొంగ లంటే యింత భయపడతారు. వాళ్లని చితకతన్నాం చూడండి!

బ్రహ్మ:అదేనే నంటూంటే వీరెవరూ సాహసించటల్లేదురా ! అయినా ఉందురూ. పోలీసు లొచ్చేదాకా. ఇంతలో ఏం ముంచుకు పోయిందీ.

చెంచ : అరుగో పోలీసులు. కానీండిరా మీ పనిని మీరు అన్నాడు జీత గాళ్ల వేపు తిరిగి. బ్రహ్మ : ఒకేయి. జాగ్రత్తరోయి. కర్రలు తీసుకోండిరా! జీత: ఏం ఫర్వా లేదండి కర్ణంగోరూ! అంత భయం చెందుతే ఎలా బాబయ్యా!

జీతగాళ్లు తలుపుతీసి లోపలకు తొంగి చూచారు. జీత : ఎవ్వరూ లేరండీ !

బ్రహ్మ: లేక పోవట మేమిటి. మేము కర్రలు తీసికొని రడీగా ఉంటాంగాని మీరులోపలకి పొండి.

వాళ్లట్లా చేయగా లోపల్నుంచి కర్ణంగారి పెద్ద కుక్క తోకాడిస్తూ బయటి కొస్తుంది. చిట్టమ్మ: హారి బ్రహ్మదేవుడా! ఎంతపని చేశావురా! వెధవకుక్క ఎంత రాద్ధాంతం చేసింది. తూ, తూ, తూ అనుకుంటూ విశ్రమించింది–★

# ★ అందమైన బొమ్మరిళ్లు అజంతా గుహలలో గిళ్లు ★

మన దేశం ప్రాచీన కాలంనుంచీ కళలకు ప్రసిద్ధి కెక్కింది. సంగీతం, సాహిత్యం, చిత్రకళ, శిల్పం, నృత్యం అన్నీ ఒకానొకప్పుడు మహోన్నత స్థితిలో ఉండేవి. మన దేశపు చిత్రకళ అనగానే అందరికీ అజంతా జ్ఞాపకం వస్తుంది. ఈ నాటికీ మన చిత్రకారుల్లో కొందరు 'అజంతా' పేరు చెప్పగానే ఆనందంతో తన్మయులై మూర్ఛపోయినంత పని చేస్తారు. యూరప్ దేశాలవారు కూడా కొందరు అజంతాకు సాటివచ్చే చిత్రకళ ప్రపంచంలో లేదని అంటారు. ఈ అజంతా ఏమిటో, దాని కెందువల్ల ప్రాముఖ్యం వచ్చిందో చెబుతా విను.



హైదరాబాదు సంస్థానంలో వాయవ్యమూల ఔరంగాబాద్ జిల్లాలో అజంతా గుహాలున్నాయి. ఔరంగాబాద్ స్టేషనులో దిగి యాభై అయిదు మైళ్లు ఉత్తరానికి పోతే అజంతా గుహాలు వస్తాయి. ఈగుహాల్లో గోడలమీద బౌద్ధ మతానికి చెందిన బొమ్మలున్నాయి. ఈబొమ్మలు వేసి ఏ రెండువేల ఏళ్లో అయి వుంటుందట. బుద్ధుడు క్రీస్తు పూర్వం ఆరో శతాబ్దంలో పుట్టాడు. తరవాత మూడువందల ఏళ్లకు అశోకుడు భారతదేశమంతటినీ జయించి రాజ్యం చేశాడు. అశోకుడి తరవాత హర్షవర్ధనుడనే రాజు కాలంవరకూ అంటే క్రీస్తు తరవాత ఏడో శతాబ్దంవరకూ బౌద్ధమతం మన దేశంలో బాగా వ్యాపించి గొప్పస్థితిలో ఉంది. అశోకుడు, హర్షుడు వీరి మధ్యకాలంలో అజంతా గుహాల చిత్రకళ పుట్టిందట. హిందూ మతస్థులమైన మనకి విష్ణుమూర్తి అవతారాల కథ లెలాగైతే ఉన్నాయో అలాగే బౌద్ధ మతస్థులకి బుద్ధుడి పూర్వ జన్మల్ని గూర్చి బోలెడు కథలున్నాయి. బుద్ధుడు బుద్ధావతారం ఎత్తటానికి పూర్వం అనేక వేల జన్మల్లో బోధిసత్త్వుడుగా పుట్టాడని బౌద్ధులు నమ్ముతారు. ఆ జన్మల కథలని జాతకకథలు అంటారు. ఈ జాతకకథలనే అజంతాగుహాల గోడలమీద బొమ్మలుగా చిత్రించారు. ఈ బొమ్మలు వేసినవారు బౌద్ధసన్యాసులట. సన్యాసులైనా కాకపోయినా వాళ్లు మాత్రం బౌద్ధమతంమీద ఎంతో భక్తి, నమ్మకం గల గొప్ప చిత్రకారులై వుండి వుంటారు.

అజంతాగుహాల్ని కొండలు దొలిచి చక్కటి మందిరాల మాదిరిగా తయారు చేశారు. ఆ మందిరాల్ని నివసించటానికి కూడా వీలుగా చేశారు. సన్యాసులు కూర్చోటానికి, పడుకోటానికి, ధ్యానం చేసుకోటానికి, తీరికసమయాలలో బొమ్మలు వెయ్యటానికి ద్వారబంధాలమీద, స్తంభాల మీద చక్కటి బుద్ధవిగ్రహాలను ఇంకా రకరకాల విగ్రహాలను చెక్కటానికి అన్ని సదుపాయాలూ ఉన్నాయి. దగ్గర్లోనే పుష్కలంగా మంచినీళ్లు దొరుకుతాయి.


అజంతాగుహల ప్రదేశం ప్రకృతి సౌందర్యానికి పెట్టింది పేరు. పడిపోతాయేమో నన్నట్టుండి ఎన్నటికీ పడిపోని పెద్దపెద్ద బండరాళ్లు, రకరకాల చెట్లు, పొదలు, లతలు, వాటి మధ్యనుండి రొద చేసుకుంటూ పారే "వాఘోరా" నది, ఎక్కడ చూసినా చిలకలు, నీలి నీలి పావురాలు, వాటి మధుర సంగీతాలు, గుంపులుగా విహరించే లేళ్లు, తోడేళ్లు, ఎలుగుగొడ్లు, దుమ్ముల గొండ్లు, చెదురుగా పులులు—వీటన్నిటితో ఆ ప్రాంతం అతిలోక సుందరంగా కనిపిస్తుంది. అజంతాలో మొత్తం ఇరవై తొమ్మిది గుహాలున్నాయి. ఈ గుహాలన్నిటిలోనూ పూర్వం బొమ్మలుండేవి. కాని ఎన్నివందలయేళ్ల కిందటో వేయబడిన ఆ బొమ్మల్లో చాలమటుకు నశించి

పోయాయి. పదమూడు గుహాల్లో **మాత్రం** బొమ్మలు మిగిలాయి. ఆబొమ్మలైనా రంగుమాసి, కాళ్లు, చేతులు, ముక్కు చెరిగిపోయి, కనిపిస్తాయి. ఆ మాత్రంతో నే బొమ్మల అసలు ఆకారం రంగులు వూహించుకోవాలి; ఎంత చెరిగిపోయినప్పటికీ ఆ మిగిలిన బొమ్మల్ని చూస్తేనే మన పూర్వ చిత్రకారులు ఎంత గొప్పవాళ్లో అని ఆశ్చర్యం కలుగుతుంది.

ఈ గుహాలు చాల కాలంవరకూ మట్టితోను, రాళ్లతోను కప్పబడి బైటికి కనిపించకుండా ఉండేవిట. అక్కడ అలాంటి గుహా లున్నాయనీ, ఆ గుహాల్లో అద్భుతమైన బౌద్ధ చిత్రా లున్నాయనీ తెలిసిన తరవాతకూడా నిజాంనవాబులు వాటిమీద శ్రద్ధ తీసుకోక పోవటం వల్ల ఒకవంద ఏళ్లపాటు అవి అజ్ఞాతంగానే ఉండిపోయాయి. 1824లో ఒక బ్రిటిషు సేనాధిపతి ఆప్రాంతానికి వెళ్లి గుహాల్ని, బొమ్మల్ని వాటి గొప్పదనాన్ని కనిపెట్టాడు. ఆతరవాత మెల్లిగా ఒకళ్ల తరవాత ఒకళ్లు చిత్రకళ అంటే చెవి కోసుకునే బ్రిటిష్ వాళ్లు ఆప్రాంతాలకు వెళ్లి నిజాం నవాబును ప్రోత్సాహంచేసి గుహాల్ని జాగ్రత్తగా తవ్వించి బైటికి తీయించారు. అప్పటినుంచీ నిజాం ప్రభుత్వం వారుకూడా అజంతాగుహాలను జాగ్రత్తగా సంరక్షిస్తూ వచ్చారు.

అజంతా చిత్రకారులు బొమ్మలు వెయ్యటానికి దీపంమసి, జేగురు దుమ్ము, పసుపు పచ్చదుమ్ము, ఒక రకమైన నీలపురాయిపొడి ఉపయోగించారట. ఈ పదార్థాలన్నీ ఆ చుట్టుపక్కల దొరికేవట. వాటినే తీసుకుని కుంచెలతో బొమ్మలు వేశారు. ఇంత మామూలు రంగులతో వేసినా ఆ బొమ్మలు ఈ నాటికీ చెక్కు

(48-వ పేజీ చూడండి)



అజంతా మొదటిగుహా లోపలి భాగం.




రావుజీ అనే ఒకాయన ఉండే వాడు. ఒకరోజు ఆయన, దర్జీకి ఒక షరాయి తొందరగా కుట్టమని తెల్లబట్ట ఇచ్చాడు. ఆదర్జీ షరాయి పూర్తిచేసి ఆసాయంత్రమే రావుజీగారు లేనందున ఇంట్లో ఇచ్చేసి వెళ్ళిపోయాడు. రాత్రి ఎనిమిది గంటలకి రావుజీగారు ఇంటికి తిరిగి వచ్చారు. షరాయి తొడుగుకొని చూసుకున్నారు. తస్సాదియ్యా, అది రెండంగుళములు పొడవు జాస్తీ అయింది. ఆషరాయి వేసుకొని మరునాడు ప్రొద్దుట ఏడు గంటలకు ఒక ఆఫీసరుగారిని కలుసుకొని మాట్లాడాలి. అందుచేతే వంచె బాగుండదని షరాయి కుట్టించుకున్నాడు. కాని అది, రెండంగుళములు పొడవైకూర్చుంది. ఏలాగు మరి?

భార్యను పిలిచి ఇలా అన్నాడు: "ఒసేవ్ చూశావా. ఈషరాయిని రెండంగుళములు ఎక్కువగా కుట్టి వేశాడు దర్జీ. ఇప్పుడు వాడి దగ్గరికి వెళ్ళడానికి టైంలేదు. రేపు ప్రొద్దున్న యీ షరాయి వేసుకుని ఆఫీసరుతో మాట్లాడుటకు వెళ్లాలి. ఆ షరాయిని రెండంగుళములు కత్తిరించి మళ్ళా కుట్టిపెడుదూ."

అనగానే భార్య ఇలా అంది: "బాగుంది ఇప్పుడే కుట్టాలా? భోజనాలు అయినాక తీరుబడి చూసుకొని కుడ్తాను లెద్దురూ. రేపు ప్రొద్దుటకు కదా కావాలి" అంటూ వంటింట్లోకి వెళ్ళిపోయింది. తన చెల్లెల్ని పిలచి రావుజీగారడిగారు "చెల్లెమ్మా, ఈ షరాయి కొంచెము సరిచేద్దూ. మీ వదినకు పనుందట."

"అలాగేలే అన్నయ్యా, ఇదిగో రొట్టె చేస్తున్నాను. ఈపని అయిపోయిం తలవాత కుడ్తాను" అని తన పనిలో నిమగ్నురాలైంది. రావుజీ తరువాత తను కూతుర్ని పిలిచి "అమ్మాయీ, ఈషరాయి రెండంగుళాలు కత్తిరించేసి కుట్టిపెట్టమ్మా" అన్నాడు. కూతురు "అలాగేనాన్నా. ఇప్పుడు చదువయిపోయిన తరువాత కుడ్తాలే" అని జవాబు చెప్పింది. రావుజీ "ముగ్గురికి చెప్పానుకదా ఎవరో ఒకరైనా కుట్టరా" అనుకొని షరాయి టేబిలు మీాద ఉంచేసి భోజనమునకు వెళ్ళిపోయాడు. తరవాత పడక నలంకరించాడు. భోజనాలయిన తరవాత భార్య, షరాయిమాట జ్ఞాపకం చేసుకుంది. షరాయి రెండంగుళములు పొడవు తగ్గించి కుట్టివేసి అక్కడ పడేసి తనూ పడక నలంకరించింది. రావుజీగారి చెల్లమ్మ వంటింట్లో పనులు చేసేసి, అన్నయ్య షరాయి మాట జ్ఞాపకము వచ్చి తనూ రెండంగుళములు కత్తిరించేసి కుట్టేసి తనూ చక్కా పడక నలంకరించింది. ఇంతలో రావుజీగారి కూతురు చదువు ముగించేసి నాన్నగారి షరాయి మాట జ్ఞాపకము చేసుకుంటూ తనూ రెండంగుళములు కత్తిరించేసి కుట్టేసి తనూ పడుకోడానికి వెళ్ళిపోయింది. తెల్లవారుజామున ఆరుగంటలకు రావుజీగారు లేచి కాలకృత్యాలు తీర్చుకొని షరాయి తొడిగారు. ఇంకేముంది? ఆషరాయి ఆరంగుళములు తగ్గిఉంది. ★

## మండుటెడారిలో మధుర స్వప్నం

(11-వ పేజీ తరువాయి)

వంలో ఆమె కేవలం ఒక శాంత మూర్తి, దయామయి...

"అనూరాధా!...అనూ..."

అనూరాధ చిన్న చిరునవ్వు నవ్వి, వూరుకొంది......

రెండు రోజులు గడిచాక, ఓ నాటి సాయంత్రం జోగయ్య ఏదో వ్రాసుకుంటూ వుండగా అనూరాధ అతనివద్దకు వచ్చి ఆత్రంగా అడిగింది.

"జోగయ్యా! నీ కథలలోని కథానాయికలను ఎప్పుడూ ఒకేలాగున వర్ణిస్తావేం?"

"స్త్రీ సౌందర్యాన్ని గురించి నా అభిప్రాయం ఎప్పుడూ ఒకేలాగున వుంది. కాబట్టి. అంతేకాదు, నావంటి అనాథకి, బీదవాడికి స్త్రీ సౌందర్యం గురించి ఎక్కువ ఆలోచించడానికిగాని, పరిశీలించి అభినందించడానికి గాని అవకాశం వుండడం కష్టం"

"అంటే—ఆ వదులుగా వేసుకున్న పొడుగాటి జడ, ఆ చీరకట్టు, ఆ అలంకరణ—ఇవే అందం అంటావ్. అంతేనా?"

"నా వుద్దేశంలో అంతే"

అనూరాధ కొంచంసేపు ఏదో ఆలోచించి, "వుండు—ఇప్పుడే వస్తాను" అంది, పక్క గదిలోకి రివ్వున పరుగు తీస్తూ. జోగయ్య ఆశ్చర్యపోయి, ఆమె వెళ్ళిన దిక్కే చూస్తూ, అట్లానే వుండిపోయాడు.

అరగంట గడిచాక, అనూరాధ వచ్చింది. ఆమె బాగా అలంకరించుకొంది. వక్షం మీదికి జారవిడిచిన పొడుగాటి జడ, ఆకాశంరంగు చీర, సిల్కు బ్లౌజు, పౌడరద్దిన ముఖం—ఈ వేషంతో వున్న ఆమెని చూసి, జోగయ్య ఆశ్చర్యపోయాడు! అనూరాధ చిరునవ్వు నవ్వుతూ అంది "నే నిప్పుడు ఎట్లా వున్నాను?"

జోగయ్య మాట్లాడలేదు. నిశ్శబ్దంగా, ఆమె కళ్లలోకి దీర్ఘంగా చూస్తూ అట్లానే వుండిపోయాడు.

జోగయ్యలో ఇన్నాళ్లయీ మాటుమణిగి, త్రుప్పపట్టి, నిద్రాణమైవున్న సౌందర్య పిపాస ఒక్కమారుగా మేల్కొనసాగింది. తన జీవితంలో ఇన్ని సంవత్సరాలుగా తనకి కేవలం ఆకలి, తిండి మాత్రమే ముఖ్య విషయాలుగా కనిపిస్తున్న జోగయ్యకు, తనలో సౌందర్యాన్ని అభినందించే శక్తికూడా వుందని, తెలుసుకోలేకపోయాడు. ప్రతీ జీవికి, తెలిసో తెలియకో, ఈ సౌందర్య పిపాస, ప్రాపంచిక సౌఖ్యాభిలాష, వ్యామోహం, కోరిక, అనేవి పుట్టుకతోనే దేవు డిస్తాడని తను చాలా కాలం కిందట చదివిన సంగతి ఇప్పుడు జ్ఞాపకం వచ్చింది.

"మాట్లాడవేం జోగయ్యా?" అంది ఆమె మళ్లీ.

అనూరాధ జోగయ్యకళ్ళకి ఎంతో చక్కగా కనిపించింది.

"ఎంత చక్కగా వున్నావు నువ్వు!" అన్నాడు జోగయ్య.

"నిజం? నే నందంగా వున్నా నంటావా?"

?నేను నిజం చెప్తున్నాను అనూరాధా! నువ్వు ఎంతో ముద్దొస్తున్నావు. అంతే కాదు. నా కథలలోని కథానాయికలందరికంటె, నీలోనే ఎక్కువ సౌందర్యం వుందని యిప్పుడు తెలుసుకున్నాను-నా కళ్ళకి కన్పించిన నిజం చెప్తున్నాను!"

"ఛీ! ఫో! ఏం వెంకిమాటలు బావా!" అని, చిన్న సిగ్గుతో, తల వంచుకుని, అనూరాధ రివ్వున పరిగత్తి, చీర కుచ్చెళ్లను తన్నుకుంటూ పారిపోయింది.

ఆ ఆఖరుమాట విని జోగయ్య విస్తుపోయాడు! తన మామయ్య కూతురికి తను 'బావ' అవుతాడన్న సంగతి ఇప్పుడు తెలిసిందతనికి......

జోగయ్య జీవితంలో ఇప్పుడు సరికొత్త అధ్యాయం ఒకటి తెరువబడింది. మండుటెడారిలా వున్న తన జీవితంలో చల్లటి సంగీతాన్ని ఇప్పుడిప్పుడే, ఎవరో వినిపిస్తున్నట్లుగా వున్నది...... ప్రపంచంలో యింతవరకూ తను ఎరుగని ఒక విచిత్రమైన అనుభవాన్ని, ఆనందాన్ని, చవిచూస్తున్నాడు. 'నా' అన్నవారెవరూ లేరనుకున్న తనకు, రోజు రోజుకూ అనూరాధ ఆత్మీయురాలవుతున్నదని తెలుసుకున్నాడు ఈ లోకంలో తనను అభిమానంతోను, ప్రేమతోను చూస్తున్న వ్యక్తి బహుశః అనూరాధమాత్రమే... ఆమె మాత్రమే...

ఆనాటి రాత్రి జోగయ్యకి విచిత్రమైన కల వచ్చింది...... అటువంటి స్వప్నం తన కెప్పుడూ రాలేదు. కలలో, తనూ అనూరాధ కలిసి ఎక్కడికో తొందరగా నడిచి వెళ్లిపోతున్నారు. గాఢాంధకారమయమైన అరణ్యాలు, పుట్టలు, దాటుకొని వెళ్ళి, ఒక కొండ చివరకి ఎక్కేరు. చుట్టూ అంధకారం! ముందు తోవ కన్పించలేదు. ఒక్క అడుగు పక్కకివేస్తే ప్రాణాలు పోయేటంత చివరని నించున్నారు. అనూరాధ భయంతో వణికిపోతున్నది. తను ఆమెచుట్టూ చేయివేసి, ఆమె పడిపోకుండా చూస్తున్నాడు. ఇంతలో పెద్దపులి అరుపు ఒకటి భయంకరంగా దగ్గరలో వినిపించింది. అనూరాధ కెవ్వున కేకవేసి, పక్కకి పడిపోయి, ఒక్క వూపున దొర్లిపోయింది. తను 'అనూరాధా' అని గట్టిగా పిలుస్తూ ముందుకు అడుగువేయబోగా, కాలుజారి, ఆ బ్రహ్మాండమైన లోయలోకి—

—కల అంతమైంది. పెద్ద కేక వేసి జోగయ్య మేల్కొన్నాడు.

రోజులు త్వరగా దొర్లిపోతున్నవి. ఇప్పుడు జీవితంలో ఏదో కొత్తదనం కన్పిస్తున్నది జోగయ్యకు. ఈ రోడ్లు, ప్రజలు, వూరు, బజారులు, అన్నీ కొత్తగా కన్పిస్తున్నట్లున్నవి. "నా జీవితంలో కన్పిస్తున్న ఈ కొత్తదనం ఏమిటి? ఈ మార్పు ఏమిటి? నేను ఏమిటి చేస్తున్నాను, చేయబోతాను? నే నెందుకిట్లా అయాను? అసలు నే నేమిటి అయాను? నేను నేనుగానే వున్నానా?..." అని జోగయ్య తర్కించుకున్నాడు. కాని, ఈ ప్రశ్నలలో ఏ ఒక్కదానికీ కూడా, అతనికి జవాబు దొరకలేదు. "జీవితం ఎంత విచిత్రమైనది!" అనుకున్నాడు మళ్ళీ.

కాని—రెండురోజుల తర్వాత పరిస్థితులన్నీ తారుమారయినవి. శేషగిరి ఆనాడు

ఆఫీసుకి వెళ్ళకుండా, యింట్లో కూచుని, రోజల్లా అందరిమీద కేకలువెయ్యడం ప్రారంభించేడు. పక్క గదిలోంచి ఈ అల్లరి అంతా వింటున్న జోగయ్యకు ఈ కేకల అర్థం ఏమిటో తెలియకపోలేదు! ఆ కేకలు, కోపం, అంతా తనమీదే కాని మరెవరిమీదా కాదని తనకు తెలుసు! ఇటు వంటివి ప్రతీ బంధువు ఇంట్లోను తను చవి చూశాడు! ఈ యింటినించి వెళ్లిపోయే సమయం వస్తున్నదని అతడు గ్రహించాడు— కాని, తను ఏమి చేయడం...?

ఆనాటి సాయంత్రం శేషగిరి నూటిగా జోగయ్యతో నే ఆఖరుమాట చెప్పివేశాడు— "జోగయ్యా! ఇంకా నేను నిన్ను పోషించగలననుకోనే మా యింట్లో వున్నావా? నేను కూడా సామాన్య సంసారినే" అని—

మర్నాడు వుదయం జోగయ్య తన సంచీ సర్దుకున్నాడు. కాని ఎక్కడకు పోవడం? "ఎక్కడకు పోవడం భగవంతుడా!" అని వదిమార్లు తన మనస్సులో అనుకున్నాడు. కాని భగవంతుడెప్పుడూ మూగివాడే.

ఆ నాడు మధ్యాహ్నం ఒంటిగంట వరకూ వూరల్లా తిరిగివచ్చాడు జోగయ్య. రెండు మెతుకులు నోట్లో వేసుకునేసరికి రెండు గంటలయింది. ఆ తర్వాత జోగయ్య శేషగిరి గదిలోకి వెళ్ళి అన్నాడు.

"మామయ్యా! ఇవాళ సాయంత్రం నేను వెళ్ళిపోతున్నాను"

"ఏ వూరు?"

"అస్సాం. అక్కడి తేయాకు తోటల్లో కూలీ పని దొరికింది. వాళ్ళ కంట్రాక్టరు ఒకడు వచ్చి మనవూరునించి చాలా మంది కూలీలను తీసుకువెళుతున్నాడు. నా పేరు కూడా యిచ్చాను..."

శేషగిరి మాట్లాడలేదు. ఏదో ఆలోచిస్తూ వున్నాడు. జోగయ్య మళ్ళీ అన్నాడు.

"ఇవాళ సాయంత్రమే 4 గంటలకి ఒక స్పెషలు ట్రెయిను అస్సాం వెళుతుందట. అందులో కూలీలందర్నీ అస్సాము తీసుకవెళతారు... నేనూ ఆ బండికే వెళ్ళాలి..."

ఆ తర్వాత చాలాసేపటి వరకు గదిలో నిశ్శబ్దం రాజ్యం చేసింది. ఆ తర్వాత తంగు తంగుమని మూడు గంటలు వినిపించాయి. జోగయ్య తృళ్ళిపడి అన్నాడు.

"అబ్బ! మూడు గంట లయిపోయింది. నే నింక స్టేషనుకి బయలుదేరాలి."

జోగయ్య తన సంచీ తీసి, చేతికి తగిలించుకున్నాడు. "వస్తాను మామయ్యా!" అంటూ మెల్లిగా వీధివరండావేపు నడిచాడు. "వుత్తరాలు రాస్తూ వుండు" అన్నాడు శేషగిరి, కుర్చీలోంచి లేవకుండానే.

జోగయ్య వరండాలోకి వచ్చి, రెండడుగులు వేసి, ఏదో జ్ఞాపకంవచ్చినవాడిలా టక్కున ఆగిపోయి, పక్క కిటికీవద్దకు వెళ్ళి నించున్నాడు. గదిలో మంచంమీద పడుక్కుని నిద్రపోతున్న అనూరాధ కిటికీలోంచి అతనికి కనిపిస్తున్నది. ఎండవేళలో ఆమెకి నిద్రపోవడం అలవాటు. "అనూ! నేను అస్సాము వెళ్లిపోతున్నాను!" అని ఆమెతో కూడ చెప్పి మరీ, తను వెళ్దామనుకున్నాడు. కాని ఆమె నిద్రపోతున్నది. కిటికీలోంచి ఆమె తనకు కనిపిస్తున్నది— అనూరాధ ఎంత చక్కనిది?

...జోగయ్య అస్సాము వెళ్ళిపోయిన 20 రోజులకి అతనివద్దనుంచి ఒక వుత్తరం శేషగిరికి వచ్చింది. అందులో, ఆఖరున "చి" అనూరాధని మరీ మరీ అడిగేనని చెప్పు, మామయ్యా" అని జోగయ్య రాశాడు. కాని, శేషగిరి ఆ వుత్తరాన్ని పూర్తిగా చదవనేలేదు.

మళ్ళీ ఏడాదివరకూ జోగయ్య భోగట్టా తెలియనేలేదు. రెండేళ్లు కూడా గడిచిపోయినవి. జోగయ్య వూసే మరిచిపోయాడు శేషగిరి. ఈలోగా అనూరాధ పెళ్ళి కూడా జరిగిపోయింది...

కాల చక్రం తిరుగుతూనే వున్నది.

ఓరోజు శేషగిరికి అస్సాము నుండి ఏదో వుత్తరం వచ్చింది. అది తేయాకు తోటల అధికారులు రాసిన వుత్తరం. అందులో జోగయ్య అనే కూలీ 'టైపాయిడు' జ్వరం వచ్చి చచ్చిపోయాడనీ, అతని కియ్యవలసిన జీతం బాకీలు అతని దహన సంస్కారణ కింద ఖర్చు చేయబడ్డవనీ, అతని మరణానికి తమ సానుభూతి తెలియ జేస్తున్నామనీ రాసి వున్నది.

శేషగిరిముఖంలో సంతోషమూ లేదు, విచారమూ లేదు. "అరే! జోగయ్య చచ్చిపోయాడా పాపం!" అని మాత్రం గట్టిగా అన్నాడు.

ఈ మాటలను పక్క గదిలోంచి విన్న అనూరాధమాత్రం — ఈ లోకమంతటిలోనూ ఆమె ఒక్కతీ మాత్రం— జోగయ్యకోసం రెండు కన్నీటి బిందువులను రాల్చింది! ★

# సంఘజీవితం

(17-వ పేజీ తరువాయి)

చర్య ఆమెకు ఎంతమాత్రం నచ్చలేదు. దీనికి సాయం తనకు తన భర్త అలా సాయంచేయకపోవటంకూడ ఆమెను చాలా బాధించింది. ఏదో విధంగా హేమ తప్పును హేమకు తెలియపరచాలని ఆమె అనుకుంది.

ఆ సాయంత్రం పనులన్నీ అయిన తరువాత హేమ, రాజేశ్వరి కలసి వరండాలో కూర్చొని కబుర్లు చెప్పుకోడం మొదలుపెట్టారు. మాటలసందడిలో రాజేశ్వరి అంది — "ఎనిమిదిన్నరకే వంట చేసేటప్పటికి నా తల ప్రాణం తోకకు వస్తోందండి. అందులో మావారికి ఎందులోను గడ్డిపరకంత లోటుకూడ రాకూడదు. ఆయన వంటింట్లోకి వచ్చేటప్పటికి కంచము, పీట, గ్లాసు రెడీగా ఉండాలి." 'చెయ్యి ఊరుకోలేదు, కొంచెం, ఆ కంచం ఇలా పెట్టుకుందురూ' అంటే ఆ కంచం పెట్టుకుందుకు తొంభై సాధిస్తారు. ఎలాగా, మీవారు అలా కాదు. కొంచెం సర్దుకుంటారు. ఇందాకా, ఆయన కాఫీ కలిపి, ఆయన త్రాగి, మీ కివ్వటం చూస్తే నాకు చాలా ముచ్చటేసింది కాని మా అన్నగారి మెత్తదనం చూసి రేపు వంటకూడా చేయిస్తారేమోనని భయంగా ఉంది."

రాజేశ్వరి మాటలు వినేటప్పటికి హేమకు చాలా కోపమొచ్చింది. రాజేశ్వరి ఎందుకిలా అంటోందో కూడా తెలుసుకుంది. "ఎలాగా మా వారి పద్ధతి వేరు. మగవాళ్ళు మొగవాళ్లకి మల్లే, ఆడవాళ్లని బానిసల్లా చూడాలని, ఏ మాత్రం లోటువచ్చినా సహించకూడదని ఇంటిపనులలో వారికి ఏమాత్రం సాయపడినా తమకి అవమానమని తలచే రకం కాదు. నే నదృష్టవంతురాలిని కాబట్టే నాకు అటువంటి భర్త లభించాడు" అంది.

ఈ మాటలు వినేటప్పటికి రాజేశ్వరి ముఖం తెల్లబడిపోయింది. హేమ ఇలాంటి సమాధానం ఇస్తుందని మొదట అనుకోలేదు. ఇంక ఏమీ అనలేక ఒక కృత్రిమ మందహాసంతోటి తన భావాల్ని కప్పిపుచ్చింది. రాజేశ్వరికి అలా సమాధానం చెప్పిందే కాని ఆమె అన్న మాటలు హేమని చాలా బాధ పెట్టాయి. కాని ఈ సంగతిని ఆమె భర్తకు మాత్రం తెలియ చెప్పలేదు.

రాజేశ్వరి హేమ, పైకి నవ్వుతో చాలా సరదాగా మాట్లాడుకుంటున్నారే కాని అనేక విధములైన సంఘటనలచేత ఒకరిమీద ఒకరికి కావలసినంత ద్వేషం ఉంది.

ఆ యింటికి ఒకటే కుళాయి ఉంది. రెండు ఇళ్లవారికి వాడుకునేందుకు అవే నీళ్లు. ఆ నీళ్ల వాడకములో తరుచు ఇద్దరికీ కీచులాట జరిగేది. రాజేశ్వరికి ఇద్దరు పిల్లలు. వాళ్ల ముసలి అత్తమామలు కూడ వాళ్ల దగ్గరే ఉంటున్నారు. వాళ్ల ఇంట్లో ఎక్కువ జనం ఉండుటచేత హేమకు ఎప్పుడు నీళ్లు తెచ్చుకుందామన్నా కుళాయి ఖాళీగా ఉండేది కాదు. ఈచిక్కు మాత్రం హేమకు భరించరానిదిగా ఉండేది. ఇంతే కాక రాజేశ్వరి కొంచం బద్ధకస్తురాలు. ఎంగిలి కంచాలు అవీ కుళాయి దగ్గర కడిగి ఆ మెతుకులూ, తుక్కూ అలా వదిలేసేది. ఇది చూస్తే హేమకు చాలా అసహ్యం వేసేది. హేమ స్వతహాగా ఎప్పుడూ శుభ్రంగా ఉంటుంది. ఇంటిని కూడ అలాగే ఉంచుతుంది. కుళాయి కింద బిందె పెట్టుకుని నీళ్లు పట్టుకోవాలి అంటే ముందు కింద శుభ్రం చేసుకుని మరీ పట్టుకోవలసి వచ్చేది. ఒకటి రెండు సార్లు రాజేశ్వరితో అలా మెతుకులు పోయవద్దని చెప్పింది. రాజేశ్వరి ఏదో వంక చెప్పేది. "పిల్లాణ్ణి మంచంమీద పడుకోబెట్టివచ్చాను. ఏడుపు వినిపిస్తే క్రిందకు పడిపోతాడని భయంవేసి పరుగెత్తికెళ్లాను" అనో, లేకపోతే "పిల్లి వంటింట్లో కెళ్లటం చూశాను. పాలు మూత లేకుండా క్రింద ఉన్నాయి. దాన్ని కొడదామని తొందరగా వెళ్లిపోయాను. ఆ తొందరలో మర్చిపోయాను" అనో అనేది. ఈ కారణాలు విన్న తరువాత హేమ ఇంకేమీ అనలేకపోయేది. అయినా ఇంకా గట్టిగా అని దెబ్బలాట పెంచుకోటం హేమ కిష్టం లేదు. ఆ దెబ్బలాటలు మొగాళ్లవరకూ కూడా వెడతాయి. అక్కడినుంచి ఫలానా ఆవిడ మంచిది కాదని దెబ్బలాడుతుందని అంతా అనుకుంటారేమోనని భయపడేది.

ఇతరులకు తెలియని ఇటువంటి లోపాలు అనేకం ఉండేవి. రామంతో చెప్పితే లక్ష్యపెట్టేవాడు కాడు. "గడుపుకోటం నేర్చుకోలేని వాళ్ళు బ్రతుకు ఎక్కడికెళ్లినా ఒకటే" నని విసుక్కునేవాడు. అంతే కాని ఆ గడుపుకోటం ఎలాగో అతను చెప్పలేకపోయేవాడు. పాపం, హేమ ఇంకేమీ చెయ్యలేక ఊరుకునేది.

ఒకనాడు నౌకరు రాలేదు. హేమ ఉన్న వాటాకి కుళాయి చాలా దూరము. నౌకరు రెండుపూటలా నీళ్లు తీసుకువచ్చి బాత్ రూమ్‌లో నిలవచేసేవాడు. వాడు ఒక పూట రాకపోతే ఆ ఉన్న నీళ్ళతో ఎలాగో గడుపుకున్నారు. కాని వాడు రెండవపూట కూడ రాలేదు. ఇంక నీళ్ళు మోత తప్పనిసరి అయింది. హేమ నీళ్లు తీసుకువచ్చి నింపటం మొదలుపెట్టింది. ఈ పనిలో రామంకూడ కొంత సాయపడ్డాడు. ఈ ఘట్టాన్ని చూచిన రాజేశ్వరి

మనస్సులో విపరీతమైన బాధ ననుభవించింది. హేమను దప్పి పొడిచే సమయం ఎప్పుడు వస్తుందా అని కనిపెట్టుకుని కూర్చుంది.

ఒకనాడు రాజేశ్వరి హేమ, ఇద్దరూ మాటాడుకోటంలో హేమ అంది– "మీ కంటే మాకు నీళ్లకు ఎక్కువ ఇబ్బంది. ఒక్కపూట నౌకరు రాకపోతే చచ్చినట్లు అంతదూరం మోసుకెళ్లాలి." ఈ మాటలు వినేసరికి సమయం ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తున్న రాజేశ్వరి.— "నౌకరు రాకపోయినా మీకేమి ఫరవాలేదు. మీ ఆయనే మోస్తారు" అని చటుక్కున అనేసింది. ఈ మాటలకు హేమ చాలా నొచ్చుకుంది. ఆమె దీని కేమీ సమాధానం చెప్పలేకపోయింది.

ఆ రాత్రి భర్తతో హేమ, రాజేశ్వరి అన్న మాటలు చెప్పింది. ఆ మాటలు వినేసరికి రామానికి తగనికోపం వచ్చింది. ముఖం జేవురించి, కళ్లు ఎఱ్ఱపడ్డాయి. అప్పు డతని ముఖం చూసి హేమకూడ చాలా భయపడి ఎందుకు చెప్పానా అనుకుంది.

"ఆ మాటలు విని తగిన సమాధానం చెప్పకుండా ఊరుకున్నావా? రేపు ఆవిడతో "మీ మాటలకు ఆయనకు చాలా కోపం వచ్చింది, ఇంకొకసారి ఇటువంటి తెలివి తక్కువ మాటలంటే నారాయణరావు గారితో చెప్తానని, చెప్పమన్నారని" చెప్పు. నీ భర్తని అన్నందుకు నీకు ఏ మాత్రం, సిగ్గు, అభిమానమున్నా నీవు రేపు తప్పకుండా ఆవిడతో నే చెప్పినట్లు చెప్పు" అని ముక్కుడిప్ప లెగరేస్తూ, కళ్లు మరింత పెద్దవి చేస్తూ (అసలే పెద్దవి) గుక్క తిప్పుకోకుండా అన్నాడు.

"ఇది అంతా సంఘజీవితముయొక్క లాభములు. అయినా సంఘజీతమంటే పై అనేక విషయములలో ఉండొచ్చు. కాని నిత్యగృహకృత్యములలో కూడ ఎలాగ కుదురుతుంది?"

అందరి అభిప్రాయాలు ఎప్పుడూ ఒక్కలా ఉండవు. మనము మహదాశయములుగా పెట్టుకున్న కొన్నిటిని కొందరు అతి తుచ్ఛముగా భావిస్తారు. మనకు చెడ్డగా తోచిన కొన్నిటిని ఇతరులు మంచిగా భావిస్తారు. "ఇంటిగుట్టు లంకకు చేటు" అన్నట్లు ఇంకొకళ్లతో కలసి ఉంటే మన రహస్యాలేవీ దాగవు. కేవలం వాళ్లకి తెలిసి అంతటితో పోవు. మరునాటికి జగద్విఖ్యాతాలవుతాయి "ఒకళ్ల ఇంట్లో జరిగే వాటితో మనకెందుకు గొడవ" అని ఊరుకునే స్వభావం మనలో లేదు. ఇటువంటి స్వభావాలు కేవలం చదువుకోని స్త్రీలలో మాత్రమే ఉంటాయని, వాళ్లు ఎంతసేపూ ఎదుటవారింట్లో కూరను గురించి, వెనకవారింట్లో పప్పును గురించి మాత్రమే మాట్లాడుకుంటారని నే నింతవరకు అనుకుంటున్నాను. కాని ఈనాడు స్వానుభవం మీద ఈ విషయంలో చదువుకున్నవారు, చదువుకోనివారు కూడ ఒకటేనని తెలుసుకున్నాను. చదువుకున్న విజ్ఞానులు ఇక తను చదువును ఎందుకు వినియోగపరుస్తారో! అయినా ఈ మాటలు రేపు ఆవిడతో ఏమని చెప్పను?" మాశాను కాబట్టి అన్నాను. నే నేమైనా అబద్ధమాడేనా! అయినా ఆయనని నేనేమి దూషించలేదు. పైగా మంచిపని చేస్తున్నందుకు సంబరపడ్డాను కూడాను" అంటుంది. ఇంకే మనమంటారు?

"అయినా ఇద్దరు ఆడవాళ్లు ఎక్కడ కూడితే అక్కడే గొడవ. మా మొగాళ్లకిలాంటివేమీ ఉండవు."

"ఆ, ఆడవాళ్లను అంత తీసిపారెయ్యకండి. ఇంటిపనులన్నీ మీరు నిర్వహిస్తున్నప్పుడు పనివాళ్లతోటి, ఇరుగు పొరుగు వాళ్లతోటి మీకూ గొడవలు వస్తాయి. ఇప్పుడవేవీ లేకుండా వీధిగదిలో కుర్చీలో కూర్చుంటారు. కాబట్టి గొడవలు లేవు. అయినా వీటిలో మీ మొగాళ్లు ముట్టుకు ఏం తీసిపోయారు? మీలో మీకు ఉన్నాయి గొడవలు— "రామారావు అలాంటివాడని, సుబ్బారావు ఇలాంటివాడని" అవన్నీ మనసులో ఉంచుకుని పైకి 'హల్లో, అంటే హల్లో' అనుకుంటారు. మేమూ అంతే!"

రామం దీనికేమీ సమాధానం చెప్పలేదు. కాని ఆ మరునాటినుంచి ఇంకొక ఇల్లు చూడ సాగేరు. *

సినీవరా:

# కొత్తా, పాతా




అంజలివారి 'పర దేశి'లొ గణేశన్

కొత్త ఒక వింతనీ, పాత రోత కలిగిస్తుందనీ చెప్పే సామెత సినిమారంగంలో చిత్రంగా వర్తిస్తుంది. అంటే కొత్త తరహాలూ కొత్త పోకడలూ ప్రేక్షకుల్ని ఆకర్షిస్తాయని నిర్మాతలకు తెలుసును. కాని బొత్తిగా పాత పద్ధతుల్ని కొట్టివెయ్యలేరు సరిగదా కొందరు ఆ పాతనే పట్టుకు వేళ్లాడతారు. ఈ పాతల్ని ఒక్కొక్క కొత్త వచ్చి కొట్టేస్తూ ఉంటుంది. ఆ కొత్తని తెచ్చి పెట్టేవారూ ఈ నిర్మాతలే. కాని అటువంటివారు బహు కొద్దిమంది. అయితే ఆ కొత్త పాత అయిపోడానికి ఆట్టే కాలం పట్టదు. అలా పాత అయింది అరడజను అనుభవాల్లో కాని అంతరించదు.

ఈ కొత్త పాతల ఆటుపోట్లు అన్నింటా ఒకవిధంగా వర్తించవు. తారల విషయంలో

భరణీవారి 'ప్రేమ'లో భానుమతి, శివరావు, రేలంగి.





ఏ. యన్. ప్రొడక్షన్స్‌వారి 'ఆడబ్రతుకు'లో శ్రీరంజని, బేబీ మల్లిక, రఘురామయ్య.

సామాన్యంగా ఒకో ముఖం పాతబడిపోడానికి చాలా కాలం పట్టుతుంది. కథల పోకళ్లు కొత్తవి పాతబడిపోడానికి అట్టే కాలం పట్టదు.

*　　*　　*　　*

కొత్తపోకడలు పోడానికి గానీ కొత్త ముఖాల్ని తెరమీది కెక్కించడానికిగానీ నిర్మాతకి ఆత్మవిశ్వాసం, ధైర్యం పెద్ద మోతాదులో ఉండాలి. లక్షలమీద జరిగే వ్యాపారంలో జాగ్రత్తగా ఉండకపోతే లక్షాధికార్లు భిక్షాధికారులైపోగలరు. అందువల్ల ఆ ధైర్యం, ఆత్మవిశ్వాసం కలవారు బహు కొద్దిమంది కనపడతారు. తెలుగుసినిమారంగంలో ఎప్పుడూ ఏదో కొత్తమోజులు చూపించే నిర్మాత హెచ్. యం. రెడ్డిగారు. అసలు తెలుగుసినిమాకి వీరే పితామహులు. వీరి తరవాత వాహినీ, విజయా నిర్మాతల్ని కొత్తదనం చూపించేవారని చెప్పుకోవచ్చు. అయితే వీరు కొత్తదారులు తొక్కినా బహు జాగ్రత్తగా, భయపడుతూ దారి వెతుక్కుంటూ నడుస్తారు. షావుకారులో రౌడీహాస్టల్ సీన్ చూపించారంటే కారణం వారి భయమనే చెప్పాలి. 'పెళ్లిచేసిచూడు' కొత్తతరహా సాంఘిక



యం. కె. యం. వారి 'మరదలుపెళ్లి'లో ముక్కామల కృష్ణమూర్తి.

సీలుఆన్సరు
మడలను
ప్రీమియర్‌బాక్సు్‌కీలో

బహుమతి రూ **10,000**
**MURALI CROSS WORDS**
ముర్లీ 1, 2, కాలమ్ వర్డ్సు
GOVT REGD NO 1894

ముగింపుతేది
10-4-52

వరుస 1కి
నాలుగు
అణాలు

మొదటి బహుమతి రూ. **7000**

MURALI

ఇతర బహుమతి రూ. **3,000**

## Closing Date 10-4-52 (Subject to Rules and Conditions.)

| | | జవాబులు 1 | 2 |
|---|---|---|---|
| 1 | పోటీదారులకు———చేకూర్చుటకై మురళి క్రాసువర్డ్సు ఎల్లప్పుడు ప్రయత్నించును | శుభము | లాభము |
| 2 | కమనీయ సౌరభం గల———దొరికిననాడు యువకుడు పొంగిపోవును | వసువు | మధువు |
| 3 | ముఖమునకు అందమునిచ్చునవి ముఖ్యముగా యివియేనని చాలామంది అభిప్రాయము | కళ్ళు | పళ్ళు |
| 4 | ఈ వ్యక్తియడల స్త్రీలు ఆసక్తిచూపించెదరు | భోగి | యోగి |
| 5 | కొన్ని పరిస్థితుల్లో దీని అవసరము యెంతటివారికైనను కలుగకమానదు | కలిమి | చెలిమి |
| 6 | ఆడపిల్లల వివాహమునుగురించి తండ్రులకు వెనుకటికంటె ఇప్పుడు తాపత్రయము——అయినది | ఎక్కువ | తక్కువ |
| 7 | మనము యేపని చేయునప్పటికీ ఈ విషయమును విస్మరించరాదు | రీతి | నీతి |
| 8 | కేవలను దీనిమీదనే లక్ష్యముంచినయెడల ఈ రోజులలో ప్రయోజనము తక్కువ | కర్మము | ధర్మము |
| 9 | సినిమాలలో దీనికి ప్రాధాన్యత నివ్వవలెనని నిర్మాతలు తెలుసుకొనుచున్నారు | విజ్ఞానము | వినోదము |
| 10 | దీనిని యెరుగకొనుటలో ధైర్యము ప్రదర్శించిన వ్యక్తులు రాణించగలరు | కష్టము | నష్టము |
| 11 | ఆనాటినుండి ఇది కొందరికిమాత్రము వృత్తిగా నియమింపబడెను | వ్యాపారము | వ్యభిచారము |
| 12 | ———ను జరపదలచినవారు రాబోవు మంచి చెడ్డల నాలోచించుకొని దిగవలెను | సంచారము | సంహారము |
| 13 | అందమైన———ను, చూచుటకు ఆనందముగా నుండునుకదా? | కోట | తోట |

**మీ జవాబులు ఈ ఇండ్లయందు 1. 2 మూలముగా పూర్తి చేయుడు**

1
2
3
4
5
6
7
8
9
10
11
12
13

**పైనుండి క్రిందవరుసగా జవాబులవరుస 1కి 4 అణాలుమాత్రం రూపాయికి 5 వరుసలు పూర్తిచేయుడు**

7 వ. పోటీ సీలు ఆన్సరు

1 1 1 2 2 2 2 2 2 2 2 1 1

మా కూపనులను సేకరించిపంపు కలెక్టర్లు ప్రతి వూరియందును కావలయును.

వివరములకు దిగువ అడ్రసుకు వ్రాయుడు.

పేరు..........................................................

అడ్రసు..........................................................

P. O. or M. O. No.........Col No.......... మొత్తము రూ....... మొత్తం వరుసలు..........

In entering the Competition I agree to abide by the Competition Rules & Conditions and to accept the Competition Manager's decision as final and legally binding.


**No. 9**

*Address Entries to:* **MURALI CROSSWORDS, PALMANER.** (CHITTOOR DIST)

చిత్రమే అయినా జాగ్రత్త పడాలని మరీ ఎక్కువ జాగ్రత్తపడ్డారు. వాహినీవారు అలా కాదు. వారు ఇదివరలో సాంఘిక చిత్రాలు తీసినప్పుడు చాలావరకూ కథలోనే జాగ్రత్తపడి ప్రేక్షకుల్ని ఆకర్షించగల సన్నివేశాలు సృష్టించి కథావృత్తంతో సమన్వయించుకుని చిత్రానికి సమగ్రస్వరూపం ఇచ్చేవారు.

* * * *

ఒకరు ప్రారంభించిన కొత్త పోకళ్లని పదిమందీ అనుకరించేసరికి అవన్నీ పాతవైపోయి, అరడజనో డజనో కావచ్చేసరికి నిర్మాతలకి దెబ్బ తగిలేది. దాంతో అది విడిచిపెట్టి మరోదారి (అంటే ప్రేక్షకుల్ని ఆకర్షిస్తుందని ఎవరో ఒకరు చూపినదారి) పట్టుకుని పదిమంది అనుకరించడం మామూలైపోయింది.




మహబూబ్ ప్రొడక్షన్స్ వారి 'ఆన్'లో దిలీప్‌కుమార్.

ఈ కొత్త పాతల్లో నిజంగా ఏది కొత్తదో, ఏది పాతదో తెలుసుకోడం కష్టం. ఎందువల్లనంటే మనకి కొత్తగా ప్రవేశపెట్టినవి హాలీవుడ్‌లోనో బొంబాయిలోనో నిర్మించబడిన చిత్రాల పోకళ్లకి మక్కీకి మక్కీగానో రంగూ రూపం మార్చి నకళ్లుగా ఉండేవి కొన్ని. కొందరు పాత తరహాలు వొదులుకోడానికీ ధైర్యం లేక కొత్తమెరుగు లుండకపోతే అదేంచిక్కోననీ జంకి రకరకాలు గుచ్చెత్తి కలగాపులగం తయారుచేస్తారు. చిత్రమైన తరహాలు కనపడతాయి. జానపద చిత్రాల్లో (కథల్ని బట్టి జానపదాలు అనుకుంటేసరిపోతుంది) పాశ్చాత్య నృత్యాలు, పౌరాణిక చిత్రాల్లో టుమ్రీపాటలు, సాంఘిక చిత్రాల్లో పతివ్రతల కథలు, చారిత్రక చిత్రాల్లో జానపదాల వాతావరణం కనపడతాయి.

ఈ కలగాపులగం పాతదేఅయినా ఇప్పటికే అది వొదల్లేదు. కాని ఇప్పుడో కొత్త తాకిడి తగిలింది సినీమాలకి. హిందీచిత్రాల్లో రెండేళ్లుగా సాంఘికమనుకోబడే కథలు పాముతోకలా ఏడు వంకర టింకర్లు తిరిగి సుఖాంతమో, దుఃఖాంతమో, రెండింటి మసాలానో తయారౌతున్నాయి. ఇటీవల తెలుగు చిత్రనిర్మాతలు కూడా కథల్లో

(47-వ పేజీ చూడండి)



పీపుల్స్ వారి "పల్లెటూరు"లో ఎన్. టి. రామారావు, గ్రామప్రజలు.



యువావారి టింగ్‌రంగాలో వీణావతి.

# మద్రాసు డైరీ

(3-వ పేజీ తరువాయి)

అయిన పరిస్థితుల మధ్య పడవేసి, ఆయన ఏవిధంగా ప్రవర్తిస్తాడో పరీక్షించి చూస్తాడు రచయిత. రావుగారు మొదట బిచ్చగత్తెను చూసి అసహ్యించుకుంటాడు. మానసికంగానూ, శారీరకంగానూ కూడా ఆయనకు ఆమెమీద సానుభూతి ఏర్పడదు. ఇంతలో తుపాను వస్తుంది. ప్రకృతిశక్తులు విజృంభించి రావుగారిని, ఆయన నిశ్చిత అభిప్రాయాలను, ఆటవస్తువులవలె ఆడిస్తాయి. ఆహోరువానలో, ఒంటరితనంలో, ఆయనహృదయం చుట్టూ కట్టుకున్న, గోడలు కూలిపోతాయి. ఆమె నీచతరగతి మనిషి అయితే నేం, సాటి మానవప్రాణి. వెచ్చని ఆమె కౌగిలింతలో ఆయనకీ ఏకాంత, భీత వహ విశ్వంలో పట్టుకొమ్మ దొరికినట్లనిపిస్తుంది; మానవుని ఏకత్వం స్ఫురిస్తుంది. ఆమె తన పర్సు దొంగిలించినా ఆయనకు కోపం కలగదు. ఆమె చనిపోతే చంటిబిడ్డవలె ఏడుస్తాడు. ఎందుకంటే ఆయన జాగ్రత్తగా ఇటుకమీద ఇటుకగా నిర్మించుకున్న విలువల మేడ తుపానులో తలక్రిందులైంది.

కథలో ముఖ్యవస్తువు రావుగారి విలువల మేడ కూలిపోవటం. ఈ ముఖ్యవస్తువులోనే కాకుండా కథాకథనంలో కూడా చాల వాక్యాలలో 'బిహేవియరిజం' ఛాయలు కనిపిస్తాయి. ఆలస్యంగా వచ్చిన రైలెక్కుతుంటే రావుగారికి ఇంటిదగ్గర సుఖాలు జ్ఞాపకం వస్తాయి. 'స్పర్శకు అన్నీ చల్లగా ఉండటం'తో రైల్లోని యువకుడు భార్యకు దగ్గరగా జరుగుతాడు. బిచ్చగత్తెకళ్ళలో ఉండకూడని తళుకు ఉండటం చూసి రావుగారి మనస్సులో విరోధభావం కలుగుతుంది. వెయిటింగ్ రూములో అకస్మాత్తుగా పెద్ద చప్పుడైతే రావుగారు ఒక్కదూకుతో బిచ్చగత్తెను కౌగిలించుకుంటాడు. ఇలా చాలా ఉదాహరణలు చూపవచ్చును. కథను ఆనందించటానికి 'బిహేవియరిజం' సహాయం అవసరం లేదన్నా, పద్మరాజుగారు తన కథ బిహేవియరిజం మనసులో పెట్టుకుని రాసింది కాదన్నా అది వేరేసంగతి కాని ఈ కథ యాంత్రికమైన 'బిహేవియరిజం' సిద్ధాంతాన్ని దాటి ఆఖరున రావుగారిలో 'మానవత్వాన్ని వికసింపజెయ్యటం' తో ముగుస్తుంది. ఇది గమనించవలసినవిషయం.

పద్మరాజుగారు మొదట ఇంగ్లీషులో కథ వ్రాసి తరవాత హడావిడిగా తెలుగులోకి తర్జుమా చేశారు. ఇందువల్ల తెలుగు కథలో జాతీయం కొంత కుంటుపడినట్లు తోస్తుంది. కాని బహుమతి నిచ్చింది ఇంగ్లీషు కథనుబట్టి గనుక కథా ప్రాశస్త్యాన్ని సందేహించవలసిన అవసరం లేదు. (ఈ కథ తెలుగు తర్జుమా ఈ సంచికలోనే వేరుగా ప్రకటింపబడింది.)

* * * *

పద్మరాజుగారి కథకు ప్రపంచ బహుమతివస్తే శ్రీమతి టి సూర్యకుమారికి అందాల పోటీలో 'మిస్ మెడ్రాస్' బిరుదు లభించింది. ఉత్తమకథను నిర్ణయించటానికి అవసరమైనట్టే ఉత్తమ సౌందర్యాన్ని నిర్ణయించటానికి కూడా కొన్ని ప్రమాణాలుంటాయి. ఈ ప్రమాణాలను అందాలపోటీ నిర్ణేతలు ఎంతవరకు పాటించారో తెలియదు గాని నటనారంగంలో పైకి రాలేకపోయిన సూర్యకుమారి మద్రాసులోకల్లా అందగత్తెగా నిర్ణయింపబడటం ఆమె గర్వించదగిన విషయమే. పత్రికా విలేఖరులతో మాట్లాడుతూ ఆమె "ఈ నిర్ణయం నన్ను పులకింపజేసింది," అని అనటంవల్ల, సూర్యకుమారికి "మిస్ మెడ్రాస్" బిరుదు రావటం మనకే కాకుండా ఆమెకుకూడా తలవని తలంపు అయినట్లు తోస్తుంది.

* * *

గవర్నరుపదవినుండి విరమించిన శ్రీ భావనగర్ మహారాజా మద్రాస్ రాష్ట్రంలోని అన్ని రాజకీయవర్గాల అభిమానాలను చూరగొన్నారు. ఆయన ఏ రాజకీయ వాదంతోను సంబంధం లేని తటస్థవాది కావటమే ఇందుకు ముఖ్యకారణం కావచ్చును. అంతే గాక మహారాజా, ఆయన సతీమణి అనేక ప్రజాహితసంస్థల

కార్యక్రమాల్లో ఉత్సాహంతో పాల్గొని రాష్ట్రంలోని సామాన్యపౌరులకు కూడా అభిమానపాత్రులయ్యారు

భావనగర్ మహారాజా స్థానంలో సుప్రసిద్ధ కాంగ్రెస్‌వాది, రాజకీయవేత్త అయిన శ్రీ శ్రీ ప్రకాశగారు గతవారం మద్రాసు గవర్నరుగా పదవీస్వీకారం చేశారు కేంద్రప్రభుత్వానికి రాజకీయ శిరోవేదన కలిగిస్తున్న మన రాష్ట్రానికి శ్రీ ప్రకాశగారివంటి సమర్థులు, గవర్నరుగా పూర్వానుభవం కలవారు నియమింపబడటం హర్షించదగినది. "మీరు మద్రాసు వస్తే బావుండును," అని వరసగా ముగ్గురు తమిళ నాయకులు (రాజగోపాలాచారి, గోపాలస్వామి అయ్యంగార్, టి టి కృష్ణమాచారిగార్లు) తనతో ఇదివరలో అన్నట్లు, మద్రాసుకు గవర్నరుగా రావటం నిజంగా మహద్గౌరవంగా భావిస్తున్నట్లు శ్రీ ప్రకాశగారన్నారు వచ్చీరాగానే క్షామప్రమాదానికి లోనైన రాయలసీమను దర్శించటానికి ఉద్దేశించటం వల్ల వీరు రాష్ట్రపరిస్థితులలో అత్యధికమైన శ్రద్ధాసక్తులు వహించనున్నట్లు స్పష్టమౌతున్నది శ్రీ ప్రకాశగారు పండిట్ నెహ్రూకు కుడిభుజంవంటివారు; మేధావి; సరసుడు; పరిపాలనాదక్షుడు. అందుచేత వివిధమైన అరమరికలు లేకుండా కలుషితమైన రాష్ట్రరాజకీయ వాతావరణాన్ని నిర్మూలంచేస్తారనీ, ఆంధ్రుల చిరకాల వాంఛితమైన ప్రత్యేక రాష్ట్రసిద్ధికి తమ పలుకుబడితో దోహదం చేస్తారనీ ఆశించుదాం —సవ్యసాచి





# కొత్తా, పాతా

(44-వ పేజీ తరువాయి)

అన్ని అసందర్భాలూ పెట్టి పాటలూ నృత్యాలతో (ఇవి మళ్ళీ పాత ఉసిరిక పచ్చళ్ళే) నింపి పద్దెనిమిదవేలూ ఇరవై వేలూ అడుగుల చిత్రాలు దేశంమీద వొగ్గుతున్నారు అయితే ఈమాదిరి 'కొత్త' ఎన్నాళ్ళో కాదు మొదటే నిలవడం కష్టం అనిపిస్తుంది

## అభ్యుదయా ఫిలిమ్స్

మరొక కొత్త తెలుగుసినిమా కంపెనీ, అభ్యుదయా ఫిలిమ్స్ (ఆలందూర్) మార్చి 5 వ తేదీని తమ తొలి సాంఘిక చిత్రానికి ప్రారంభోత్సవం జరిపారు చిత్రం పేరు "కూలి" దీనికి శ్రీ జంపన చంద్రశేఖరరావు గారు కథ, పాటలు వ్రాసి దర్శకత్వం నిర్వహిస్తారు సహాయదర్శకుడు శ్రీ కత్తెర వెంకటేశ్వరరావు ప్రారంభోత్సవానికి పరిశ్రమకు సంబంధించిన పెద్దలు చాలామంది వచ్చారు. ★

# వ్యాఖ్యలు, విమర్శలు


(2-వ పేజీ తరువాయి)

గారు ఆహ్వానిస్తే, నవాబుగారు నిరాకరించి పటేల్ గారినే హైదరాబాద్ రమ్మని తిరుగా ఆహ్వానం పంపారు వీరక్కడికి వెళ్ళనూ లేదు వారిక్కడికి రానూ లేదు, రాయబారాలూ విఫలమైనాయి. పోలీసు చర్య అనంతరం పటేల్ గారూ, నెహ్రూ గారూ కూడా హైదరాబాద్ దర్శించారు

ఇప్పుడు హైదరాబాద్ ఇతర ప్రాంతాలతో పాటు ప్రజాస్వామ్య వ్యవస్థలో అడుగుపెట్టింది నవాబుగారు రాజప్రముఖ్ హోదాలో ఢిల్లీలో భారతదేశ సమస్యల్ని విశాలదృష్టితో పరిశీలించే చర్చలలో పాల్గొంటున్నారు. నవాబుగారు సపరివారంగా ఢిల్లీకి బయలుదేరేముందే పీపుల్స్ డెమోక్రటిక్ ఫ్రంట్ వారు సమావేశమై నవాబుగారిని రాజప్రముఖ్ హోదానుంచి తొలగించి హైదరాబాద్‌ను మూడు భాషాప్రాంతాలుగా విభజించాలని భారతప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ తీర్మానించారు ఈ విజ్ఞప్తికి రాజప్రముఖులెవరూ కారు, భారతప్రభుత్వం కూడా సుముఖంగా లేదు నవాబుగారు ఇతర గవర్నర్లు రాజప్రముఖులతోపాటు దేశంలోవచ్చిన పరివర్తన కనుగుణంగా తమ కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నంతకాలం భారత ప్రభుత్వానికి భాషాప్రాంతాలుగా విభజించవలసిన అవసరం గోచరించకపోవచ్చును.

నవాబుగారికి జన్మభూమిపట్ల అభిమానం అధికం శ్రీ బూర్గుల రామకృష్ణరావుగారు ముఖ్యమంత్రిగా ప్రమాణం స్వీకరించే సమయంలో ముందు ఇష్టాగోష్ఠిలో వారితో 'మనం ఇద్దరమూ ఈ దేశంవాళ్ళమే'అన్నారుట తమ రాజ్యంలో తయారయ్యే వస్తువులే కాని ఆయన వాడరని ప్రతీతి. నవాబుగారికి హైదరాబాద్ విడిచి ఎక్కడికీ వెళ్ళడం ఇష్టంఉండదుట. ఇప్పటికీ కర్తవ్యభారంవల్ల కదలడానికి సమ్మతించారు. ★





## హకల్ బెరీ ఫిన్

(30-వ పేజీ తరువాయి)

"ఊహు."

"ఆవు పిల్లిలాగా మాట్లాడు తుందా? పోనీ పిల్లి ఆవులాగా మాట్లాడు తుందా?"

"ఊహూ."

"ఆవు ఆవులభాష, పిల్లి పిల్లులభాష మాట్లాడ తాయి. అది సహజం దానికేం పేచిలేదు. అవునా?"

"ఒప్పుకున్నా."

"తరవాత—పిల్లి, ఆవూ రెండూ మనలాగా మాట్లాడతాయా?"

"ఒప్పుకున్నాను హాక్ గారూ, ఒప్పుకున్నాను. పిల్లి పిల్లి భాష, ఆవు ఆవుభాష మాట్లాడతాయి. ఆ రెండూ మనలాగా మాట్లాడవు. మాట్లాడక పోతే ఏమిటంటారు?"

"అల్లాగే ఫ్రెంచి మనిషి ఫ్రెంచి భాషలో మాట్లాడటంకూడా సహజమే నంటాను"

"ఇంతా చేసి ఇదా మీరు చెప్పేది? బలే వారండి మీరు హాక్ గారూ? మట్టిబుర్ర ఎవరిదో చూపిస్తాను. పిల్లి మనిషా?"

"కాదు."

"అందుచేత పిల్లి మనిషిలాగా మాట్లాడదు. ఆవు మనిషా?"

"కాదు."

"అందుచేత ఆవు మనిషిలాగా మాట్లాడదు. అంతేనా?"

"అంతే"

"సరే ఫ్రెంచి మనిషి మనిషేనా?"

"ఆ"

"మనం మనుష్యులమేనా?"

"ఆ"

"అయితే ఫ్రెంచి మనిషి మనలాగా మాట్లాడాలా వద్దా? దీనికి సమాధానం చెప్పండి"

జిమ్‌తో మాట్లాడటం అనవసరమని వాదన అక్కడితో ఆపుచేశాను. నీగ్రోలకి అసలు వాదించటమే తెలియదు.

(ఇంకా వుంది)

## చెల్లాయికి ఉత్తరాలు

(35-వ పేజీ తరువాయి)

చెదరకుండా వున్నాయంటే ఆశ్చర్యంగా లేదూ!

అసలు ఏ దేశపు ప్రాచీన చిత్రకళను తీసుకున్నా నీకో విషయం బోధపడుతుంది. పూర్వపు గ్రీకు శిల్పులు, చిత్రకారులు, ఈజిప్టు, చైనా, జపాను, జావా, ఇటలీ దేశాల చిత్రకారులు, శిల్పులు దేవుడికి, మతానికి సంబంధించిన విషయాలే తీసుకుని బొమ్మలు వేశారు, విగ్రహాలు, ఆలయాలు చెక్కారు యూరప్ దేశాలవాళ్లు క్రైస్తవమతం తాలూకు కథలు, ఆసియా దేశాలవాళ్లు బౌద్ధమతం తాలూకు కథలు తీసుకుని అద్భుతమైన చిత్రకళ సృష్టించారు. బౌద్ధమతం మన దేశంనుంచి చైనా, జపాన్, సింహళం, జావా, సయాం, బోర్నియో మొదలైన చోట్లకి వ్యాపించింది. మనదేశంలో బౌద్ధమతం నశించిపోయి, హిందూమతం మళ్ళీ బలపడింది బౌద్ధమతం నశించిపోగానే బౌద్ధకళకూడా నశించింది. కాని బౌద్ధులనుంచి నేర్చుకున్న శిల్పాన్ని హిందూశిల్పులు ఉపయోగించుకుని దక్షిణ భారత దేశంలో మధుర, కంచి, మహాబలిపురం, అటు ఎల్లోరా, మొదలైన చోట్ల గొప్ప గొప్ప దేవాలయాలు కట్టారు.

బౌద్ధమతం మనదేశంలో నశించిపోయినా తూర్పు ఆసియా దేశాల్లో ఇప్పటికీ వుంది. ఆ దేశాల్లో కూడా పూర్వ కాలంలో బౌద్ధ చిత్రకళ, శిల్పం బాగా ఔన్నత్యం పొందింది.

అజంతాచిత్రకళ నలుగురికీ తెలిసి, నలుగురిచేతా మన్ననలు పొందటం మొదలుపెట్టి నంరేళ్లు కూడా కాలేదు. అజంతాను చూశాక మళ్ళీ అల్లాంటి చిత్రకళను వ్యాప్తిలోకి తీసుకురావాలని మనదేశంలో కొందరికి బుద్ధి పుట్టింది. బెంగాల్ రాష్ట్రంలో అవనీంద్రనాథ టాగూరు మొదలైనవాళ్లు అజంతాచిత్రాలు మనస్సులో పెట్టుకుని బొమ్మలు గియ్యటం మొదలుపెట్టారు. మన ఆంధ్రదేశంలో దామెర్ల రామారావుగారు, అడవి బాపిరాజుగారు, ఇంకా అనేకమంది అజంతా బొమ్మల సంప్రదాయాన్ని అనుసరించి చిత్రలేఖనం ప్రారంభించారు. నువ్వు పెద్దయ్యాక ఈ చిత్రకళ చరిత్ర చూస్తూ చక్కగా నేర్చుకో. ఈ వారానికిది చాలనుకుంటా.

నీ అన్నయ్య
—ఎన్నార్.

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St., Madras



అజంతా వారి...
వయ్యారిభామ
డైరెక్టర్... పి. సుబ్బారావు
...సంగీతం...
రాజేశ్వరరావు
..రచన.. ..పాటలు.
ఆత్రేయ.. సముద్రాల..
..ఛాయ.. ..ఆర్టు..
పంచూచౌదరి.. ప్రసాద్..
..నిర్మాతలు..
లక్ష్మీనారాయణ,సుబ్బారావు
AJANTHA
CH. E. PRASAD

Regd No. M. 4479

